ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

కడప : fb.com/vaartha Digital

Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

26-10-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 264 పేజీలు: 10+4 వెల: 8.00



పిహెచ్‌సి డాకర్ల సమ్మె విరమణ 2లో

భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశం: మరియా మచాడో 5లో


## ముంచుకొస్తున్న 'మొంథా'



### రాష్ట్రానికి మరో తుఫాను ముప్పు

### ఐదు రోజులు భారీ వర్షాలకు అవకాశం

### గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాలకు అతిభారీ వర్ష సూచన

### తీరం వెంబడి గంటకు 70 కి.మీ వేగంతో ఈదురుగాలులు

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి తుపాను ముప్పు పొంచి ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతోందని చెప్పింది. తీవ్ర వాయుగుండంగా రూపాంతరం చెందే అవకాశం ఉందని పేర్కొంది.ఆ ప్రభావంతో తుఫాన్‌గా పరిణమించే అవకాశం ఉంది. దీని ప్రభావంతో నేటి నుంచి 48 గంటలనుంచి 72 గంటల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆపైన మరో 48గంటల పాటు వర్షాలు కురిసే అవకాశం లేక పోలేదు,. తర్వాత సోమవారం నాటికి నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఇది తుపానుగా మారితే మొంథా (మొన్‌థా)గా భారత వాతావరణ శాఖ నామకరణం చేయనుంది. దీనికి ఈ పేరును థాయ్ లాండ్ సూచించింది. దీని ప్రభావం >>2

ముందు జాగ్రత్త చర్యలతో అప్రమత్తం: సిఎం చంద్రబాబు 2లో

## భారీగా దుబాయ్ పెట్టుబడులు

**విజయవాడ, అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో భారీ పెట్టుబడులను పెట్టేందుకు యుఏఈ (దుబాయ్) ప్రభుత్వం,అక్కడి వాణిజ్య సంస్థలు అత్యంత ఆసక్తిని కనబరిచినట్లు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. పెట్టుబడులపై అత్యంత ధీమాతో స్వదేశానికి వచ్చినట్లు ఆయన వివరించారు.దుబాయ్ పర్యటనల్లో మూడు రోజులు ఆయా సంస్థలకు మన రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వివరించినట్లు తెలిపారు.వారు రాష్ట్రంలో పెట్టుబడులకు అత్యంత ఆసక్తిని చూపించడంతో పాటు మన రాష్ట్రానికి వస్తున్నట్లు తెలిపారన్నారు.తన మూడు రోజుల పర్యటనపై సీఎం చంద్రబాబు 'ఎక్స్' వేదిక పలు అంశాలను ప్రజలకు వివరించారు.ఈ పోస్టుకు అనుసరణగా సీఎం పర్యటనపై సీఎంవో కీలక వివరాలను వెల్లడించింది. సింగపూర్,ఇటు యూఏఈలతో పాటు వివిధ దేశాల్లోని ప్రముఖ సంస్థలను విశాఖలో జరగబోయే పెట్టుబడుల సదస్సుకు వచ్చేలా చూడాలని ఈడీబీ అధికారులకు సీఎం చంద్రబాబు తన పర్యటనల్లో భాగంగా వారితో జరిపిన సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. ఏపీలో పెట్టుబడులకు ఆసక్తి కనపర్చిన సంస్థలకు చెందిన ప్రతినిధులతో నిరంతరం టచ్‌లో ఉండాలని సూచించారు. వచ్చే నెలలో జరగబోయే భాగస్వామ్య సదస్సుకు ఇంకా ఎంతో సమయం లేదని, ఇప్పటి నుంచి ఆ కార్యక్రమాన్ని సక్సెస్ చేసేలా పని చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భాగస్వామ్య సదస్సుకు వివిధ సంస్థల ప్రతినిధులు, సీఈఓలతో పాటు వివిధ దేశాల నుంచి ప్రభుత్వ ప్రతినిధులు, నిపుణులు హాజరయ్యేందుకు వీలుగా ముఖ్యమంత్రి వారిని ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ప్రతిపాదనలతో వస్తాం, పెట్టుబడులు పెడతాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద పలువురు యూఏఈ పారిశ్రామిక వేత్తలు ఆసక్తిని కనబరిచారు. మూడురోజుల పర్యటనను ముగించుకుని సీఎం చంద్రబాబు బృందం తిరిగి రాష్ట్రానికి చేరుకున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా యూఏఈ దేశాల్లో సీఎం చంద్రబాబు విస్తృతంగా పర్యటించారు. మొత్తంగా 25 కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన సంస్థల అధినేతలతో వేర్వేరుగా భేటీలు నిర్వహించారు. అలాగే పలువురు యూఈఏ ప్రభుత్వ ప్రతినిధులు, ఆ దేశంలోని పలువురు మంత్రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఉన్న అవకాశాలను వారికి ఆసాంతం వివరించారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాలను అభివృద్ధి చేస్తున్నామనే విషయాలను సీఎం చెప్పారు. ఉత్తరాంధ్ర కేంద్రంగా ఐటీ కంపెనీలు, ఏఐ రంగం, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో అభివృద్ధికి అవకాశం ఉందని చెప్పారు. ఈ క్రమంలో విశాఖకు గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటుకు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయనే అంశానికి సంబంధించిన వివరాలను పారిశ్రామిక వేత్తలు ప్రత్యేకంగా సీఎం చంద్రబాబును అడిగి తెలుసుకున్నారు.రాయలసీమ జిల్లాల్లో పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు, ఎరో స్పేస్, డ్రోన్ సిటీ, హార్టికల్చర్, సెమీ కండక్టర్ వంటి పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నా యని సీఎం వారికి వివరించారు.గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలతో పాటు, ఆక్వాకల్చర్ బాగా అభివృద్ధి చెందుతోందని, ఇక్కడ టూరిజానికి పెద్ద ఎత్తున అవకాశం ఉందని వివరించారు. అమరావతి కేంద్రంగా దేశంలోనే తొలి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయబోతు న్నామని, అమరావతి, విశాఖ, గుంటూరు, తిరుపతి, రాజమండ్రి వంటి నగరాల్లో రియల్ ఎస్టేట్ రంగానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయని సీఎం బృందం వివరించింది. సుదీర్ఘ తీర ప్రాంతం, లాజిస్టిక్స్ రంగంలో అవకాశాలు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైల్వేల ద్వారా కనెక్టివిటీ వంటి అంశాలను సీఎం ప్రత్యే కంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో >>2



- రాయలసీమలో పునరుత్పాదక ఇంధనరంగం వైపు పారిశ్రామికవేత్తలు మొగ్గు
- ఏరోస్పేస్, డ్రోన్‌సిటీ, హార్టికల్చర్, సెమికండక్టర్ పరిశ్రమల ఏర్పాటుపై సహకారానికి సిద్ధం
- యుఎఇ పారిశ్రామికవేత్తలకు విశాఖ సదస్సుకు ఆహ్వానం
- టూరిజానికి దుబాయ్ నుంచి ప్రోత్సాహం: సిఎం చంద్రబాబు

## ఒకే యేడాదిలో అద్భుత ఫలితాలు సాధించాం

### ఈ దశాబ్దం ప్రధాని నరేంద్ర మోడీదే: సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ఒకే ఏడాదిలో సూపర్ సిక్స్ హామీలను విజయవంతంగా అమలు చేసిందని చంద్రబాబు వెల్లడించారు. రాష్ట్రానికి కేంద్ర సహకారం లభిస్తే అభివృద్ధి వేగం రెట్టింపు అవుతుంది. డబుల్ ఇంజిన్ మోడల్ దేశ అభివృద్ధికి పునాదిగా నిలుస్తోంద్ధి అన్నారు. అమరావతిలో రాజధాని నిర్మాణం, వ్యవసాయం, గ్రీన్ ఎనర్జీ, లాజిస్టిక్స్, ఉద్యానం వంటి రంగాల్లో పెట్టుబడులు పెంచేందుకు ప్రభుత్వం అనుకూల వాతావరణం సృష్టిస్తోందని వివరించారు. పీటీఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రగతిశీల కూటమిగా చంద్రబాబు అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం సామాన్యుల సాధికారతే లక్ష్యంగా సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు ప్రజల సేవింగ్స్‌ను పెంచుతున్నాయని, చిన్న వ్యాపారాలు, ఎంఎస్ఎంఈ రంగం లాభపడుతున్నాయని చెప్పారు. ప్రజల జీవితాల్లో సాంకేతికతతో కూడిన మార్పు తీసుకురావడమే లక్ష్యంఅని ఆయన వివరించారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అద్భుత విజయాలను ఎన్డీఏ ప్రభుత్వం సాధిస్తుందన్నారు,ఈ దశాబ్దం మోదీదే, అంటే ఆటోమెటిగ్గా భారతీయులదేఅని ఆయన వ్యాఖ్యానించారు.భారత రాజకీయాల్లో కీలకమైన బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో ఎన్డీయే కూటమి విజయం సాధిస్తుందని చంద్రబాబు నమ్మకం వ్యక్తం చేశారు. బిహార్ సీఎం నీతీశ్ కుమార్, అధికార కూటమి అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తాను అని తెలిపారు. దేశ అభివృద్ధి దిశగా ఎన్డీయే తీసుకున్న నిర్ణయాలు ప్రజలలో నమ్మకాన్ని పెంచాయని ఆయన పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సాధికారత, అభివృద్ధి, సంస్కరణలతో దూసుకుపోతుందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ 2000 నుంచి రాజకీ యాల్లో ఉన్నారు. ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధాన మంత్రిగా దేశానికి దిశానిర్దేశం చేస్తున్నారు. 2014 నుంచి ఇప్పటివరకు 11 ఏళ్లుగా ప్రజల ఆశీస్సులతో ప్రధానిగా కొనసాగుతున్నారు. మరో నాలుగు సంవత్సరాలు కూడా ఆయనే ప్రధానిగా ఉంటారు. ఆయన నాయకత్వంలో దేశం బలంగా ముందుకు వెళ్తోంది అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపం చవ్యాప్తంగా తెలుగు ప్రజల ప్రభావం పెరుగుతోందని చంద్రబాబు గర్వంగా చెప్పారు. ఒకరోజు ఈ గ్రహంపై అత్యంత ప్రభావవంతమైన సమాజంగా తెలుగు కమ్యూనిటీ నిలుస్తుంది.ఆ దిశగా మేము కృషి చేస్తున్నాం అని ఆయన స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరణలు, పరిశోధన, పరిశ్రమల కేంద్రంగా మలచాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. దుబాయ్ పర్యటనలో భాగంగా పలు ప్రముఖ వ్యాపారవేత్తలతో చంద్రబాబు సమావేశమైనట్లు వివరించారు.'వచ్చే నెలలో విశాఖపట్నంలో జరగబోయే సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానించాను' అని తెలిపారు.

## బస్సు దుర్ఘటనలో తప్పెవరిది?



కర్నూలు వద్ద దగ్ధమైన బస్సు(ఫైల్)



డ్రైవర్ లక్ష్మయ్య(ఫైల్)

- స్కిడ్ కావడంతో రోడ్డుపై పడి ఉన్న బైక్
- ఆ వాహనాన్ని ఢీకొట్టినా బస్సు ఆపని డ్రైవర్
- 300 మీటర్లు బైక్‌ను ఈడ్చడం వల్లే బస్సు ఇంజిన్‌లో మంటలు
- తప్పు బైకర్‌పై నెట్టి ట్రావెల్స్‌ను కాపాడేయత్నం?
- బైకర్ మద్యం తాగాడంటున్న పోలీసులు
- లొంగిన ఇద్దరు డ్రైవర్లకు డ్రంకన్ టెస్ట్‌పై నోరు మెదపని పోలీసులు


**కర్నూలు, అక్టోబరు 25, ప్రభాతవార్త :** బస్సు దగ్ధం సంఘటనలో డ్రైవర్ల తప్పు లేదా, కేవలం బైకర్ తప్పు మాత్రమే ఉందా, అనే విషయం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. బైక్ ను బస్సు ఢీకొనలేదని, అప్పటికే బైక్ స్కిడ్ అయి రోడ్డుపై పడి ఉందని, కర్నూలు జిల్లా పోలీసులు స్పష్టంచేశారు. దీంతో తప్పంతా బైకర్‌దే అనే కోణంలో చర్చ జరుగుతోంది. బైక్‌ను గమనించకుండా డ్రైవ్ చేయడం డ్రైవర్ తప్పు కాదా అని చర్చ మరోవైపు ప్రారంభమైంది. రోడ్డుపై పడి ఉన్న బైక్‌ను ఢీ కొట్టిన వెంటనే బస్సు ఆపకపోవడం అసలు తప్పు కాదా అంటున్నారు. బయట పైకి దృష్టి మరలచడం ట్రావెల్స్ యాజమాన్యాన్ని కాపాడే ప్రయత్నమేనని ప్రజా సంఘాలు అంటున్నాయి. వి కావేరి ట్రావెల్స్ బస్సు దగ్ధం కేసులో భిన్న స్వరాలు వినిపిస్తున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున బస్సు మంటల్లో దగ్ధం కావడంతో 19 మంది సజీవ దహనమయ్యారు. అక్కడే బైక్ శివశంకర్ కూడా చనిపోయాడు. ఈ సంఘటనపై మొదట్లో రోడ్డుపై వెళ్తున్న బైకును బస్సు ఢీకొందన్నారు. ఆ సంఘటనలో బైక్ బస్సు కిందకు వెళ్లిపోయిందని, సుమారు 300 మీటర్లు బైక్‌ను బస్సు ఈడ్చికెళ్ళిందన్నారు. తద్వారా మంటలు వేగాయని చెప్పారు. అయితే శనివారం రోజుకి ఆ విషయంలో కొంత మార్పు జరిగింది. ప్రమాదం జరగడానికి కారణం రోడ్డుపై బైక్ పడి ఉండడమేనంటున్నారు. కర్నూలుకు చెందిన శివశంకర్ అతని మిత్రుడు ఎర్రి స్వామి బస్సు ప్రమాదానికి కొద్దిసేపు ముందు అదే రోడ్లో వెళ్తూ బైక్ స్కిడ్ అయ్యి కిందపడ్డారు. ఆ ప్రమాదంలో శివశంకర్ మాత్రం అక్కడికక్కడే మృతి చెందాడని, ఎర్రిస్వామి స్వల్పగాయాలతో బయటపడ్డాడని పోలీసులు ప్రకటించారు. ఆ క్రమంలో శివశంకర్ రోడ్డుపక్కన పడ్డాడని, బైక్ మాత్రం నడిరోడ్డులో పడిందని తెలిపారు. శివశంకర్ మృతి చెందాడని గుర్తించిన ఎర్రి స్వామి, తర్వాత బైకును పక్కకు తీద్దామనుకున్నాడు. అప్పటికే వి కావేరి ట్రావెల్స్ బస్సు బైక్ పైనుంచి వెళ్ళింది. సుమారు 300మీటర్లు బైకును లాకెళ్ళింది. దీంతో మంటలు చెలరేగాయి. మంటలు చూసిన ప్రత్యక్ష సాక్షి మృతుడు శివశంకర్ మిత్రుడు ఎర్రి స్వామి అక్కడి నుండి పారిపోయాడు. ఈ విషయాన్ని బట్టి బస్సు డ్రైవర్ తప్పులేదని బైక్ రోడ్డుపై పడడమే >>2

## మార్చి 16 నుంచి టెన్త్ పరీక్షలు

### హాల్ టిక్కెట్లపై పరీక్షా కేంద్రం రూట్‌మ్యాప్

**విజయవాడ,అక్టోబరు 25.ప్రభాతవార్తప్రతినిధి:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. నవంబరు ఒకటో తేదీ నుంచి పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పిస్తారు. అందుకు దాదాపు నెల రోజుల సమయం ఇవ్వనున్నారు. ఈ ఏడాది కొత్తగా హాల్‌టికెట్ల వెనుక భాగంలో పరీక్ష కేంద్రం రూట్ మ్యాప్‌ను ముద్రించనున్నారు. అందులోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పరీక్ష కేంద్రానికి ఎలా చేరుకోవాలో మ్యాప్ వస్తుంది. మరోవైపు చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వంద రోజుల ప్రణాళికను డిసెంబరు నుంచి అమలు చేయనున్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమయ్యే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారి, ఇన్విజిలేటర్లను ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేస్తారు. పదో తరగతి విద్యార్థులెవరినీ డ్రాప్ బాక్సులో పెట్టకూడదని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. >>2

## అధికార యంత్రాంగం అలర్ట్‌గా ఉండండి



### తుఫాను వల్ల భారీ నష్టం వాటిల్లకుండా చర్యలు: డిసిఎం పవన్

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను కాకినాడ పరిసరాల్లో తీరాన్ని తాకే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని తెలిపారు. శనివారం కాకినాడ జిల్లా కలెక్టర్‌తో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ జిల్లాలో సముద్ర తీరం ఉన్న తుని, పిఠాపురం, కాకినాడ రూరల్, కాకినాడ అర్బన్ నియోజక వర్గాలతో పాటు తాళ్ళరేవు మండలంపైనా తుపాన్ ప్రభావం ఎక్కువగా ఉండబోతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ విషయంపై అధికారులతో పవన్ కళ్యాణ్ చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ తుపానుపై ప్రజలను అప్రమత్తం చేయండి. జిల్లావ్యాప్తంగా తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోండన్నారు. తుపాను షెల్టర్లలో ఆహారం, ఔషధాలు, పాలు లాంటివన్నీ సమకూర్చి ఉంచండి. వాతావరణ శాఖ హెచ్చరికలకు అనుగుణంగా అన్ని విభాగాలను సిద్ధం చేయాలని సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ, నీటిపారుదల, పోలీస్, అగ్నిమాపక శాఖలతోపాటు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఉప్పాడ సమీపంలో తీరం కోతకు గురయ్యే ప్రాంతంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. మత్స్యకారులను అప్రమత్తం చేయండి అని స్పష్టం చేశారు. ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై ఆరా తీశారు. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యానికి చేరువగా >>2




# భారీగా దుబాయ్ పెట్టుబడులు

>> స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా వేగంగా అనుమతులు ఇస్తున్నామని తెలియజేస్తూ, పెట్టుబడిదారులకు మేలు జరుగుతుందని భావిస్తే, అవసరమైతే పాలసీల్లో మార్పులు తేవడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని ప్రకటించారు. భారత్-యూఏఈ మధ్య వాణిజ్య సంబంధాలు పెంపొందించడానికి ప్రధానమంత్రి చొరవను సీఎం ఈ పర్యటనలో ప్రస్తావించారు. దేశాభివృద్ధికోసం ప్రధాని పనిచేస్తున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆంధ్రాలో అవకాశాలు ఆకర్షిస్తున్నాయని యూఏఈ తెలిపింది. పారిశ్రామికవేత్తలు కూడా తాము ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తితో ఉన్నామనే విషయాన్ని చంద్రబాబు దృష్టికి తెచ్చారు. రియల్ ఎస్టేట్, మౌలిక వస తుల రంగంలో శోభా గ్రూప్ ఆసక్తిని కనబరి చింది. అలాగే అమరావతిలో ప్రపంచ స్థాయి గ్రంథాలయం ఏర్పాటుకు రూ.100 కోట్లు విరా ళాన్ని శోభా గ్రూప్ చైర్మన్ రవి మీనన్ ప్రకటిం చారు. ఇక ట్రాన్స్ వరల్డ్ గ్రూప్ దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ నిర్మాణంలో భాగ స్వామ్యంపై ఆసక్తి చూపింది. లాజిస్టిక్స్ దిగ్గజ మైన షరాఫ్ గ్రూప్ కూడా ఏపీలో లాజిస్టిక్స్ పార్కులు, గిడ్డంగులు స్థాపించడానికి సుముఖత వ్యక్తం చేసింది. బుర్జిల్ హెల్త్ కేర్ హోల్డింగ్స్ వైద్యారోగ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత తెలిపింది. జీ 42 సంస్థ ఏఐ డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్, స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు ఆహ్వానం అందుకుంది. ముఖ్యంగా, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ - దుబాయ్ సిలికాన్ ఒయాసిస్ మధ్య కొత్త భాగస్వామ్యాలను ఏర్పాటు చేసే అంశంపై అంగీకారం కుదిరింది. ఇంధనం రంగంలో మస్దార్ వంటి సంస్థలను సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజ్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని సీఎం ఆహ్వానించారు. అలాగే, ఏపీలో కోకో ఉత్పత్తి బాగున్న నేపథ్యంలో అగ్తియా గ్రూప్‌ను చాక్లెట్ పరిశ్రమ స్థాపించే అంశంపై ఆలోచన చేయాలని కోరారు. వీరంతా ఏపీలో పెట్టుబడులకు ఆసక్తిని కనబరిచారు. వచ్చేనెల విశాఖలో జరిగే పెట్టుబడుల సదస్సుకు హాజరవుతామని చెప్పారు. తాము కచ్చితమైన ప్రతిపాదనలతో వచ్చే అవకాశాలను పరిశీలిస్తామని వెల్లడించారు. యంగెస్ట్ స్టేట్...హయ్యెస్ట్ ఇన్వెస్ట్మెంట్స్ అనే నినాదం బాగుందని పలువురు పారిశ్రామిక వేత్తలు చంద్రబాబు వద్ద ప్రస్తావించారు.

**యుఎఇ ప్రభుత్వ ప్రతినిధులతోనూ భేటీలు:** యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థానీ బిన్ అహ్మద్ అల్ జయూదీ, ఆర్థిక, పర్యాటక శాఖామంత్రి అబ్దుల్లా బిన్ తూక్ అల్ మర్రీలతో జరిగిన కీలక సమావేశంలోనూ వాణిజ్య బంధం పెంపు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI),లాజిస్టిక్స్ వంటి రంగాల్లో సహకారంపై సీఎం బృందంచర్చించింది. ఈ సందర్భంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్-దుబాయ్ సిలికాన్ ఒయాసిస్ మధ్య కొత్త భాగస్వా మ్యాలను ఏర్పాటు చేసే అంశంపై అంగీకారం కుదిరింది. అలాగే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు రాష్ట్రానికి తమ బృందాన్ని పంపుతామని యూఏఈ ప్రభుత్వ మంత్రులు సీఎంకు చెప్పారు.

# ముంచుకొస్తున్న 'మొంథా'

>> కారణంగా రానున్న 5 రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. నేడు బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు, ఆదివారం గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పల్నాడు, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని వాతావరణ శాఖ తెలిపింది.సోమ, మంగళవారాల్లో దక్షి ణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ భారీ నుంచి అత్యంత భారీ వానలు కురుస్తాయని అంచనా వేస్తోంది. శుక్రవారం ఏలూరు, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, గుంటూరు కృష్ణా, తదితర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. గడిచిన రోజులో అత్యధికంగా ప్రకాశం జిల్లా పాకాలలో 152.25 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడింది. విశాఖకు 990 కిలోమీటర్ల దూరంలో ఇది కేంద్రీకృతమై ఉంది. పశ్చిమ వాయవ్య దిశగా ఇది కదులుతోంది. ఇది 24 గంటల్లో బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ నెల 27న సోమవారం ఉదయానికి తుపానుగా మారే అవకాశం ఉంది. మొంథా తుఫాను ప్రభావం కోస్తాంధ్రపై ప్రభావం ఉండనుంది. దీని ప్రభావంతో నైరుతిపశ్చిమ బంగాళాఖాతం మధ్య తీరం దాటే సంకేతాలు కనిపిస్తున్నాయి. దీని ప్రభావంతో ఏపీలో కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు, ఆదివారం భారీ నుంచి అతిభారీవర్షాలు, సోమ, మంగళవారాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ, విపత్తుల నిర్వహణ సంస్థల అధికారులు హెచ్చరిస్తున్నారు. తీరం వెంబడి గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతప్రజలు అలెర్ట్ గా ఉండాలన్నారు. తుపాను సమయంలో అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని, ఇంట్లోనే సురక్షి తంగా ఉండాలని విజ్ఞప్తి చేసారు. శనివారం కోనసీమ, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతవరణవం,విపత్తుల శాఖల అధికారి ప్రఖర్‌జైన్ తెలిపారు.. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆదివారం గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు, కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, పల్నాడు, కడప, అన్నమయ్య, చిత్తూరు అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## ముందు జాగ్రత్త చర్యలతో అప్రమత్తం: సిఎం చంద్రబాబు

### ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన

**విజయవాడ, అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి ఖిమొంథాఖి తుఫాను పొంచివున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.'మొంథా తుఫాన్ రాష్ట్రంపై ఈనెల 26, 27, 28, 29 తేదీల్లో తీవ్ర ప్రభావం చూపించనుందని వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేయడంతో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. ప్రధానంగా ఈ నెల 28న సాయంత్రం కాకినాడ సమీపంలో'మొంథా తీవ్ర తుపానుగా మారి తీరం దాటుతుందని, ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా నుంచి తిరుపతి వరకూ దీని ప్రభావం ఉంటుందని... 80 నుంచి 100 మి.మీ. మేర భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వరదల నుంచి ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ఇప్పటి నుంచే సన్నాహక చర్యలు సమగ్రంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతీ జిల్లా కలెక్టర్ తుఫాన్ రక్షణ చర్యలకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకుని... తగిన వనరులతో సన్నద్ధంగా ఉండాలని చెప్పారు. తీరప్రాంత ప్రజలకు తుఫానుపై అవగాహన కల్పించి వారిని సురక్షి త ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అవసరమైతే విద్యా సంస్థలకు సెలవు ప్రకటించాలని చెప్పారు. అన్ని ప్రధాన, మధ్య తరహా రిజర్వాయర్లలో నీటిమట్టాలను పర్యవేక్షి ంచి నీటి విడుదల శాస్త్రీయంగా జరపాలన్నారు. రియల్ టైమ్‌లో వచ్చే సమాచారాన్ని తక్షణం ప్రభుత్వ యంత్రాంగంలోని కింది స్థాయి వరకు తీసుకువెళ్లాలని చెప్పారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. కాకినాడలో హాస్పిటల్ ఆన్ వీల్స్ సేవలను ప్రారంభించాలని సూచించారు. ఆర్ అండ్ బీ, విద్యుత్, నీటిపారుదల, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలు అన్నీ అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, మొబైల్ టవర్స్, సివిల్ సప్లైస్ వంటి అత్యవసర సేవలు నిరంతరం కొనసాగేలా చూడాలని నిర్దేశించారు. తుఫాన్ ప్రభావిత జిల్లాలకు ఇన్‌ఛార్జి అధికారులను నియమించి, తుఫాను నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## భారీ తుఫాను కారణంగా కంట్రోల్ రూమ్ నంబర్లు

**అమరావతి, అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో అల్పపీడనం తుపానుగా బలపడతుండటంతో అధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష నిర్వహించారు. ఈ అల్పపీడనం సోమవారం నాటికి తుపానుగా బలపడుతుందని, నేడు భారీ వర్షాలు, రేపు అతిభారీ వర్షాలు ఉంటాయని అధికారులు తెలిపారు. సోమ, మంగళవారాల్లో అత్యంత భారీ వర్ష సూచన ఉంటుందని మంత్రికి వివరించారు. అయితే తుపాను తీవ్రతను అంచనా వేసి ప్రభావిత జిల్లాలను అలెర్ట్ చేయాలని మంత్రి అనిత అధికారులకు సూచించారు. ముందస్తుగా పటిష్ట జాగ్రత్త చర్యలు అమలు చేయాలని ఆదేశించారు. ఇంకా ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని, తుపాను సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని మంత్రి అనిత చెప్పారు.క్షేత్రస్థాయిలో యంత్రాంగం మరింత అలెర్ట్‌గా ఉండాలని అధికారులను సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండే వారిని సురక్షి త ప్రాంతాలకు తరలించాలని అలానే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ఆహారం అందించాలని ఆదేశించారు.

భారీ వర్షాల దృష్ట్యా వీలైనంత వరకు ప్రజలు ఇంట్లోనే ఉండాలని మంత్రి చెప్పారు. ఏదైనా ఆపద వస్తే విపత్తుల నిర్వహణ సంస్థ కంట్రోల్ రూమ్ నంబర్లు 112, 1070, 18004250101 ఇచ్చారు. కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, శ్రీసత్య సాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

# బస్సు దుర్ఘటనలో తప్పెవరిది?

>> తప్పనే విధంగా చర్చ ప్రారంభమైంది. అయితే ఈ విషయంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. రోడ్డుపై బైక్ పడి ఉంటే.. బస్సు ఆపడం.. లేదా పక్క నుంచి వెళ్లాలి కదా.. అనే వాదన వినిపిస్తుంది. అయితే బస్సు ఉన్న అతివేగం కారణంగా ఆ రెండు పనులు చేయలేక బైక్ పై బస్సు ఎక్కించాడు అంటున్నారు. అయితే కేవలం బైకును మాత్రమే ఢీకొట్టాడా.. బైక్ పై మనిషి ఉన్నాడా.. అనే విషయంపై స్పష్టత లేని డ్రైవర్ యాక్సిడెంట్ జరిగిందని భయపడ్డాడు. తప్పించుకునేందుకు బస్సు వేగం మరింత పెంచాడనే చర్చ జరుగుతోంది. బస్సు కింద ఉన్న బైక్ రోడ్డుకు రాసుకొని మంటలు వ్యాపించే వరకు బస్సును ఆపకపోవడం డ్రైవర్ దుర్మార్గమని స్థానికులు అంటున్నారు. బైక్ పై బస్సు ఎక్కిన వెంటనే 100 మీటర్ల లోపు బస్సును ఆపి ఉంటే.. మంటలు చెలరేగేవి కాదని, 19 మంది ప్రాణాలు నిలబడేవని అంటున్నారు. ఇక్కడ రోడ్డుపై బైక్ ఉన్నప్పటికీ బైక్ విషయంలో బస్సు డ్రైవర్ శ్రద్ధ తీసుకోకపోవడం ప్రమాదానికి అసలు కారణంగా పేర్కొంటున్నారు. అంతేగాక అతివేగం కారణంగా బస్సు కూడా కంట్రోల్ కాలేదని తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా బైక్ నడిపిన శివశంకర్ మద్యం తాగాడని చర్చ జరుగుతుంది. ఇక్కడే స్థానికుల నుంచి మరో ప్రశ్న వినిపిస్తోంది. ప్రమాదం జరిగిన రెండు, మూడు గంటలలోపే డ్రైవర్లు పోలీస్ స్టేషన్ లో లొంగిపోయారని తెలుస్తోంది. డ్రైవర్లకు డ్రంకన్ టెస్టులు చేయించారా అని ప్రశ్నిస్తున్నారు. ఆ విషయంపై ఎలాంటి వివరాలు ఇప్పటి వరకు బయటకు రాలేదు. మొదట ఒక డ్రైవర్ మాత్రమే పోలీసులు అదుపులో ఉన్నారన్నారు. తర్వాత ఇద్దరు డ్రైవర్లు పోలీసులు అదుపులో ఉన్నారని ప్రకటించారు. కాగా ఇద్దరు డ్రైవర్లు ఆక్సిడెంట్ జరిగిన రెండు మూడు గంటల లోపే పోలీస్ స్టేషన్లో లొంగిపోయారని తెలుస్తోంది. వారికి డ్రంకన్ టెస్టులు చేయించి ఉంటే.. అసలు విషయాలు బయటకు వచ్చేవంటున్నారు. ఏది ఏమైనా ప్రమాదం జరిగిన మొదటి రోజు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ది పూర్తి తప్పిదమని, రెండవ రోజు బైకర్ శివశంకర్ ది పూర్తి తప్పని చర్చ జరిగింది. అయితే నిపుణులు మాత్రం ప్రమాదానికి డ్రైవర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

## కృష్ణా ,ఎన్టీఆర్ జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** తుపాను కారణంగా ఈ నెల 27, 28, 29, తేదీలలో కృష్ణా జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలలు గురుకులపాఠశాలలు, కళాశాలలు ఇతర విద్యాసంస్థలు అన్నింటికి 3రోజుల పాటు సెలవు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాలలోని విద్యార్థులందరూ ఈనెల 26వ తేదీ సాయంత్రంలోగా ఇళ్లకు వెళ్లే విధంగా అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు దినాలుగా ప్రకటిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలుగురుకుల పాఠశాలలు, కళాశాలలు ఇతర విద్యాసంస్థలు అన్నింటికి 3రోజులపాటు సెలవుదినాలుగా ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు.

## కెనడాతో అన్ని వాణిజ్య చర్చలు రద్దుచేసిన ట్రంప్

**ఒంటారియో,అక్టోబరు 25:** అమెరికా టారిఫ్స్ వ్యతిరేకిస్తూ కెనడా ఇచ్చిన ప్రకటనలు ట్రంప్‌ను ఆగ్రహానికి గురిచేసాయి. సుంకాలను వ్యతిరేకించే ప్రకటనల ప్రచారంలో మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌ను తప్పుగా చూపించారని ట్రంప్ ఆరోపించారు.ఈ యాడ్‌తో యూఎస్ కోర్టు తీర్పులను ప్రభావితం చేయడానికి ఉద్దేశించారని తప్పుపట్టారు. అందుకే కెనడాతో అన్ని వాణిజ్య చర్చలను రద్దు చేస్తున్నట్లు చెప్పారు. కెనడా మోసపూరితంగా టారిఫ్‌లకు వ్యతిరేకంగా ఒక ప్రకటనను చేసిందని రొనాల్డ్ రీగన్ ఫౌండేషన్ ప్రకటించింది. ఆ యాడ్ ఫేక్. అందులో అమెరికా మాజీ అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ టారిఫ్‌ల గురించి ప్రతికూలంగా మాట్లాడుతున్నట్లు ఉంది. అమెరికా సుప్రీంకోర్టు, ఇతర కోర్టుల నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి మాత్రమే కెనడా ఇలా చేసింది. అమెరికా జాతీయ భద్రత, ఆర్థిక వ్యవస్థకు సుంకాలు చాలా ముఖ్యమైనవి, వారు దారుణమైన ప్రవర్తన కారణంగా కెనడాతో అన్ని వాణిజ్య చర్చలు రద్దు చేసుకుంటున్నామని ట్రంప్ సోషల్ ట్రూత్ వేదికగా ప్రకటించారు. కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ట్రంప్ టారిఫ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం ప్రారంభించింది.




మంత్రి సత్యకుమార్‌తో చర్చిస్తున్న పిహెచ్‌సి వైద్య సంఘాలు

# పిహెచ్‌సి డాకర్ల సమ్మె విరమణ

### మంత్రి సత్యకుమార్ భరోసాతో సమ్మె విరమించినట్లు వైద్య సంఘాలు వెల్లడి

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులు సమ్మె విరమించినట్లు ప్రకటించారు.రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నుంచి దీర్ఘకాలిక డిమాండ్ల పరిష్కారంపై నిర్దిష్టమైన హామీలు లభించినందున నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు వైద్య సంఘాల నేతలు వెల్లడించారు. పీజీ మెడికల్ ఇన్‌సర్వీస్ కోటా కొనసాగింపు, ఉద్యోగ సర్వీసు వ్యవహారాలపై సానుకూల ఉత్తర్వుల కోసం గతనెల 28 నుంచి ఆందోళనలు చేపట్టారు. ఈ నెల 3 నుంచి నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ నేపథ్యంలో మంత్రి సత్యకుమార్ను పీహెచ్సీ వైద్యుల సంఘం, ఏపీవీవీపీ వైద్యుల సంఘం (జేఏసీ) నేతలు రవీంద్రనాయక్, వినోద్, కిషోర్, రోహిత్, జయ ప్రకాష్, వివేక్, అజయ్, ఇతరులు కలిసి, అపరిష్కృత డిమాండ్లను పరిశీలించాలని విజ్ఞప్తిచే శారు. గత రాత్రి బాగా పొద్దుపోయేంత వరకు జరిగిన చర్చల అనంతరం మంత్రి సత్యకుమార్ 2025- 26 విద్యా సంవత్సరంలో పీజీ మెడికల్ ఇన్ సర్వీసు కోటాను 20 శాతం, 2026-27లో 15 శాతం కోటాను సాగించేందుకు స్పష్టమైన హామీ ఇచ్చారు. గతంలో అమల్లో ఉండి.. నిలిచిన డీఎన్బీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించే విషయంలోనూ మంత్రి సానుకూలంగా స్పందించారు. ట్రైబల్ అలవెన్స్, టైం బౌండ్ పదోన్నతులు, నోషనల్ ఇంక్రిమెంట్లు, అర్బన్ సర్వీస్ ఎలిజిబులిటీ ఐదేళ్లకు కుదింపు, ఇతర సమస్యలను కూడా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పినట్లు నేతలు చెప్పారు. సర్వీసులోనికి రాకముందే డిప్లొమా చేసిన వారికి అదే స్పెషాల్టీ కోర్సులో ప్రవేశాలు పొందే వీలు (ఈఓఎల్)ను కల్పించే విషయాన్ని, కొవిడ్ హయాంలో వేతనాలు అందని వారికి కూడా న్యాయం చేస్తామని మంత్రి చెప్పారన్నారు. వైద్యుల సర్వీసు వ్యవహారాలపై జరిగే నిర్ణయాల్లో సంఘాఖిల వారిని భాగస్వాములను చేస్తామని మంత్రి తెలిపారన్నారు. దీనిపై సహచర సభ్యులతో చర్చించిన అనంతరం సమ్మెను విరమించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. తమ ఆందోళనల ద్వారా ప్రజలకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామన్నారు. తమ సమస్యల పరిష్కారంపట్ల మంత్రి సానుకూలంగా స్పందించడంపట్ల నేతలు కృతజ్ఞతలు తెలిపారు.




పాట్నాలో శనివారం ఛాత్‌పూజ సామాగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

# ఒక ప్రాజెక్టు కట్టడానికి 37యేళ్లు కూడా సరిపోదా?

### ప్రజలు నిలదీస్తేనే పాలకులు కళ్లు తెరుస్తారు

### సాగునీటి ప్రాజెక్టుల అధ్యయన బృందం

**రాజంపేట,అక్టోబరు 25 ప్రభాతవార్త:** రాష్ట్రాన్ని పరిపాలించే పాలకులు రాయలసీమ వారైనా ఏ మాత్రం సాగునీటి ప్రాజెక్టుల పట్ల చిత్తశుద్ధి లేదని, ఒక ప్రాజెక్టును కట్టెందుకు 37 ఏళ్ల కూడా సరిపోవడంలేదని, ఇది ప్రజల దురదృష్టమని,అందుకే ప్రజలు సమస్య తీవ్రతను గుర్తించి పాలకులను నిలదీయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సాగునీటి ప్రాజెక్టుల అధ్యయన బృందం పిలుపునిచ్చింది. పాలకుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం గాలేరు నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు అని పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుక పోతే ఇంతవరకు అతిగతి లేదని మండిపడ్డారు.శనివారం బృందం సభ్యులువిశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబి వెంకటేశ్వరరావు, రైతు సేవా సంస్థ, అధ్యక్షులు అక్కినేని భవానీ ప్రసాద్, జలవనరులు, సాగునీటి ప్రాజెక్టుల విశ్లేషకులు టి. లక్ష్మీ ్మనారాయణ, సెంటర్ ఫర్ లిబర్టీ, అధ్యక్షులు నలమోతు చక్రవర్తిలతో కూడిన ప్రతినిధి బృందం తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూకడప జిల్లాకు 1,55,000 ఎకరాలకు, చిత్తూరు జిల్లాకు 1, 05000, ఎకరాలకు గాలేరు నగరి సుజల స్రవంతి పూర్తి కావడం ద్వారా నీరు అందుతుందని అన్నారు. అటువంటి పెద్ద ప్రాజెక్టును పాలకులు ఎందుకు పట్టించుకోలేదని వారు ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా రాజంపేట రైల్వే కోడూరు నియోజకవర్గాలలో ఉన్నటువంటి చిన్న పెద్ద చెరువులు నిండి భూగర్భ జలాలు నిండుగా ఉంటాయని వివరించారు. కొన్ని ప్రాంతాలలో 1800 అడుగులు బోర్లు వేస్తే గాని ఈ ప్రాంతంలో నీరు అందడం లేదంటే ఎంత దుర్భిక్షంలో ఉన్నామో అర్థమవుతున్నదని ఇప్పటికైనా ముఖ్యమంత్రి కళ్ళు తెరిచి ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి సత్వరమే పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. పాలకుల నిరక్ష ్యం కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు వరదలకు కొట్టుకొని పోయి నాలుగు సంవత్సరాలు అవుతున్న నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. ఎందుకు పనులు మొదలుపెట్టడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కావచ్చు గత ప్రభుత్వంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ఉన్నప్పుడు కావచ్చు ప్రాజెక్టు అవసరాలని నిమిత్తం నిధులు కేటాయించమని అడిగితే కేటాయించకుండా అశ్రద్ధ చేసి ప్రాజెక్టు కొట్టుకొని పోయే విధంగా చేశారని వారు ఆరోపించారు. 1976లో ఈ ప్రాంత అవసరాల నిమిత్తం అప్పటి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తే 8 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం జరిగితే నేడు పాలకుల నిరక్ష ్యం కారణంగా అది 800 కోట్లకు చేరిందని ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన సుమారు 22,500 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారని ఇదే పరిపూర్ణంగా నిర్మాణం జరిగితే 40 నుంచి 50 వేల ఎకరాలకు నీరు అందుతుందని ఇక్కడి ప్రజలకు తాగడానికి కూడా నీరు అందే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు అన్నారు. వెంటనే ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వచ్చిన నీరు వచ్చినట్టు సముద్రం పాలు కాకుండా ఈ ప్రాంత వాసులకు అవసరాలకు ఉపయోగపడే విధంగా పాలకులు ఆలోచన చేయాలని సూచించారు. ఆలోచన పరుల వేదిక సభ్యులు రాయలసీమ ప్రాంతంలో ఉన్నటువంటి నీటిపారుదల ప్రాజెక్టుల పైన అధ్యయనం చేస్తున్నామని ఈ అధ్యయనం తర్వాత సమగ్రమైనటువంటి రిపోర్టు ప్రభుత్వం కు సమర్పించి ఒత్తిడి తేవడానికి ప్రాజెక్టులో స్థితిగతులు మార్చడానికి ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.



అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధ్యయన బృందం

## వారం - వర్జ్యం

26-10-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
పంచమి పూర్తి
జ్యేష్ఠ ఉ.10.47
వర్జ్యం : రా.12.21-2.08
దు.సా.4.04-4.50
ఉ.6.30-7.30, సా.6.30-7.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. ప్రయాణాలు.

**వృషభం:** కుటుంబ విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మిథునం:** స్త్రీలతో వివాదాలు లాభించవని గుర్తించండి. సోదరుల కలయిక.

**కర్కాటకం :** పారిశ్రామిక, రాజకీయరంగాలలోని వారికి అనుకూల కాలం.

**సింహం:**బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. ప్రయాణాలు.

**కన్య :** ఉద్యోగాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. విందు, వినోదాలు.

**తుల :** వృత్తి, వ్యాపారాలలో మార్పులు చోటు చేసుకుంటాయి. వస్తులాభం

**వృశ్చికం:** సహోద్యోగుల వలన నష్టములు వాటిల్లవచ్చు, తగు జాగ్రత్తలు పాటించింది.

**ధనుస్సు:** తప్పుకు తిరుగువాడు ధన్యుడు సుమతి అన్నారు. వివాదాలకు దూరంగా వుండండి.

**మకరం:** పెండింగ్ లోని కోర్టు వ్యవహారాలు చికాకు కలిగిస్తాయి.

**కుంభం:**అధిక శ్రమను పంచుకోవడానికి నమ్మకస్తులైన వారిని ఎన్నుకొని బాధ్యతలను అప్పగిస్తారు.

**మీనం :** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# టెన్త్ పరీక్షలు

>> ప్రతి జిల్లాలో పది ఫలితాల్లో వెనుకబడిన 100 పాఠశాలలను గుర్తించి ప్రత్యేక చర్యలు తీసుకుంటారు. పదో తరగతి పరీక్షలు రాసే అభ్యర్థులందరికి తప్పనిసరిగా అపార్ ఐడీ ఉండాలి. సార్వత్రిక విద్యాపీఠంలో ఈ ఏడాది పదో తరగతి ప్రవేశాలు తగ్గినందున ప్రవేశాలు పెంచాలని విద్యాశాఖ ఆదేశించింది.

# ట్రావెల్స్ బస్సులపై 289 కేసులు

**విజయవాడ,అక్టోబరు 25,పభాతవార్త ప్రతినిధి:** కర్నూలులో బస్సు ప్రమాదం దృష్ట్యా ఏపీలో రవాణా శాఖ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. రవాణా శాఖ కమీషనర్ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ప్రైవేటు వాహనాలపై విస్తృత తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ట్రావెల్ బస్సులపై 289 ఏసులు నమోదు చేశారు. 18 ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసి రూ.7.08 లక్షల జరిమానాలు విధించారు. అత్యధికంగా ఏలూరులో 55 కేసులు నమోదు చేశారు. 3 ట్రావెల్స్ బస్సులు సీజ్ చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో 17 కేసులు నమోదు చేసి 4 బస్సులు సీజ్ చేశారు. కోనసీమ జిల్లాలో 27,చిత్తూరు జిల్లాలో 22,కర్నూలు జిల్లాలో 12,విశాఖలో 7,నంద్యాలలో 4 కేసులు నమోదు చేశారు.సరైన ధృవపత్రాలు లేవని 8 బస్సులు,అత్యవసర ద్వారంలేదని 13 బస్సులపై కేసులు ఫైల్‌చేశారు. అగ్నిమాపక పరికరాలు లేవని 103 బస్సులపై ప్యాసింజర్ లిస్టు లేనికారణంగా 34 బస్సులపై ఇతర ఉల్లంఘనలపై 127కేసులు నమోదు చేశారు. ప్రత్యేక డ్రైవ్ రోజూ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# అలర్ట్‌గా ఉండండి


>> నీటి నిల్వలు పెరుగుతున్నాయని, నీటిని వదిలేటప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తామని జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. వరద ముంపు పరిస్థితి వస్తే నీటిపారుదల శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని, పిఠాపురం, పెద్దాపురం నియోజక వర్గాల రైతులు, ప్రజలకి సమాచారం ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచించారు.

మొంథా తుపాను ప్రభావం కాకినాడ జిల్లాపై ఉంటుందని తెలిసిన క్రమంలో కాకినాడ వెళ్ళేందుకు ఉప ముఖ్యమంత్రి సిద్ధంకాగా, ఈ పరిస్థితుల్లో వద్దని సహాయక చర్యల సన్నద్ధతలో యంత్రాంగం నిమగ్నమై ఉంటుందని, ఇప్పుడు జిల్లా పర్యటన వద్దని జిల్లా కలెక్టర్ సున్నితంగా సూచించారు.

# పరకామణి కేసులో 'రాజీ' కుట్ర ఎవరిది?

## అక్రమాల వెనుక 'పెద్ద' లెవరనేది టిటిడి బోర్డు వెల్లడిస్తుందా?

## 28తరువాత అదనపు కౌంటర్ అఫిడవిట్‌కు అవకాశమివ్వాలని ఇఒ విజ్ఞప్తి



**తిరుమల,అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** వడ్డీకాసుల వేంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించే కానుకల లెక్కింపు పరకామణి నుండి 2023 ఏప్రిల్‌నెలలో 920 అమెరికన్ డాలర్లు చోరీచేస్తూ పట్టుబడిన గుమస్తా కోయంబత్తూర్ వెంకట రవికుమార్ కేసు రాజీచేయడం వెనుక కుట్ర ఎవరిదనేది వెలుగుచూడనుంది. భారీ మొత్తంలో దేవుని సొమ్మను నిర్భయంగా దోచేసిన ఘనుడిపై అప్పటి విజిలెన్స్ విభాగం ఏవిఎస్ఒ ఫిర్యాదు చేయడం, తిరుమల వన్‌టౌన్ పోలీసులు 24/2023 కేసు నమోదు చేశారు. ఆ తరువాత సమగ్ర విచారణ చేయాల్సిన పోలీసులను టిటిడి పెద్దలు ఎవరు నీరుగార్చేలా ప్రోద్భలం చేశారనేది తేలాల్సి ఉంది. ఈ అక్రమాల కేసులో కఠినంగా శిక్షించాల్సిన నిందితుడి తరఫున అప్పటి టిటిడి బోర్డు పెద్దలు, ఓ ఉన్నతాధికారి, కొందరు పోలీసు అధికారులు వత్తాసు పలికి ఏకంగా లోక్‌అదాలత్‌తో రాజీ కుదుర్చుకోవడం తెలిసిందే. దాదాపు వందకోట్ల రూపాయలు విలువైన ఆస్తులు కలిగిన నిందితుడి నుండి అప్పటి టిటిడి పెద్దలు కేవలం 14కోట్ల రూపాయలు విలువైన ఆస్తులను దేవుడికి విరాళంగా ఇప్పించేయడం వెనుక కుట్ర ఉందనేది ఇప్పుడు చర్చకు దారితీసింది. ఈ అక్రమాలపై నిగ్గుతేల్చాలని శ్రీనివాసులు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో విచారణ చేసిన న్యాయస్థానం ధర్మాసనం న్యాయమూర్తి తదుపరి ఈ కేసులో రికార్డులన్నీ ,ఆధారాలను కోర్టు ముందుంచాలని ఆదేశించింది. అయితే ఈ తతంగంపై అటు టిటిడి ఇటు పోలీసు అధికారులు నిర్లక్ష్యం చేయడంతో న్యాయమూర్తి ఆగ్రహానికి గురయ్యారు. తదుపరి పూర్తిస్థాయిలో సిఐడి డిజి రవిశంకర్‌అయ్యన్నార్ పదిరోజుల క్రిందట తిరుమలకు చేరుకుని తిరుమల పోలీసుల నుండి పరకామణి చోరీ కేసుకు సంబంధించి రికార్డులను, సిడిలను, ఫైళ్ళను ,సిసికెమెరా పుటేజీలను స్వాధీనం చేసుకుని న్యాయమూర్తి ముందుంచారు. అప్పటికీ టిటిడి నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో కౌంటర్‌దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశించిన విషయం తెలిసిందే. 27వతేదీ (రేపు) ఈ కేసు విచారణకు రానుండటంతో ముందుగానే జాగ్రత్తపడిన టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ నివేదికను శుక్రవారం హైకోర్టుకు సమర్పించారు. టిటిడి అనుమతి లేకుండానే 2023లో ఈ కేసు రాజీ చేశారని, అప్పటి ఏవిఎస్ఒ సతీశ్‌కుమార్ ఆ సమయంలో టిటిడిలో లేరని కోర్టుకు నివేదించారు. అంతేగాక 28వతేదీ మంగళవారం తిరుమలలో బోర్డు సమావేశం జరగనుండటంతో దీనిపై మరింతగా చర్చించి పూర్తిస్థాయిలో వివరణలతో కూడిన నివేదిక సమర్పణకు, అదనపు కౌంటర్ అఫిడవిట్ వేయడానికి కొంత సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇఒ నివేదిక వ్యవహారం ఇప్పుడు టిటిడిలో సంచలనంగా మారింది. అయితే పరకామణి చోరీ కేసు రాజీలో ఏవిఎస్ఒ స్థాయి అధికారి అనుమతి ఇచ్చే వెసలుబాటులేదని, ఎలాంటి సందర్భంలో కేసును రాజీచేశారనేది తెలుసుకోవాల్సి ఉందని ఇఒ విజ్ఞప్తిలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సతీష్‌కుమార్ పాత్రపై విచారణ చేయాలని ప్రస్తుత సివిఎస్ఒను ఆదేశించడం జరిగింది.

## కల్తీ మద్యంపై వైఎస్సార్సీనచిల్లర రాజకీయాలు : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త** కల్తీమద్యంపై వైకాపా చేస్తున్న చిల్లర రాజకీయాలను మానుకోవాలని లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన ప్రభుత్వం రూపొందించిన యాప్‌ను ఎక్సైజ్ పోలీసు స్టేషన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీ మద్యంకు సంబంధించి వైకాపా పచ్చి అబద్ధాలు,చిల్లర ఆరోపణలు చూస్తుంటే ఐదేళ్ళ పాలనలో జే బ్రాండ్‌తో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన విషయం మరచిపోయారా? అని ప్రశ్నించారు. ఏ మాత్రం వారికి పశ్చాత్తపం లేదన్నారు. నేడు గతంలో జరిగిన వాస్తవాలు బయటకువస్తుంటే వైకాపా వారి సోషల్ మీడియా రౌడీ గ్యాంగ్ ద్వారా యాగి చేయటం గమనిస్తే బాధేస్తుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి కల్తీ మద్యం, వైసిపి వారసత్వ సంపద వచ్చిందనానరు. ఓ వైపు గంజాయి, మరో వైపు కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని ఛిన్నా బిన్నం చేశారని,కల్తీమద్యాన్ని చట్టబద్ధం చేసి మరీ విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన వారు నేడు గురువింద సామెతగా వ్యవహారించటం వారి దివాలా కోరుతనానికి నిదర్శనం అని సుధీర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రజలు 11కుపరిమితం చేసినా వారి అబద్దాల జోరు తగ్గలేదన్నారు. జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27మంది మరణిస్తే సహజమరణాలని సర్టిఫికేటు చేయించుకున్నది మీరు కదా అని ప్రశ్నించారు. నేడు విచారణకుస్పెషల్ టాస్క్ ఫోర్సును నియమిస్తే గుండెల్లో రైళ్ళు పరుగెత్తించుకకుంటూ ఎదురుదాడికి పాల్పడటం గమనించదగ్గ విషయం అన్నారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే కాదు ప్రపంచంలో ఏ నాయకుడు చేయని రీతిలో పారదర్శకంగా కల్తీ కేసు బయటపడిన తక్షణమే సొంత పార్టీ వారైనా ఉపేక్షించకుండా పార్టీ నుంచి సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకున్నారని వివరించారు. కూటమి ఏర్పడిన తరువాత ఐదేళ్ళ వైకాపా పాలనలో దోచుకున్న సొమ్ములు బయటపడుతుండటంతో జగన్‌రెడ్డి తప్పించుకొనుటకు ప్రణాళికలు రూపొందిస్తు న్నారని శివమెత్తారు. చిల్లర రాజకీయాలు, తప్పుడు ప్రచారాలకు కాలం చెల్లిందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ చెంచయ్య నాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్, పేట బాలాజి, కాసరం రమేష్, బషీర్, పోలూరు శ్రీనివాసులు రెడ్డి, మునిరాజా యాదవ్, కన్నల ప్రతాప్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

## దుబాయ్‌లో ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని ప్రారంభించిన సిఎం చంద్రబాబు




ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని ప్రారంభిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాత వార్తప్రతినిధి:** ప్రవా సాంధ్రుల సంక్షేమం అభివృద్ధి, భద్రతలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీఎన్ఆర్టి సొసైటీ ద్వారా ప్రవాసాంధ్ర భరోసా బీమా పథకాన్ని అందిస్తోంది. ఈ పథకాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దుబాయ్ లో ప్రారంభించారు." ఎక్స్" వేదికగా సీఎం చంద్రబాబే వెల్లడించారు. ఈ పథకం ద్వారా విదేశాల్లో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు లబ్ధి పొందవచ్చు. ఉద్యోగులు, వలస కార్మికులు మరియు విద్యార్థుల కొరకు ఈ పథకం ప్రవేశపెట్టబడింది. బీమా చేయబడిన వ్యక్తి ప్రమాదం వల్ల మరణించినా లేదా శాశ్వత అంగవైకల్యం కలిగినా 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి విదేశాలకు వెళ్లిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షించారు. ఈ పథకంలో నమోదు చేసుకోవడానికి ఏపీఎన్ఆర్టి వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. ఇక పథకం పరిధిలో మహిళలకు గర్భవతులుగా ఉన్న సందర్భంలో ప్రసూతి ఖర్చులు ఇస్తామన్నారు. అయితే ఆస్పత్రుల్లోనే వారు సాధారణ కాన్పులకు ప్రయత్నించాలన్నారు. తప్పని సరయితే సిజెరియన్ చేయించుకోవాలన్నారు.

## ప్రహరీ గోడ కూలి పారిశుధ్య కార్మికుడు మృతి

### - మరో ముగ్గురికి గాయాలు.. మృతుడి కుటుంబానికి 8లక్షల సాయం

### - మృతుడు నంద్యాల వాసి.. క్షతగాత్రులు నెల్లూరు వాసులు

**కుప్పం,అక్టోబర్ 25 ప్రభాతవార్త** పొట్టకూటి కోసం వచ్చిన వారిపాలిట ప్రహరీగోడ ప్రాణాంతకంగా మారింది. డ్రైనేజ్ కాలువలో చెత్త చెదారాలు తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులపై ఒక్కసారిగా ప్రహరీగోడ కూలడంతో ఓ వ్యక్తి మృతి చె ందగా మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈసంఘటనకు సంబంధించి అర్బన్ సిఐ శంకరయ్య తెలిపిన మేరకు వివరాలిలా.. న ంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం కొత్తపల్లికి చెందిన శివయ్య (49), నెల్లూరుజిల్లాకు చెందిన హాజరతయ్య(62), వెంకటేష్ (35), సురేష్(30)లు కుప్పం మున్సిపాలిటీలో రాజుకాలువల శుభ్రం చేసేనిమిత్తం పనికి వచ్చారన్నారు. శనివారం స్థానిక బస్టాండు వద్ద వీరు కాలువలో పని చేస్తుండగా హఠాత్తుగా ఓప్రహరీగోడ వీరిపై పడిందన్నారు. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన బాధితులను కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించగా శివయ్య మృతి చెందాడన్నారు. తీవ్రంగా గాయపడ్డ హాజరతయ్యను పిఇఎస్‌కు తరలించామని మరో ఇద్దరుఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

ఈ మేరకు కేసున మోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐతెలిపారు. కాగా సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మృతి చెందిన శివయ్య కుటుంబానికి ప్రభుత్వం తరఫున5 లక్షలు, పార్టీతరఫున 3లక్షలు, క్షతగాత్రులకు 1.50లక్షలు మేర ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి.వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస రావు, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్ తక్షణ ం ఆర్థిక సాయం అందజేశారు. బాధితులను ఆస్పత్రిలో పరామర్శించి అండగా ఉంటామని పేర్కొన్నారు.

## వరల్డ్ ట్రావెల్ మార్కెట్ సదస్సుకు మంత్రి కందుల దుర్గేష్



**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** వరల్డ్ ట్రావెల్ మార్కెట్ సదస్సులో ఏపీ పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ పాల్గొననున్నారు. లండన్‌లో నవంబర్ 4 నుంచి 6వ తేది వరకు ఈ సదస్సు జరుగుతుంది. వరల్డ్ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యుటిఎం)2025 సదస్సులో పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్ పాల్గొనున్నారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం అను మతులు జారీ చేసింది. మంత్రితో పాటు ఈ పర్యటనలో పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పాల్గొంటారు. రాష్ట్రంలో అత్యంత పర్యాటక ఆకర్షణీయ ప్రాంతాలు, సముద్రతీర, టెంపుల్ టూరిజం,.చారిత్రక, పురాతన సందర్శన క్షేత్రాల గురించి దుర్గేష్ వివరిస్తారు. అతిథేయ రంగంలో ఇప్పటి పరిస్థితులు తెలిపారు.



## రుద్రపాదాల వద్ద వేడుకగా నాగుల చవితి

**శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం నాగుల చవితి పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సన్నిధివీధిలోని రుద్ర పాదాల చెంత వెలసిన నాగశిలల వద్ద ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఇక్కడ నాగశిలలకు షోడషాభిషేకాలు నిర్వహించారు. ఇక్కడ శిలలకు చక్కగా పూలతో అలంకరించారు. ఈ సందర్భంగామహిళా భక్తులు స్వామి వారికి ఇష్టమైన నువ్వులు, చిమ్మిలు, సద్దలు, పాలు, అన్నంతో నైవేద్యం సమర్పించారు. దివ్యక్షేత్రంలోని ప్రజలు, రైతులు, కార్మికులు, కర్షకులు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో విరాలజిల్లాలని పూజలు నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉప ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి, ఆలయపర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి పరిచారకులు గోవింద్‌శర్మ, శ్రీపాదం పాల్గొన్నారు.

## ద్రాక్షారామం మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అపశ్రుతి

**ఉమ్మడితూర్పుగోదావరిజిల్లా బ్యూరో, అక్టోబర్ 25(ప్రభాతవార్త):** ద్రాక్షారామంకు చెందిన దొంగ భీమన్న శనివారం గడ్డిని కోస్తున్న క్రమంలో విద్యుత్ ప్రమాదానికి లోనై మృతి చెందాడు. గుర్తించిన ఆలయ సిబ్బంది ద్రాక్షారామ పోలీసులకు సమాచారం ఇవ్వగా పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎస్ ఐ ఎం లక్ష్మణ్ ప్రాథమిక అంచనా కోసం సంఘటన స్థలాన్ని పరిశీలించారు.. ఆలయ ఈవో అల్లు వెంకట దుర్గా భవాని ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ చేయనున్నట్లు తెలిపారు.

## రాష్ట్రంలో మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలు

### - మంత్రి ఎన్‌ఎండి ఫరూక్



**అమరావతి,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మైనార్టీ యువతకు జర్మనీలో ఉద్యోగావకాశాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరూక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఓఎంసిఎపి), ఐఇఎస్ సహకారంతో జర్మనీలో ఎలక్ట్రిషియన్ ఉద్యోగాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండేళ్ల ఐటిఐ, మూడేళ్ల ఎలక్ట్రిషియన్ ట్రేడ్ విద్యార్హత కలిగి, వయోపరిమితి గరిష్టంగా 30 ఏళ్లలోపు ఉండి, ఎలక్ట్రిషియన్ పనుల్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న అభ్యర్థులు జర్మనీలో ఉద్యోగాలకు అర్హులన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.2,600 నుంచి 2,700 యూరోలు (భారత కరెన్సీ ప్రకారం రూ.2.60 లక్షల నుంచి రూ.2.70 లక్షలు) పొందొచ్చన్నారు. అదనపు పనికి అదనపు జీతం, ఇతర సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు. వసతి, అనువాద, స్థానిక గుర్తింపు ఖర్చులు యజమాని భరిస్తారని వెల్లడించారు. జర్మనీలో ఉద్యోగాలు పొందేందుకు అర్హులైన అభ్యర్థులకు జర్మనీ భాషపై పట్టు సాధించేందుకు వీలుగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు 12 నుంచి 14 వారాల పాటు శిక్షణ తరగతులను తాత్కాలికంగా రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఖర్చు అభ్యర్థులే భరించాలన్నారు.



## తిరుపతిలో ట్రావెల్ బస్సులు తనిఖీలు

**తిరుపతి,అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు విషాదఘటనతో రాష్ట్రప్రభుత్వం ఆదేశాలతో తిరుపతి జిల్లాలో పోలీసు, రవాణాశాఖ అధికారులు సంయుక్తంగా శనివారం సాయంత్రం ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై మెరుపుదాడులు చేశారు. ఈ తనిఖీల్లో బస్సుల్లో ఉన్న సీట్ల సామర్థ్యం, లగేజీబాక్సుల్లో ఉంచే లగేజీ వస్తువులు తదితర వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఆదేశాలతో అదనపు ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎంవిఐలు సంయుక్తంగా ఆర్టీసి బస్టాండు సమీపంలో, రామానుజ కూడలి, లీలామహల్‌కూడలి, కరకంబాడి ప్రాంతాల్లో ఈ ఆకస్మిక తనిఖీలు చేశారు. బస్సు డ్రైవర్లకు తగిన సూచనలు చేశారు. ప్రయాణీకుల భద్రత, సురక్షిత ప్రయాణం లక్ష్యంగా బస్సులు నడపాలని ఆదేశించారు.

# తిరుమల సమాచారం

## 30 నుండి త్రైమాసిక మెట్లోత్సవం

### - మూడురోజులు సామూహిక భజనలు



**తిరుమల,అక్టోబర్ 25ప్రభాత వార్తప్రతినిధి:** ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 30వతేదీ గురువారం నుండి నవంబర్ 1వతేదీ శనివారం వరకు మూడురోజులు త్రైమాసిక మెట్లోత్సవం జరుగుతుంది. 30,31 తేదీల్లో భజనమండళ్ళతో నామ సంకీర్తన, సామూహిక భజన కార్యక్రమాలు చేపడతారు. సాయంత్రం సంగీత విభావరి, ప్రవచన కార్యక్రమాలు ఉంటాయి. నవంబర్ 1వతేదీ ఉదయం 4గంటలకు అలిపిరి పాదాలమండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం వేలసంఖ్యలో వచ్చే భజన మండళ్ళ సభ్యులతో సాంప్రదాయ భజనలు చేస్తూ ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. గతంలో ఎందరో మహానీయులు భక్తిప్రపత్తులతో వేంకటాద్రి పర్వతాన్ని కాలినడకన అధిరోహించి స్వామివారి అనుగ్రహం పొందారు. అలాంటివారి అడుగుజాడల్లో నడిచి ఆ దేవదేవుని కృపకు పాత్రులు కావాలని తలంపుతో దాస సాహిత్య ప్రాజెక్టు మెట్లోత్సవం కార్యక్రమం నిర్వహిస్తోంది.

## వాహనసేవలో మంత్రి నాదెండ్ల మనోహార్



**తిరుమల,అక్టోబర్ 25 ప్రభాత వార్తప్రతినిధి:** నాగులచవితి పర్వదినాన శనివారం రాత్రి ఏడుకొండల శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఏడుతలల పెద్దశేషుని వాహనంపై ఊరేగారు. కార్తీకమాసంలో దీపావళి పర్వదిన ఆస్థానం వేడుకగా జరుపుకున్న నాల్గవ రోజు నాగులచవితి పర్వదినం రావడం, శనివారం విశేషమైన రోజున వరుణదేవుడు పలుకరిస్తుండగా పెద్దశేషవాహనాన్ని అధిరోహించిన స్వామివారు ఆలయ మాఢవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు గోవిందనామస్మరణలతో పులకించారు. బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి ఏడుతలల స్వర్ణ శేషవాహన్ణ అధిరోహిస్తారు. మళ్ళీ నాగులచవితిరోజు పెద్దశేషవాహనసేవను దర్శిస్తే దుష్టశక్తుల వల్ల కలిగే దుష్ఫలితాలు తొలగి భక్తులకు కుండలినీయోగ సిద్ధించి సుఖశాంతులతో ఆనందజీవులవుతారని విశ్వాసం. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

## అందరికీ శుభాలు కలగాలి: ప్రముఖులు



**తిరుమల,అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని పలువురు ఆకాంక్షించారు. శనివారం ఉదయం తమిళనాడు మంత్రి పివి గణేశన్, సినీ నిర్మాత ఇమ్మడి నర్శయ్య, దర్శకుడు మున్నా ధూళిపూడి వేర్వేరుగా ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనంతో మనసు ఎంతో ఉల్లాసంగా ఉంటుందన్నారు. టిటిడి వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## మరో వాయుగండం- తిరుమలలో కురుస్తున్న వాన



**తిరుమల,అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి:** బంగాళాఖాలంతో మరో వాయుగుండం ఏర్పడిన ప్రభావంతో శనివారం మధ్యాహ్నం నుండి భారీ వర్షం కురుస్తోంది. తిరుమలతో బాటు తిరుపతిలోనూ మధ్యాహ్నం, సాయంత్రం జోరువాన కురిసింది. ఉదయం నుండి కాస్త తెరపించినా మళ్ళీ మధ్యాహ్నం, సాయ ంత్రం మెరుపులతో వాన మొదలైంది. తిరుపతి జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. ప్రజలు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయరాదని అధికారులు సూచించారు. బలమైన చలిగాలులు వీస్తున్నాయి. సహాయకచర్యలకు పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది ,ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు సిద్ధమయ్యాయి. ఎక్కడా కూడా ప్రాణనష్టం జరగకుండా తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేలా స్పష్టమైన సూచనలు ఇచ్చారు. తిరుమలలో సాయంత్రం కూడా ఎడతెరపిలేని వాన కురిసింది. విపరీతమైన చలితో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా కురుస్తున్న వానలతో వాతావరణం మారి చలితీవ్రత పెరిగింది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు చలికి వణుకుతున్నారు.

## శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్‌గా కొట్టె సాయి ప్రమాణం



**శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా జనసేనకు చెందిన కొట్టె సాయి ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి ధర్మకర్తల మండలి పాలన బాధ్యతలను జనసేనకు దక్కింది. ఈ పదవి ఎన్నికలు జరిగి ఇక్కడ తెలుగుదేశం పార్టీ కి చెందిన బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి గెలిచినప్పటి నుంచి తమ పార్టీ మద్దతుదారునికి లభిస్తుందని ఆశించారు. అయితే కూటమి సమీకరణల్లో ఈ పదవి జనసేనను వరించింది. ఇక్కడ జనసేన పార్టీకి ఆదినుంచి తోడుగా ఉంటూ తెలుగుదేశం పార్టీకి కూడా సఖ్యతగా ఉన్న కొట్టెసాయి పేరును సాక్షాత్తు పార్టీ నాయకుడు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఆయనే స్వయంగా ముఖ్యమంత్రి నారాచంద్రబాఇబునాయుడుతో చర్చించిన మీదట ఖరారు చేసారు. తిరుపతి జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుకు శ్రీకాళహస్తీశ్వ రాలయం మీద అవగాహన ఉంది. అంతేకాక శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఇతర శైవాలయాలతో పాటు టిటిడి పర్యవేక్షణలో ఉన్న తొండమనాడు లోని టిటిడి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న అభయ వెంకటేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించి అవగాహన ఉంది. గతంలో గోపాలకృష్ణారెడ్డి అధికారంలో ఉన్నపుడు కూడా శ్రీకాళహస్తీశ్వరాలయానికి రాష్ట్ర స్థాయి ఉందని అభిప్రాయపడే వారు. అప్పటిలోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యత కల్పించాలని చంద్రబాబునాయుడు భావించే వారు. కానీ ఈ ప్రాంతాల్లో ఉన్న వారికి నామినేటెడ్ పదవులకు ఉన్న ఒకే ఒక అవకాశం అంటూ గోపాలకృష్ణారెడ్డి వాదించే వారు. అయితే గతంలో నారాచంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు 2017లో నామినేట్ చేసిన ధర్మకర్తల మండలిలో జిల్లాకు చెందిన వారికి అవకాశం కల్పించారు. బిజెపికి అవకాశం ఇచ్చారు. అయితే ఈసారి ఉమ్మడి తెలుగురాష్ట్రాలకు చెందదిన వారితో ధర్మకర్తల మండలి కూర్పు చేసారు. ఇందులో మూడు పార్టీలకు చెందిన వారు 7 మందికి మాత్రమే అవకాశం లభించింది. ఇక ప్రత్యేక ఆహ్వానితులుగా ఒకరికి అవకాశం వచ్చింది. 16 మంది సభ్యులు గల బోర్డులో సగం మంది బయటి వారు. ఈ సమీకరణల్లో చైర్మెన్ పదవి జనసేనకు వరించగా పార్టీ అధినేత కొట్టెసాయిని ఎంపిక చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్‌గా జనసేన పార్టీకి చెందిన ఓ సామాన్య కార్యకర్త తలుపు తట్టింది. జనసేన పార్టీలో కార్యకర్తలకు అధినాయకుడు ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది గుర్తింపుగా చెప్పవచ్చు. శ్రీకాళహస్తిలో ఆది నుంచి కొట్టె సాయి పార్టీ లో ఉన్నారు. 2019లో ఆయన పార్టీ కోసం పాటుపడ్డారు. అయితే అప్పటిలో వైకాపా ధాటికి జనసేన తట్టుకోలేకపోయింది. 2019 నుంచి 2024 వరకు వైకాపా వత్తిడులను ఎదుర్కోవాల్సి వచ్చింది.

## చెట్లమల్లాపురం బస్సు ప్రమాద మృతుల గుర్తింపునకు డిఎన్ఎ పరీక్షలు

**కర్నూలు, అక్టోబర్ 25 (ప్రభాతవార్త):** కర్నూలు జిల్లా చెట్లమల్లాపురం సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదంలో మృతి చెందిన 19 మంది ప్రయాణికుల శరీరాలు పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేని స్థితిలో ఉండడంతో అధికారులు డిఎన్ఎ పరీక్షల ద్వారా గుర్తింపునకు చర్యలు ప్రారంభించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో నిపుణుల బృందం శుక్రవారం రాత్రి వరకు మృతదేహాల నుండి అవసరమైన భాగాలను సేకరించి విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అదే సమయంలో, మృతుల కుటుంబ సభ్యులలో 16 కుటుంబాల నుండి వారి రక్త నమూనాలను తీసి, సరిపోల్చేందుకు పంపించినట్లు వైద్యాధికారులు తెలిపారు. డిఎన్ఎ పరీక్షల ఫలితాలు రావడానికి సుమారు 48 గంటల సమయం పడుతుందని, రిపోర్టులు అందిన వెంటనే ప్రతి మృతదేహాన్ని సంబంధిత బంధువులకు అప్పగించే ప్రక్రియ చేపడతామని అధికారులు పేర్కొన్నారు..

# ఇంకెన్నాళ్లీ 'కష్టాల' సాగు

ఒక పక్క వర్షాలు, మరోపక్కకొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, ఇంకో పక్క ముంపు బారినపడి దెబ్బతినగా, మిగిలిన పంటలకు మద్దతు ధరలురాకపోగా, తక్కువ ధరలకు కొనుగోలుచేయడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో అన్నదాతల పరిస్థితి దయనీయంగా తయారయింది. భారీ వర్షాలతో పంటలు దెబ్బతినడం వల్ల పంటల కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యం అవుతోంది, అక్కడక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినా వాటిల్లో తేమశాతం పేరుతో కొనుగోళ్లుచేయడం లేదు. పత్తి,మొక్కజొన్న,వరి వంటి ఖరీఫ్ పంటలకు నష్టం వాటిల్లుతోంది. పంటలు నీటిలో మునిగిపోవడం, శిలీంధ్రవ్యాధులు సంభవించడం, తెగుళ్ల పెరగడంవంటి సమస్యలవల్ల రైతులు నష్టపోతున్నారు. ఇప్పటికే పండించిన పంటలు కూడా తడిసిపోవడంతో, కొనుగోలు కేంద్రాల్లో నాణ్యత లేకపోవడం లేదా కొనుగోలు ధరలు తగ్గడంవంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీవర్షాల కారణంగా పొలాల్లో నీరు నిలిచిపోవడంతో వరి, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, పప్పుధాన్యాలు వంటి పంటలు దెబ్బతింటున్నాయి. పంటలు తడిసిపోవడంవల్ల నాణ్యత తగ్గి, కొనుగోలు ప్రక్రియ ఆలస్యం అవుతోంది. కొన్నిసందర్భాల్లో, తడిసిన పంటలను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. పంట నష్టంతోపాటు, వ్యాపారులు, దళారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తుండటంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పత్తికొనుగోళ్లకు సంబంధించి సీసీఐ పెట్టిన నిబంధనలు రైతులకు తీవ్ర ఇబ్బందులు గురిచేసేవిగా ఉన్నాయి. దీనికి తగినట్లుగా వాతవరణం మార్పులతో ఉన్న పంటలకు తెగుళ్లు వ్యాపిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటలపై ప్రధానంగా పత్తిపై తీవ్ర ప్రభావంపడుతోంది. పత్తి, వరి పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు పడడంతో తెగుళ్ల బారినపడి రైతులు నష్టపోతున్నారు. పంటల సాగు కోసం పెట్టిన ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేదు.

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రెండు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చేదికంది వచ్చిన పంటలు నీటిపాలవుతున్నాయి. రైతులు దిగుబడి రాక ఇబ్బందులు పడుతుంటే ప్రకృతి రైతుపై కక్ష కట్టినట్లు పంట చేతికొచ్చే దశలో అధిక వర్షాలు పడటంతో పంట మొత్తం దెబ్బతిని తీవ్రంగా నష్టపోతున్నామని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తోంది. కోతకు సిద్ధమైన వరి, పత్తి, పంటలు ఈదురు గాలులు, భారీ వర్షాలతో నీటిలో మునిగి, రాశులైనవి తడిసి, కొన్ని నేలకు కరిచిన స్థితిలో ఉన్నాయి. రైతులకష్టం నీళ్లలో కలిసిపోతుండగా వారి ఆవేదన కన్నీటితో కటకటలాడుతోంది. కోతకు వచ్చిన వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు వర్షాలకు దెబ్బతిని పెట్టుబడులు సైతం నష్టపోతున్నారు. భారీవర్షాల వల్ల పంట నీట మునిగి, పత్తి కాయలు రంగు మారాయి. ఫలితంగా దిగుబడి తగ్గనుండగా జిల్లాలోకొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల పంటను అమ్ముకునేందుకు ఇబ్బంది తప్పడం లేదు. మూడు రోజులుగా కుండపోత వర్షాలు రైతుల కలలను కొట్టిపారేస్తున్నాయి. మెదక్, వరంగల్, సిద్దిపేటలో భారీ వర్షంతో పత్తి మార్కెట్‌లో ఉన్న మొక్కజొన్న, వరి ధాన్యం తడిసి ముద్దయింది. చాలారోజుల కిందటే మార్కెట్‌కు మొక్కజొన్నలు, ధాన్యం తెచ్చినప్పటికీ కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం మొత్తం తడిసిపోయింది. తేమ శాతం తక్కువగా ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఐకేపీ సెంటర్లలో ఆరబెట్టిన ధాన్యం వర్షంతో తడిసి నీటి పాలైంది. ఖమ్మంజిల్లాలో వర్షాలతో పత్తి పంటదెబ్బతింది. ఎకరాకు 50వేల రూపాయలు పెట్టుబడి పెడితే కనీసం 20 వేల రూపాయల పంటకూడా చేతికివచ్చే పరిస్థితి కనిపించడంలేదు. పత్తి తేమ ఉందని రూ.3,500కే అడుగుతున్నారు. ఎకరాకు రూ.50వేల చొప్పున పెట్టుబడి పెట్టగా, ఇప్పుడు భారీగా నష్టపోవాల్సి వస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలో చేతికి వచ్చే మక్క, సోయా, మినుము, పెసరు వంటి పంటలు చేతికి వచ్చే సమయంలో వర్షం కురవడంతో నష్టంవాటిల్లింది. మూడు వారాల నుంచి పత్తి రావడం మొదలైనా ఏరేందుకు కూలీల కొరత ఉండడంతో చాలా మంది రైతులు పత్తి తీయకుండా అలాగే ఉంచారు. పంట చేతికొచ్చిన చోట పత్తిమొత్తం వర్షానికి తడిసి రాలిపోతోంది. కాయలోని పత్తి నల్లబారుతోంది. దీంతో కొన్ని చోట్ల రైతులు పత్తిఏరి రోడ్లపై ఆరబోస్తున్నారు. అయినా రంగు మారుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పంటను అమ్మకానికి తీసుకుపోతే సరైన మద్దతు ధరవస్తుందా? లేదా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిసిఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా



పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో వర్షాలకు భయపడి గత్యంతరం లేక కొందరు రైతులు చెట్ల నుంచి తీసిన పత్తిని ప్రైవేట్లో అమ్ముకుంటున్నారు. మద్దతుధర రూ.8,200 ఉండగా రూ.2 వేల నుంచి రూ.వెయ్యి తక్కువకు ప్రైవేట్లో అమ్మి తీవ్రంగా నష్టపోతున్నారు. సకాలంలో సీసీఐ సెంటర్లను కూడా ఓపెన్ చేయకపోవడంతో నష్టపోవాల్సి వస్తోంది. ఇక ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో సోయాబీన్ పంట దెబ్బతింది. రాష్ట్రంలోని నిర్మల్, ఆదిలాబాద్ తదితర జిల్లాల్లో సోయాబీన్ తోటలు పుష్పించే, కోత దశలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు పంటను దెబ్బతీయడంతో రైతులు తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. నిర్మల్, ఆదిలాబాద్‌లో వర్షాలతో సోయాబీన్ దెబ్బతిని దిగుబడి బాగా తగ్గింది. ఎకరానికి 5 నుండి 3 క్వింటాళ్లకు పడిపోయి రైతులు నష్టం పోయారు. సోయాబీన్‌కు కనీస మద్దతు ధరగా క్వింటాలుకు రూ.5,328గా నిర్ణయించగా, గత కొన్ని రోజులుగా పంట కోతలు కొనసాగుతుండటంతో వాటిని రూ.4,200 కూడా అమ్ముకుంటున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజనులో 67.33 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడగా, తద్వారా 80 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి కానుంది. ఇందులో 62 శాతం మేర సన్న రకాలను రైతులు సాగు చేయగా, 42నుండి 45లక్షల టన్నులు దిగుబడి అవుతుందని అంచనా. సన్నాలకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించాలని నిర్ణయించినా, గత రబీ సొమ్ము పెండింగ్ పడింది. ధాన్యం కొనుగోలు చేసి నెలలు అయినా ఇంత వరకూ రూ.500 చొప్పున రైతులకు బోనస్ చెల్లించకుండా బకాయిలు పడింది. ఈవిధంగా 74.23లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఇందులోసన్నరకాలు దాదాపు23.20 లక్షల టన్నులకు బోనస్‌గా రూ.1,160 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. ఇక పత్తికి సంబంధించి ఇప్పటికే కొనుగోళ్ల విషయంలో జాప్యం చేసిన సిసిఐ రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సేకరణ ప్రారంభించింది. కొనుగోళ్లు జాప్యం చేయడంతో పాటు, కొత్తగా అమల్లోకి తెచ్చిన నిబంధనలు, ముడి పత్తిపై దిగుమతి సుంకాన్ని రద్దు చేయడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వంటి కారణాలు పత్తి రైతులకు టెర్రర్ పుట్టిస్తున్నాయి. పత్తిలో తేమ 12కన్నా ఎక్కువ శాతం ఉంటే కొనుగోళ్లకు అనుమతించబోమని తెలిపింది. తేమ శాతం 8 నుండి 12మధ్య ఉంటే ధర నిష్పత్తి ప్రకారం తగ్గుతుందని తెలిపింది. అలానే పొడవాటి దూదికి క్వింటాలుకు రూ.8,110, మధ్యస్థానికి రూ.7,710గా మద్దతు ధర ప్రకటించింది. ప్రధాన మార్కెట్లలో భారీగా పత్తి సరఫరా అవుతున్నప్పటికీ సిసిఐ మాత్రం కొనుగోళ్లను ప్రారంభించకపో వడంతో గత కొన్ని రోజులుగా వ్యాపారులు, దళారులదే ఇష్టారాజ్యమైంది. వరంగల్, జమ్మికుంట వంటి కీలక మార్కెట్లలో ప్రస్తుతం మండి ధరలు క్వింటాలుకు రూ.5,600-7,303 మధ్య ఉండగా, సగటున రూ.6,600 వరకు ఉన్నాయి. దీంతో రైతులు ఎకరానికి సుమారు రూ.10వేలనుండి రూ.15 వేల వరకూ నష్టపోతున్నారు. ఖరీఫ్‌లో పత్తి సాగు 43-44 లక్షల ఎకరాలు కాగా, నల్గొండ, ఆదిలాబాద్, వరంగల్ వంటి జిల్లాల్లో వర్షాలు పంటలను దెబ్బతీశాయి. దీనివలన అంచనా వేసిన దిగుబడి 29 లక్షల టన్నుల నుండి దాదాపు 25 లక్షల టన్నులకు తగ్గింది. ఇక 15నుండి 20శాతం పంటలో కాయతెగులు, రంగు మారడానికి కారణమైంది. తెలంగాణ, ఆంధ్రాలో కపాస్ కిసాన్ యాప్‌తో మారుమూలప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. టెలికాం నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల యాప్‌లో నమోదు చేసుకోలేక, స్లాట్‌లను బుక్ చేసుకోలేకపోతున్నారు. గ్రామాల్లో సెల్‌ఫోన్ల నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల పేరు, భూమి టైటిల్ వివరాలు, ఆధార్ నంబర్ నమోదు చేసుకోలేక స్లాట్ బుక్ చేసుకోలేకపోతున్నారు. దీంతో రైతులు ప్రైవేట్‌లో తక్కువ ధరలకు అమ్మాల్సి వస్తోంది. మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోళ్లు కూడా సజావుగా సాగడం లేదు. కనీస మద్దతు ధర రూ.2,400 కాగా, వివిధ మార్కెట్లలో కొనుగోలు ధర రూ.1,800 నుండి రూ. 2 వేల వరకూ ఉంది. గత నెల మూడోవారం నుంచే రైతులు మార్కెట్లోకి తీసుకురావడం ప్రారంభించారు. అయితే ఇప్పటి వరకూ చాలా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వచ్చింది. రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు నిజామాబాద్, కామారెడ్డి, కొత్తగూడెం తదితర జిల్లాలో మొక్కజొన్న రైతులను నిండా ముంచాయి. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50వేలకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న దెబ్బతింది. వర్షాలతో ఆరబోసిన మొక్కజొన్న పంట తడిసి ముద్దైంది. దీంతో మొక్కజొన్న పంట రంగు మారుతుంది. గింజ ఆరక ముందే నానడంతో గింజలకు మొలకలొచ్చే ప్రమాదం ఏర్పడింది. దీంతో పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. ●

---

కర్ణాటక

# మూడో కృష్ణుడు!

**ఎ.వి.వి ప్రసాద్**

కానున్నది కాకమానదన్నది వాస్తవమే అయినా, ఏం జరగబోతోంది? అనే ప్రశ్న తలెత్తినప్పుడు రాజకీయాల్లోనైతే అనేక ఊహాగానాలు వెల్లువెత్తుతూంటాయి. కర్ణాటకలో ఇప్పుడు కనిపిస్తున్నది అటువంటి దృశ్యమే. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవిలో కొనసాగుతారా? లేక రెండో కృష్ణుడో, మూడో కృష్ణుడో వేదిక మీదకు వస్తారా! అనే వాదనలు రాజకీయ వర్గాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. మరో నాలుగు రోజుల్లో నవంబరు లోకి ప్రవేశిస్తామన్నది గుర్తుకు రాగానే అందరిలో 2023లో వినిపించినమాటలే ప్రతిధ్వనిస్తున్నాయి. ఆ సంవత్సరం మేలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు కొత్త సిఎం ఎంపిక విషయంలో చాలా నాటకీయ పరిణామాలే సంభవించాయి. సిద్ధరామయ్య, డికె శివకుమార్ మధ్య 'గట్టి పోరు' నడిచింది. కారణాలేమైనా, ఈసారి సిద్ధరామయ్య కంటే పార్టీ తనకే అవకాశమివ్వాలని శివకుమార్, ఆయన మద్దతుదారులు గొంతు వినిపించారు. అయితే అధిష్ఠానం మొత్తానికి వారిద్దరి మధ్య రాజీకుదిర్చి సిద్ధరామయ్యకే పట్టం కట్టింది. కానీ రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఠాన్ని డికెకు అప్పగించాలనీ, ఇద్దరూ అలా అధికారాన్ని పంచుకోవాలనీ సిద్ధరామయ్యకు అధిష్ఠానం నచ్చజెప్పినట్లు కూడా అప్పట్లో వినిపించింది. వాస్తవం కూడా అదే. అందుకు సిద్ధపడే సిద్ధరామయ్య పగ్గాలు చేతిలోకి తీసుకొన్నారు. ఈ విషయాన్ని డికె కూడా మధ్యమధ్యలో చాలాసార్లు తన అనుయాయుల ద్వారాగుర్తు చేస్తున్నారు కూడా. పద వులపై తనకు ఎలాంటి ఆశ లేదనీ, పార్టీ ఏం చెప్తే అది చేసే క్రమశిక్షణ గల సైనికుడననీ అంటూ ముఖ్యమంత్రి పీఠంపై తనకు ఎలాంటి ఆశలు లేవన్నట్లుగా ప్రచారం చేసుకొన్నారు. కానీ ఆయన అనుచరులు మాత్రం 'మా డికెయే ఇక సిఎం' అంటూ గత పదిహేను రోజులుగా ము మ్మర ప్రచారాన్ని సాగిస్తున్నారు. బీహార్‌ఎన్నికలు కాగానే కర్ణాటక నాయకత్వాన్ని పార్టీతనకు అప్పగిస్తుందనే ప్రచారం అనుచరుల ద్వారాచేయిస్తూ డికె సంచలనాలుసృష్టిస్తున్నారు. ఆయనే సిఎం అవుతారంటూ ఎమ్మెల్యేలుఇక్బాల్ అహ్మద్, రంగనాథ్, హెచ్‌సి బాలకృష్ణ, శివలింగే గౌడ తదితరులు బహిరంగ వ్యాఖ్యలు చేయడం కూడా గమనించవలసిన పరిణామం. మైసూరు దసరా ఉత్సవాల తర్వాత డికె మరింత చురుకుగా తన వ్యూహాన్ని అమలుచేస్తున్నారని కూడా వినిపిస్తోం ది. బెంగళూరు, ఇతర ప్రాంతాల్లో సుడిగాలి పర్యటనలు చేస్తూప్రజలతో నేరుగా చర్చలు జరపడం మరో ఆసక్తికర పరిణామం. రాష్ట్రాభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నాననే హామీలు ఇస్తున్నారు. అవి నీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసు కొంటానని హెచ్చరిస్తూ పాలనా పరమైన వ్యవహారాల్లోనూ శ్రద్ధ తీసుకొంటున్నారు. బెంగళూరు సిటీలో రహదారుల సమస్య ఇటీవలప్రభుత్వానికి పెద్దతలనొప్పిగా మారడంతోతాను పర్యటించిన ప్రతిచోటా ఆ సమస్య పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నట్లుచెబుతున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అనారోగ్య కారణాలతో ఇటీవల బెంగుళూరులో విశ్రాంతి తీసుకున్నప్పుడు డికె ఆయనను ప్రతిరోజూ కలుసుకొన్నారనీ, సిద్దరామయ్య కంటే డికెనే ఎక్కువసార్లు ఖర్గేను కలిసారనీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. 'ఇప్పటి దాకా వేచి ఉన్నారు కదా! బీహార్ ఎన్నికల తర్వాత అన్ని విషయాలలోను స్పష్టత వస్తుంది. పార్టీ పట్ల గల విధేయతకు ఫలితం కనిపిస్తుంది' అంటూ ఖర్గే డికెకు హామీఇచ్చినట్లు కూడావినిపిస్తోంది. దీనితో డికె అనుచరులు కూడా కొద్ది రోజులుగా చాలా ఉత్సాహంతో కనిపిస్తున్నారు.



సతీష్ జర్కిహోళి

ఈ పరిస్థితిలో సిద్ధరామయ్య తనయుడు, ఎమ్మెల్సీ అయిన యతీంద్ర చాలా 'క్యాజువల్'గా మరో బాంబు పేల్చారు. తన తండ్రి రాజకీయ జీవితం చరమాంకంలో ఉన్నదనీ, ఆయన తర్వాత కేబినెట్ సహచరుడైన సతీష్ జర్కిహోళిముఖ్యమంత్రి అయితే బాగుంటుందనీ అనడం గత నాలుగు రోజులుగా రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టిస్తోంది. గత బుధవారం ( 22, అక్టోబరు) ఆయన బెళగావిలో ఓ కార్యక్రమానికి హాజరైన ప్పుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అప్పుడుజర్కిహోళి కూడా ఆయన వెంటఉండడంతో ఆ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. జర్కిహోళి ప్రస్తుతం పబ్లిక్ వర్క్స్ మంత్రిగా ఉన్నారు. ఆయనకు గతంలో కూడా మంత్రిగాచేసిన అనుభవం ఉంది. 2008నుంచి యెమకన్ మార్డి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్టీ నాయకుడాయన. యతీంద్ర ఆ మాటలు తానుగా అన్నారో, అధిష్ఠానం అనిపించిందో తెలియదు కానీ, డికెకు చెక్ పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మాత్రం దీనితో స్పష్టమవుతోంది. డికెకు ముఖ్యమంత్రి పీఠం అందకుండా చేయడానికే కొత్తగా 'మూడో కృష్ణుడి'ని ప్రవేశపెడుతున్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. అధికార మార్పిడి అంటూ జరిగితే అది డికె, జర్కిహోళిలో ఎవరివైపు మొగ్గు చూపుతుందనే చర్చజోరుగా సాగుతోంది. డికెకు పోటీగా మరో పేరు తెరపైకి రావడంతో అసలుఅధిష్ఠానం మదిలో ఏముందనేచర్చ కూడా సాగుతోంది. యతీంద్ర వ్యాఖ్యల తర్వాత ఖర్గేగాని, రాహుల్‌గాని ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయకపోవడంతో కొత్త ఊహాగానాలు కూడా ఎక్కువయ్యాయి. కాంగ్రెస్ ఎంపి ఎల్ఆర్‌శివరామే గౌడ రెండు రోజులక్రితం అధిష్ఠానంతో మాట్లాడి వచ్చిన తర్వాత రాష్ట్రంలో తలెత్తిన రాజకీయ గందరగోళానికి త్వరలోనే తెరపడబోతోందంటూ చేసిన వ్యాఖ్యకూడా కలకలం సృష్టిస్తోంది. ఎవరి అభిప్రాయాలు ఎలాఉన్నా తుది నిర్ణయం అధిష్ఠానానిదే అనీ, తగిన సమయంలో తగిన నిర్ణయం వెలువడుతుందనీ ఆయన అనడం కొత్త ఊహాగానాలను రేకెత్తిస్తోంది. అందుకే రెండో కృష్ణుడా, మూడో కృష్ణుడా అనే చర్చకూడా ఎక్కువగానే జరుగుతోంది. ఏదిఏమైనా ఏదో జరగబోతోందనే విషయం స్పష్టమవుతోంది. అదిఏమిటో నవంబరులోకి రాగానే తేలిపోతుందన్నది ఎక్కువమంది మాట. యతీంద్ర, గౌడవ్యాఖ్యల తర్వాత ఊహాగానాలకు ఒకస్పష్టమైన రూపం ఏర్పడుతోంది. అది ఏమిటో త్వరలోనే తెలుస్తుంది. ●

---


దేశం

మాంటెనెగ్రో

# ఇయు సభ్యత్వం కోసం తహతహ!

**గన్ని మోహన్**

ఆగ్నేయయూరోప్ భాగంలో ఉన్న అతిచిన్న దేశం ఇప్పుడు ఐరోపా కూటమిలో చేరేందుకు ఉవ్విళ్లూరుతోంది. తమ దేశంపై ఇతర అగ్రరాజ్యాల పెత్తనాన్ని సహించలేని ఈ చిన్న దేశం మాంటెనెగ్రో 2028కల్లా యూరోప్‌లో సభ్యదేశంగా చేరేందుకు అవసరమైన అన్ని సంప్రదింపులు చేపట్టింది. ఆదేశ అధ్యక్షుడు జకోవ్ మిలటోవిక్ మాట్లాడుతూఇతర సరిహద్దు దేశాల నుంచి తమదేశంపై విష ప్రచారం జోరుగా సాగుతోందని విమర్శిస్తున్నారు. అంతే కాకుండా తమ దేశంపై రష్యా ప్రభావం ఎక్కువ కనిపిస్తున్నదన్న భావన పెరిగింది. ఎందుకంటే ఆదేశంలో పెట్టుబడులు పెట్టేవారిలో 80శాతానికిపైగా రష్యా ఇన్వెస్టర్లే ఉన్నారు. సెర్బియానుంచి 2006లో స్వతంత్రదేశంగా ఆవిర్భవించిన తర్వాత మాంటెనెగ్రో 2008లోనే ఈయూలో చేరేందుకు దరఖాస్తు చేసింది. ఇతరత్రా 12 దేశాలతో పాటు మాంటెనెగ్రో కూడా దరఖాస్తుల చేసిన దేశాల్లోఉంది. రెండేళ్ల తర్వాత అభ్యర్థి హోదాను సాధించింది. ఈయూలో చేరేందుకు అవసరమైన 33 చేరిక అంశాల్లో ఏడు పూర్తిచేసింది. మరో ఐదింటిని ఈ ఏడాది చివరికల్లా భర్తీచేసుకోగలమని ధీమాతో ఉంది. యూరోపియన్ సానుకూల రాజకీయ వేత్తలు, పాశ్చాత్య బాల్కన్లు తమపై చేస్తున్న ప్రచారం వల్లనే ఐరోపా కూటమిలో చేరడంలో జాప్యం జరుగుతోందని అధ్యక్షుడు మిలాటోవిక్ వాదనలకు తగినట్లుగానే జాప్యం జరుగుతూ వస్తోంది. అదేరకమైన ఒత్తిడి కూడా మాస్కోనుంచి మాంటెనెగ్రో ఎదుర్కొంటున్నది. ఐరోపాపై ఒత్తిడి తెస్తూ తన కొత్త సైబర్‌రిజర్వు అక్కడ మోహరించాలని ప్రాంతీయ హబ్ ఏర్పాటుకు నిధిని కేటాయించాలంటూ మాస్కో కొంత కాలంగా ఒత్తిడి తెస్తోంది. ఇప్పటికే రష్యా సరిహద్దు దేశాలను ఐరోపా కూటమిలో చేరడాన్ని తీవ్రంగా అభ్యంతరాలు చెపుతున్న రష్యా ఇప్పుడు మాంటెనెగ్రో చేరికపైనా పరోక్షంగా తన వ్యూహాలను అమలుచేస్తున్నది. దీనికితోడు ఆదేశ పార్లమెంటులో కూడా విభేదాలు వచ్చాయి. ఆరులక్షల మంది జనాభాకు మించిలేని ఈ చిన్న దేశంలో ఐరోపా సభ్యత్వంపై ఆదేశ పార్లమెంటులోనేభిన్న స్వరాలు లేచాయి. అలాగే పొరుగుననే ఉన్న క్రోయేషియానుంచి కూడా ఉద్రిక్తతలు ఎదుర్కొంటున్నది. కొన్ని యూరోపియన్ సభ్యదేశాలనుంచి కూడా కొన్ని సందేహాలు వ్యక్తం అవుతుండటంతో2028కల్లా ఈయూ సభ్యదేశంగా పూర్తిస్థాయికి రావడం సాధ్యమేనా అన్నభావన ఆదేశ ప్రజల్లో వ్యక్తంఅవుతోంది. ఇప్పటికే ఐరోపా కూటమిలో సంస్కరణలు అవసరం అని ఫ్రాన్స్‌లాంటి కొన్ని అగ్రరాజ్యాలు గొంతెత్తాయి. కొత్త సభ్యులను చేర్చుకునే ముందు ఈయూను సంస్కరించాల్సిందేనన్న వాదన కూడా బయలుదేరిన నేపథ్యంలో మాంటెనెగ్రో ఈయూలో చేరిక అనేది గడువులోపు సాధ్యం అవుతుందాఅన్న ప్రశ్నఉదయిస్తోంది. దీనికి తోడు రష్యాతో ఆర్థికసంబంధాలు కూడా ఎక్కువే ఉన్నాయి. మాంటెనెగ్రోలో పర్యటించే రష్యన్లు నెల రోజులపాటు వీసా ఫ్రీ ఎంట్రీ ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థకు రష్యా ఇన్వెస్టర్లే సింహభాగం వాటాతో ఉన్నారు.



జకోవ్ మిలటోవిక్


యూరోపియన్ యూనియన్‌లో చేరిన చిట్టచివరి దేశం క్రోయేషియా. పదేళ్లక్రితమే ఈ చిన్నదేశానికి అనుమతి లభించింది. బ్రిటన్ వైదొలిగిన తర్వాత క్రోయేషియాకు స్థానం లభించింది. వాస్తవానికి12 దేశాలు 2014 నుంచే ఈయూలో సభ్యత్వం కోసం పరితపిస్తున్నాయి. భౌగోళికంగా చిన్నదేశాలు కావడం తమకు సరిహద్దు భద్రత కొరవడుతుండటంతో ఐరోపా కూటమిలాంటి పెద్ద ఖండంలో చేరితే తమ భద్రతకు భరోసా లభిస్తుందని, దీనితోడు ఆర్థికంగాను, వాణిజ్యపరంగాను ఎంతో లాభదాయకం అవుతుందన్నది వీటి ఉద్దేశ్యం. ముఖ్యంగా మాంటెనెగ్రోలో అయితే పూర్తిగా పర్యాటకరంగమే ప్రధాన ఆదాయవనరు. అందుకోసమే ఐరోపా దేశాల నుంచి ఎక్కువ మంది పర్యాటకులను ఆకర్షించడం ద్వారా దేశ ఆర్థికవృద్ధిని మరింత మెరుగుపరుచుకోవచ్చన్నది ప్రస్తుత అధ్యక్షుడి ఆలోచగా ఉంది. అటు సైబర్ సెక్యూరిటీ, రక్షణరంగ భద్రతతోపాటు ఆర్థిక, వాణిజ్యభద్రతకు కూడా ఐరోపాకూటమి అండగానిలుస్తుందన్న భావనతో ఈచిన్నదేశాలు చిరకాలంగా సభ్యత్వం కోసం పరితపిస్తున్నాయి. ఆగ్నేయ ఐరోపా ప్రాంతంలోని చిన్న పర్వతశ్రేణుల దేశంగా నిలిచిన మాంటెనెగ్రోకు పర్యాటకులు విరివిగా వస్తుంటారు. 2006నుంచి సెర్బియానుంచి స్వాతంత్ర్యం పొందిన తర్వాత తన కాళ్లపై నిలదొక్కుకుంటూ బాల్కన్ దేశాల్లో ఒకటిగా నిలిచింది. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద కలిగిన దేశాల్లోకూడా గుర్తింపు పొందిన ఈదేశం ఒకవిధంగా చెప్పాలంటే బాల్కన్ దేశంగానే భావిస్తారు. ప్రకృతి అందాలకు పెట్టిందిపేరు అయిన ఈచిన్నదేశంలోపర్యాటకరంగం వృద్ధిపైనే ఆదేశం ఎక్కువ ఫోకస్‌పెడుతుంది. ప్రత్యేకించి రష్యా నుంచి ఎదురవుతున్న విషప్రచారం అడ్డంకులను అధిగమించేందుకు రష్యాకు వ్యతిరేకంగా ఉన్నదేశాలతో కూడా జట్టుకడుతూ ఇతర ఈయూదేశాల మద్దతు కూడగడుతోంది. మొత్తం 12దేశాలు సభ్యత్వంకోసం అహరహం శ్రమిస్తున్న వాటిలో మాంటెనెగ్రో ముందు వరుసలో ఉంది. వీటికితోడు సరిహద్దుల్లో ఉన్న క్రోయేషియా, బోస్నియా, హెర్జెగోవినా, సెర్బియా, కొసావో, ఆల్బేనియా దేశాలనుంచి ఎదురయ్యే అడ్డంకులను కూడా అధిగమించాలి. అన్నింటికంటే ముందు రష్యాను ప్రసన్నం చేసుకోవాలి లేదా ఇతర అగ్రరాజ్యాల దన్నుతో అధిగమించిఅయినా ముందుకుసాగాలి. ఎగువ మధ్యాదాయ కేటగిరీ దేశంగాఉన్న ఈఆగ్నేయ ఐరోపాప్రాంతచిన్నదేశం అభివృద్ధిలోముందుకు దూసుకువెళ్లాలంటేఇయూ సభత్వం అనివార్యం అనే భావిస్తోంది. తక్కువ పన్నులు, సులభతర, జీవనశైలి ఉన్న ఈ దేశం ఎక్కువగా పర్యాటకం, సేవల రంగంపైనే ఆధారపడిఉంది. 80శాతంఐరోపా దేశాలనుంచే వస్తున్న పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందాలంటే ఐరోపా శాశ్వతసభ్యత్వం అనివార్యం అనేఈచిన్న దేశంభావిస్తోంది. అయితే అనుకున్న లక్ష్యంమేరకు 2028నాటికి ఈయూలో చేరేవిధంగా చేరడమనేది ప్రస్తుత అధ్యక్షుడు జకోవ్ మిలాటోవిక్‌కుసవాళ్లతో కూడిన ప్రయాణమే అనిచెప్పకతప్పదు. ●

---

# గతి తప్పుతున్న ప్రాంతీయ పార్టీలు!

**కైలసాని శివప్రసాద్**


దేశంలో 8 జాతీయ పార్టీలు, 58 ప్రాంతీయ పార్టీలు, 2763నమోదు కాబడి గుర్తింపు లేని రాజకీయ పార్టీలున్నాయి. గత కొద్ది సంవత్సరాలుగా జాతీయ పార్టీలపై దేశ ప్రజలలో విశ్వాసం సన్నగిల్లుతుంది అనేది నిర్వివాదాంశం. దీంతో దేశవ్యాప్తంగా ప్రాంతీయ పార్టీల ప్రభావం అధికమైపోయింది. జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి ప్రాంతీయ పార్టీలు అభివృద్ధి చెందడం గమనార్హం. గత కొద్దికాలంగా కేంద్రంలో ఏర్పాటుచేస్తున్న సంకీర్ణ ప్రభుత్వాలలో ప్రాంతీయ పార్టీలు చాలా కీలకంగా మారాయి. ప్రాంతీయ పార్టీలు కొత్తగా పుట్టుకొచ్చినవి కావు. శిరోమణి అకాలీదళ్, ఎఐఎంఐఎం, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, జమ్ము కాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ లాంటి అనేకప్రాంతీయ పార్టీలు దేశానికి స్వాతంత్రం రాక ముందే ఆవిర్భవించాయి. స్థానిక రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు, ఆశయాలకు ప్రతినిధులుగా వ్యవహరిస్తూ స్థానిక సమస్యలు, సంస్కృతులకు ప్రాంతీయ పార్టీలు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఉంటాయి. ఈ పరిణామాలతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ప్రాంతీయ పార్టీల ఆధిక్యంతో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లాంటి అనేక రాష్ట్రాలలో జాతీయ పార్టీలు ఉనికినే కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రాంతీయ పార్టీలు స్థానిక రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు, ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తుండడమే వాటికి ప్రజలలో ఆదరణ ఎక్కువగా లభిస్తూ ఉందనడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ప్రాంతీయ పార్టీల ప్రభావాన్ని తట్టుకుని రాష్ట్రాలలో మనుగడ సాగించేందుకు జాతీయ పార్టీలుకూడా ప్రస్తుత పరిస్తితులలో ఆయా రాష్ట్రాలలో ఉన్న స్థానిక సమస్యలపై దృష్టికేంద్రీకరించవలసిన పరిస్తితి ఏర్పడింది. అదే విధంగా సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది ప్రాంతీయ పార్టీలే అనడంలో ఎటువంటి సందేహం లేదు. 1983లో తెలుగుదేశం పార్టీ మొట్ట మొదటి పర్యాయం అధికారం చేపట్టినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అమలుచేసిన రెండురూపాయాలకే కిలోబియ్యం లాంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. రామారావు అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలు అనేక రాష్ట్రాలలోని అనేక ప్రాంతీయ పార్టీలతో పాటూ జాతీయపార్టీలకు కూడా మార్గదర్శకంగా మారడం గొప్పపరిణామం. శిరోమణి అకాలీదళ్, ఎఐఎంఐఎం, జమ్ముకాశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్, మీజో నేషనల్ ఫ్రంట్, మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ, జెఎంఎం, డిఎంకె, అన్నా డిఎంకె లాంటి ప్రాంతీయ పార్టీలు తెలుగుదేశం పార్టీ కంటే మునుపేఆవిర్భవించాయి. అయినా దేశంలో సంక్షేమ కార్యక్రమాలను ఆచరణలోకి తెచ్చింది మాత్రం తెలుగుదేశం పార్టీనే అని కచ్చితంగా చెప్పవచ్చు. 1971 ఎన్నికల సమయంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి ఇందిరా గాంధీ గరీబీ హఠావోదేశ్ బచావో (పేదరికాన్ని నిర్మూలించండి దేశాన్నికాపాడండి) అనే నినాదంతో దేశవ్యాప్తంగా హడావిడి చేసి ఆ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది. అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల తరువాత 1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో పేదరిక నిర్మూలన కొరకు 20 సూత్రాల కార్యక్రమం ప్రారంభించారు. దానివలన నామమాత్రా సత్ఫలితాలు కూడా వెలువడిన దాఖలాలు లేవు. 20 సూత్రాల కార్యక్రమం దేశంలో ప్రారంభమై 50సంవత్సరాలు దాటినా ప్రజల పేదరికం కేంద్రంగా రాజకీయాలు చేస్తూ దేశంలోని ప్రాంతీయ, జాతీయ పార్టీలన్నీ ఇప్పటికీ మనుగడ సాగిస్తూ ఉండడం చూస్తే దేశంలో ఇంకా పేదరికం ఎంత బలంగా ఉందో సులభంగా అర్థం చేసుకోవచ్చు. అదేవిధంగా పాలనా సంస్కరణలకు పెద్దపీట వేయడం కూడాప్రాంతీయ పార్టీలు ఆయా రాష్ట్రాలలోని స్థానిక ప్రజల మన్ననలు పొందడానికి ఒక కారణంగా భావింపవచ్చు. వాస్తవంగా సంక్షేమ కార్యక్రమాలు, పాలనా సంస్కరణలకు బీజం వేయడమేకాదు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకూ ప్రాంతీయ పార్టీలు అత్యధిక ప్రాధాన్యమిస్తాయి. కానీ ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ప్రాంతీయ పార్టీలు ప్రజాస్వామ్య వ్యవస్థను ఎటు తీసుకు



పోతున్నాయో అంతు చిక్కడంలేదు. ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యంకాని అసాధారణ హామీలు ప్రజలకు ఇచ్చి అధికారంలోకి వచ్చేందుకు ప్రాంతీయ పార్టీలన్నీ ప్రయత్నిస్తున్నాయి. హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆదాయాన్ని, ఖర్చులనుఈప్రాంతీయ పార్టీలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అదేవిధంగా తాము ఇచ్చే హామీలు ప్రజలకు నిజంగా అవసరమా? లేదా? అని ఏమాత్రం పరిగణిలోకి తీసుకోవడంలేదు. ప్రాంతీయ పార్టీలు అధికారమే ప్రమావధిగా విచ్చలవిడిగా ప్రజలకు తాయిలాలు హామీలుగా ఇస్తూ ఉన్నాయి. అడ్డూఅదుపులేకుండా ఇచ్చిన హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు ప్రజలకు తాము ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు అష్ట కష్టాలు అనుభవిస్తూ అప్రజాస్వామిక పద్ధతులకు తెరదీస్తున్నాయి. ఆడంబరాలకు, ప్రచార ఆర్భాటాలకు, నిరూపయోగమైన హామీలకు విచ్చల విడిగా ఖర్చు చేస్తూ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మారుస్తున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు సకాలంలో చెల్లించలేకున్నాయి. ఆఖరికి ఉద్యోగులు పొదుపు చేసుకునే సిపియస్ మొత్తాన్ని కూడా ఇతర కార్యక్రమాలకు మళ్లించే స్థాయికి ప్రభుత్వాలు దిగజారిపోతున్నాయి. బడ్జెట్‌ను నిర్దిష్ట ప్రణాళికా బద్దంగా ఉపయోగించుకోకుండా అడ్డదిడ్డంగా ఉపయోగించుకుంటున్నాయి. పాత అప్పులతో ఎఫ్.ఆర్.బి.ఎం పరిమితిమించుతూ ఉండడంతో కొత్త అప్పులు పొందేందుకు ప్రభుత్వాలు అనేక అడ్డదారులు వెతుకుంటున్నాయి. కార్పొరేషన్ల ద్వారా అప్పులు చేయడమే కాకుండా రాష్ట్ర దీర్ఘకాలిక ఆదాయాన్ని, రాష్ట్ర ఆస్తులను ఇష్టానుసారం కుదువ పెడుతున్నాయి. ఈ పరిణామాలతో రాష్ట్రాలు కోలుకోలేని విధంగా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. సుదీర్ఘ కాలంగా ప్రాంతీయపార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలు సంక్షేమం, అభివృద్ధిపేరుతో అధిక మొత్తంలో అప్పులు చేసినా అక్కడి ప్రజల జీవితాలలో ఏమైనా మార్పులు వచ్చాయా అంటే అదీ జరగడంలేదు. ఆ రాష్ట్రాలలో పేదరికం, నిరుద్యోగం నామమాత్రంగానైనా తగ్గిన దాఖలాలు లేవు. అదేవిధంగా విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలకు ప్రజలు పడే కష్టాలుకూడా ఏమాత్రం తగ్గినట్లు కనిపించడంలేదు. గ్రామాలు కూడా ఏమాత్రం అభివృద్ధి లేకుండా నిర్మానుష్యంగానే ఉన్నాయి. దీని ప్రకారం ఈ ప్రభుత్వాలు చేసే సంక్షేమ కార్యక్రమాలు, నగదు బదిలీలు, ఉచితాలు కేవలం ప్రజలకు ఉపశమనం మాత్రమే కలిగిస్తాయని స్పష్టంగా తెలుస్తుంది. ఉచితంగా విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, వ్యవసాయ అవసరాలతో పాటూ పేదలకు గృహ సౌకర్యం కల్పించినప్పుడే కదా పేదరికం తగ్గి ప్రజల జీవితాలు, గ్రామాలు కళకళలాడేది. గతంలో సంక్షేమం పేరుతో ఉచితాలుపంచేందుకు జాతీయపార్టీలు పూర్తిగా వ్యతిరేకంగా ఉండేవి. కానీ ప్రాంతీయ పార్టీల ప్రాభవాన్ని తట్టుకుని రాష్ట్రాలలో పాగావేసేందుకు ప్రాంతీయ పార్టీలను మించి కాంగ్రెస్, బిజెపి లాంటి జాతీయపార్టీలు కూడా ఉచితహామీలు ఇస్తూఉండడం గమనార్హం. ఇటీవల కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలలో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బిజెపి జాతీయ నాయకత్వం పోటీలు పడీ ఉచిత హామీలు ఇచ్చిన వైనం ఇంకా ప్రజలకు కళ్ళలో మెదులుతూనే ఉంది. రాష్ట్ర, జాతీయ రాజకీయాలలో పరిపాలనలో సుదీర్ఘ అనుభవం కలిగి విజనరీ నాయకులుగా పేరు తెచ్చుకున్న కొంత మంది నాయకులు మొదట్లో ఉచితాలపై అయిష్టంగా ఉండేవారు. కానీ ఇటీవలి కాలంలో వారు కూడా పోటీలు పడీమరీ అలివికాని ఉచిత హామీలు స్వయంగా ఇస్తూఉండడం ఆశ్చర్యకరం. గతంలోప్రజాస్వామ్య వ్యవస్థకు పునాదులుగా ప్రాంతీయ పార్టీలు వ్యవహరించేవి. కేంద్రంలో అధికారంలో ఉన్నజాతీయ పార్టీలు అమలు చేసే అప్రజా స్వామిక పద్ధతులపై గతంలో ప్రాంతీయ పార్టీలు అలుపెరుగని పోరాటం చేసేవి. కానీ ఇటీవలి కాలంలో ప్రాంతీయ పార్టీలే అప్రజాస్వామిక పద్ధతులలో పెద్దఎత్తున పార్టీ పిరాయింపులకు ఎర్ర తివాచీ పరుస్తూ ఉన్నాయి. దీంతో ప్రాంతీయ పార్టీలు కేంద్రప్రభుత్వాలని నిలదీసే అవకాశాన్ని కోల్పోతూవున్నాయి. అదేవిధంగా గతంలో ప్రజలకు సేవ చేయాలని సదుద్దేశ్యంతోనే నూరు శాతం రాజకీయాలలోకి వచ్చేవారు. ప్రాంతీయ పార్టీలు స్వీయ నియంత్రణతో ప్రజల ధనానికి ట్రస్టీలుగా భావించి ప్రజాధనం వృధాచేయకుండా, ప్రజా ప్రయోజనాల కొరకు చిత్తశుద్ధితోపాటు పడినప్పుడే ప్రజలకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాష్ట్రాలకు, దేశానికి నిజంగా మంచి చేకూరుతుంది. ●

# భారత్ ఒక గొప్ప ప్రజాస్వామ్యదేశం

## నోబెల్ గ్రహీత మరియా కొరినా మచాడో ప్రశంసలు



**కారకాస్, అక్టోబరు 25:** నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, వెనిజులా ప్రజాస్వామ్య ఉద్యమకారిణి మరియా కొరినా మచాడో భారత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. భారత్ ఒక 'గొప్ప ప్రజాస్వామ్యం' అని, ప్రపంచంలోని అనేక దేశాలకు 'ఒక ఉదాహరణ' అని కొనియాడారు. వెనిజులాలో ప్రజాస్వామ్యం పునరుద్ధరింపబడిన తర్వాత భారత్‌తో అన్ని రంగాల్లో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని, భారత్ తమకు గొప్ప మిత్రదేశం కాగలదని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడాలని ఆశిస్తున్నానని, స్వేచ్ఛాయుత వెనిజులాలో ఆయనకు ఆతిథ్యం ఇవ్వాలనుకుంటున్నానని తెలిపారు. గత 15 నెలలుగా అజ్ఞాతంలో ఉన్న ఆమె మీడియా ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ ఎన్నో దేశాలకు, తరాలకు ఆదర్శంగా నిలిచింది. ఇది చాలా గొప్ప విషయం. ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడూ తేలికగా తీసుకోకూడదు, దానిని నిరంతరం బలోపేతం చేసుకోవాలి. ప్రపంచంలోని ఎన్నో దేశాలు మీ వైపు చూస్తున్నాయని ఆమె అన్నారు. తాను భారత్‌ను మనస్ఫూర్తిగా ఆరాధిస్తానని, తన కుమార్తె కొన్ని నెలల క్రితమే భారత్‌ను సందర్శించిందని, అక్కడి సంస్కృతిని ఎంతో ఇష్టపడిందని ఆమె చెప్పారు. మహాత్ముడి అహింసాయుత పోరాటం తనకు స్ఫూర్తి నిచ్చిందని, శాంతియుతంగా ఉండటం బలహీనత కాదని గాంధీ ప్రపంచానికి చాటిచెప్పారని ఆమె పేర్కొన్నారు. వెనిజులాలో నెలకొన్న రాజకీయ సంక్షోభం గురించి మాట్లాడుతూ, 2024 జులై 28న జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో తమ కూటమి ఘన విజయం సాధించినప్పటికీ, నికోలస్ మదురో ప్రభుత్వం ఫలితాలను తారుమారు చేసిందని ఆమె ఆరోపించారు. విపక్షాల అభ్యర్థిగా ప్రైమరీ ఎన్నికల్లో నేను 93 శాతం ఓట్లతో గెలిచాను. కానీ, నియంతృత్వ ప్రభుత్వం నన్ను పోటీ చేయనీయకుండా నిషేధం విధించింది. దాంతో, ఓ దౌత్యవేత్త మా తరఫున నిలబడ్డారు. మేము 70 శాతం ఓట్లతో గెలిచాం. దీనికి సంబంధించిన 85 శాతం ఓటింగ్ పత్రాలను డిజిటలైజ్ చేసి ఆధారాలుగా సేకరించాం. మేం గెలిచిన తర్వాత చర్చల ద్వారా అధికార మార్పిడికి మదురోకు అవకాశం ఇచ్చినా ఆయన నిరాకరించారు. ఆ తర్వాత దేశ చరిత్రలోనే అత్యంత దారుణమైన అణచివేతకు పాల్పడ్డారు. వేలాది మంది అమాయకులు అదృశ్యమయ్యారు. మహిళలు, చిన్నారులపై చిత్రహింసలకు పాల్పడ్డారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వెనిజులాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణ పోరాటంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తమకు ప్రధాన మిత్రుడని మచాడో అభివర్ణించారు. అమెరికా, లాటిన్ అమెరికా, యూరప్ దేశాల మద్దతుతో ఏర్పడుతున్న అంతర్జాతీయ కూటమితో మదురో పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఆమె అన్నారు. వెనిజులాలో నేరపూరిత సోషలిస్టు పాలన అంతమైన తర్వాత ఇంధనం, మౌలిక వసతులు, టెలికం వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు భారత కంపెనీలకు గొప్ప అవకాశాలు ఉంటాయని ఆమె అభిప్రాయపడ్డారు.

# బురఖా వేసుకుని మాముందునుంచే తప్పించుకున్నాడు

## బిన్‌లాడెన్‌పై అమెరికా సిఐఎ అధికారి సంచలన వ్యాఖ్యలు

**వాషింగ్టన్, అక్టోబరు 25:** అమెరికాను వణికించిన అల్ ఖైదా చీఫ్ బిన్ లాడెన్ గురించి సీఐఏ మాజీ అధికారి జాన్ కిరియాకో ఒక సంచలన సంఘటన తెలిపారు. 2001 సెప్టెంబర్ 11న అల్ ఖైదా టెర్రరిస్టులు విమానాలను హైజాక్ చేసి అమెరికాలోని ట్విన్ టవర్స్ ను కూల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ దాడి తర్వాత అమెరికా బలగాలు అల్ ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్ కోసం వేట మొదలు పెట్టాయి. అమెరికా బలగాలను ముఖ్యంగా సీఐఏను ముప్పుతిప్పలు పెట్టిన లాడెన్ చివరకు 2011 మే 2న పాకిస్థాన్ లోని అబోట్టాబాద్ లో హతమయ్యాడు. ట్విన్ టవర్స్ ను కూల్చివేసిన పదేళ్ల తర్వాత లాడెన్ ను అమెరికా బలగాలు తుదముట్టించాయి. అయితే,లాడెన్ అంతకుముందే తమకు పట్టుబడేవాడని, త్రుటిలో తప్పించుకున్నాడని జాన్ కిరియాకో చెప్పారు. 2001 సెప్టెంబర్ 11న ట్విన్ టవర్స్ కూల్చివేత తర్వాతి నెలలో అంటే అక్టోబర్ లోనే ఆఫ్ఘనిస్థాన్ లోని టోరాబోరా కొండల్లో అల్ ఖైదా స్థావరాన్ని సీఐఏ బలగాలు చుట్టుముట్టాయని వివరించారు. ఆ సమయంలో



బిన్ లాడెన్ కూడా అక్కడే ఉన్నాడని చెప్పారు. లాడెన్ కదలికలపై పక్కాగా నిఘా పెట్టి టోరాబోరా కొండల్లో అతడిని పట్టుకోవడమో లేక హతమార్చడమో చేసేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లామని వివరించారు.

అల్‌ఖైదా కూడా తమకు కౌంటర్‌గా కుయుక్తులు పన్నిందని, అందులో మొదటగా తమ సానుభూతిపరుడిని మా వద్దకు పంపించిందని జాన్ కిరియాకో చెప్పారు. ఆఫ్ఘనిస్థాన్ లో లాడెన్ కోసం వేటాడుతున్న క్రమంలో తమకు స్థానిక భాషలు తెలిసిన అనువాదకుడి అవసరం ఏర్పడిందన్నారు. ఇందుకోసం తాము నియమించుకున్న స్థానికుడు అల్ ఖైదా సానుభూతిపరుడేనని తర్వాత తెలిసిందన్నారు. టోరాబోరా కొండలను చుట్టుముట్టిన తర్వాత టెర్రరిస్టుల నుంచి తమకు ఓ ప్రతిపాదన వచ్చిందన్నారు. తమ వద్దనున్న మహిళలు, పిల్లలను క్షేమంగా బయటకు పంపించాక తాము లొంగిపోతామని టెర్రరిస్టులు చెప్పారని, ఇందుకోసం సాయంత్రం దాకా వేచి ఉండాలని ప్రతిపాదించారని వివరించారు. తమకు అనువాదకుడిగా పనిచేసిన వ్యక్తి ఈ ప్రతిపాదనకు అధికారులను ఒప్పించాడన్నారు. తీరా సాయంత్రం మసక చీకట్లలో మహిళలతోపాటు బిన్ లాడెన్ కూడా ఓ బురఖా ధరించి తమ పక్క నుంచే వెళ్లిపోయాడని జాన్ కిరియాకో వివరించారు. నాడు అల్ ఖైదా టెర్రరిస్టుల ప్రతిపాదనకు ఒప్పుకోకుంటే లాడెన్ ను 2001లోనే తుదముట్టించే వాళ్లమని కిరియాకో తెలిపారు.



### ఎంట్రీ, ఎగ్జిట్‌లో ఫొటోలు

# అమెరికాలో మరో కొత్త రూల్

**న్యూఢిల్లీ, అక్టోబరు 25:** వలసల నియంత్రణ దిశగా ట్రంప్ యంత్రాంగం మరో నిర్ణయం తీసుకుంది. అమెరికాయేతర పౌరులు దేశం వీడే లేక దేశంలోకి అడుగుపెట్టే సమయంలో అధికారులు వారి ఫొటోలు తీయనున్నారు. గ్రీన్‌కార్డుదారుల తో పాటు వలసదారులందరికీ ఈ కొత్త నిబంధన వర్తించనుంది. ఫెడరల్ రిజిస్టర్‌లో తాజాగా ఈ నిబంధనలను ప్రచురించారు. వాటి ఆధారంగా ఏ మార్గంలో అయినా దేశాన్ని వీడే, దేశంలోకి అడుగుపెట్టే వారి ఫొటోలు, డేటా సేకరణను యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ పెంచనుంది. ఫేక్ ట్రావెల్ పేపర్లను గుర్తించేందుకు, జాతీయ భద్రతను బలోపేతం చేసేందుకు డిసెంబర్ 26 నుంచి ఈ నిబంధనలను అమలు చేయనుంది. వివిధ మార్గాల్లో ఇమ్మిగ్రేషన్ చట్టాల నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించేవారిని, వీసా గడువు ముగిసిన తర్వాత కూడా దేశంలోనే ఉంటున్నవారిని గుర్తించేందుకు వీలవుతుందని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇక, 2021 లోనే ఈ కొత్త నియంత్రణలు ప్రతిపాదించగా ఇప్పుడు పూర్తిస్థాయిలో సాంకేతికత ఉపయోగించి అక్రమవలసదారులకు చెక్ పెట్టనున్నారు. కాగా మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటూ జాతీయవాదాన్ని బలంగా వినిపిస్తోన్న ట్రంప్ హెచ్ 1 బి వీసాలకు సంబంధించి నిబంధనలు విధించారు. వాటి వార్షిక రుసుమును ఒకేసారి లక్ష డాలర్లకు పెంచేసి సంచలనం సృష్టించారు. అనంతరం పలు సవరణలు చేశారు. ఈ వీసా వ్యవస్థనుసరిదిద్దడానికి, అమెరికన్లకు ప్రాధాన్యం ఇవ్వడానికి అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ లక్ష డాలర్ల ఫీజు నిర్ణయంతీసుకున్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లివిట్ వెల్లడించిన సంగతి తెలిసిందే.

# రాజస్థాన్‌లో భారీగా బంగారం నిక్షేపాలు



**జైపూర్, అక్టోబరు 25:** దేశంలో అత్యధిక ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల్లో ఒకటైన రాజస్థాన్, ఇప్పుడు బంగారు నిల్వలపరంగా ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తోంది. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతమైన బన్స్‌వారా జిల్లాలో భారీగా బంగారు నిక్షేపాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఆవిష్కరణతో బన్స్‌వారా దేశానికి కొత్త స్వర్ణ రాజధానిగా మారే అవకాశం ఉంది. జిల్లాలోని ఘటోల్ తెహసీల్ పరిధిలోని కంకారియా గ్రామంలో ఈ నిల్వలను గుర్తించారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న భుకియా, జగ్‌పురా గనుల తర్వాత ఇది మూడో అతిపెద్ద బంగారు గనిగా నిలవనుంది. భూగర్భ శాస్త్రవేత్తలు జరిపిన సర్వేల ప్రకారం, కంకారియా ప్రాంతంలో దాదాపు 3 కిలోమీటర్ల మేర బంగారు ఖనిజం విస్తరించి ఉన్నట్లు బలమైన ఆధారాలు లభించాయి. ఈ ప్రాంతంలో మొత్తం 940.26 హెక్టార్ల విస్తీర్ణంలో 113.52 మిలియన్ టన్నుల బంగారు ఖనిజం ఉండవచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఈ ఖనిజాన్ని శుద్ధి చేసిన తర్వాత సుమారు 222.39 టన్నుల స్వచ్ఛమైన బంగారం లభించవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాజస్థాన్‌లో ఇప్పటివరకు వెలుగు చూసిన అతిపెద్ద బంగారు నిల్వల్లో ఇది కూడా ఒకటి కావడం గమనార్హం. కంకారియాగారా ప్రాంతంలో బంగారంతో పాటు రాగి, నికెల్, కోబాల్ట్ వంటి ఇతర విలువైన ఖనిజాలు కూడా లభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అన్ని అనుమతులు లభించి, మైనింగ్ కార్యకలాపాలు ప్రారంభమైతే, భారతదేశంలో బంగారం తవ్వకాలు జరిపే అతికొద్ది రాష్ట్రాల జాబితాలో రాజస్థాన్ కూడా చేరుతుంది. భవిష్యత్తులో దేశం మొత్తం బంగారం డిమాండ్‌లో 25 శాతం వరకు ఒక్క బన్స్‌వారా జిల్లా నుంచే సరఫరా చేసే సామర్థ్యం ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా, గతంలో భుకియా జగ్‌పురా మైనింగ్ బ్లాక్‌ల కోసం ప్రభుత్వం నిర్వహించిన వేలంలో గెలిచిన సంస్థ.. అవసరమైన హామీ మొత్తాన్ని జమ చేయడంలో విఫలమైంది. దీంతో ప్రభుత్వం ఆ లైసెన్స్‌ను రద్దు చేసింది. ప్రస్తుతం ఈ బ్లాక్‌ల కోసం మళ్లీ టెండర్ల ప్రక్రియ పూర్తి కాగా, నవంబర్ 3న బిడ్లను తెరవనున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యధిక రెవెన్యూ వాటాను చెల్లించే సంస్థకు మైనింగ్ లైసెన్సును కేటాయించనున్నారు.



# విశ్వాసం కోల్పోతున్న యుఎన్



## విదేశాంగమంత్రి జైశంకర్

**న్యూఢిల్లీ, అక్టోబరు25:** ఐక్యరాజ్యసమితి పని తీరును విదేశాంగ మంత్రి జైశంకం తప్పుపట్టారు. యునైటెడ్ నేషన్స్‌పై తీవ్ర విమర్శలు చేసిన ఆయన ఆ సంస్థ గ్రిడ్‌లాక్ అయ్యిందన్నారు. ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రాతినిధ్యం మరిచిపోయిందన్నారు. ఉగ్రవాదం, ప్రపంచ ప్రగతిపై నిర్ణయాలు తీసుకోవడం విఫలమైన ఆ సంస్థ తన విశ్వాసాన్ని కోల్పోయినట్లు పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితిలో బలమైన దేశంగా భారత్ ఉందన్నారు. కానీ ఆ ప్రపచ సంస్థ ప్రస్తుతం సంక్షోభంలో ఉందన్నారు. చట్టబద్ధమైన, ప్రభావంతమైన పనితీరును వ్యవహరించడం లేదని విమర్శించారు. ఐక్యరాజ్యసమితిలో అంతా సవ్యంగా లేదన్న విషయాన్ని గ్రహించాలని జైశంకర్ తెలిపారు. ఆ సంస్థ తీసుకుంటున్న నిర్ణయాలు.. సభ్య దేశాలకు నిదర్శనంగా లేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యలను కూడా ఆ సంస్థ పరిష్కరించడం లేదన్నారు. యూఎన్‌లో జరుగుతున్న చర్చలన్నీ ఏకపక్షంగా సాగుతున్నాయని, ఆ సంస్థ పని విధానం గ్రిడ్‌లాక్ అయ్యిందన్నారు. ఐక్యరాజ్యసమితిలో సంస్కరణలను నిలిపివేశారని, దానికి తోడు ఇప్పుడు ఆర్థిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. యూఎన్ భద్రతా మండలిలో మార్పులు చేయాలని, భారత్‌తోపాటు జపాన్, జర్మనీ, బ్రెజిల్ దేశాలకు పర్మనెంట్ సభ్యత్వాన్ని ఇవ్వాలని జైశంకర్ గుర్తు చేశారు. ఉగ్రవాదసంస్థలపైనా కానీ, ఆ దేశాలకు అండగా ఉన్న దేశాలపై చర్యలు తీసుకోవడంలో యూఎన్ విఫలమైందన్నారు. పెహల్గామ్‌లో ఉగ్రదాడికి పాల్పడిన పాకిస్థాన్‌పై ఆంక్షలు విధించకుండా చైనా అడ్డుకుంటోందని ఆరోపించారు.

# లాలూ, రబ్రీ సర్కారు వస్తే మళ్లీ ఆటవిక పాలనే

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ధ్వజం



**పాట్నా, అక్టోబరు 25:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ బిజెపి నాయకుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తన మాటల జోరు పెంచారు. శనివారం ఖగారియాలో ఎన్నికల ప్రచార సభలో మాట్లాడిన షా.. ప్రతిపక్ష కూటమిపై దుమ్మెత్తిపోశారు. ప్రతిపక్ష మహాఘట్‌బంధన్‌కు ఓటేస్తే ఆటవిక పాలనను కొనితెచ్చుకున్నట్లేనని ఓటర్లను హెచ్చరించారు. ఎన్డీయె సర్కారు బిజెపిని అభివృద్ధిపథంలో నడిపించిందని అమిత్‌షా అన్నారు. మళ్లీ అధికార కూటమినే గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ఆటవిక పాలన కావాలో, అభివృద్ధి పాలన కావాలో మీరే తేల్చుకోవాలని అన్నారు. లాలూ, రబ్రీదేవీల సర్కారు వచ్చిందంటే.. దాంతోపాటు జంగిల్‌రాజ్ కూడా వస్తుందని వ్యాఖ్యానించారు. ఎన్డీయెను గెలిపిస్తే అభివృద్ధి చెందిన బీహార్‌ను చూస్తారని చెప్పారు. ఎన్డీయే కూటమి ఐదుగురు పాండవులతో కూడిన కూటమి అని, ఈ కూటమిని గెలిపిస్తే రాష్ట్రంలో అన్నీ విజయాలేనని షా అన్నారు. ఈ మహాఘట్‌బంధన్, లఠ్‌బంధన్‌లు రికార్డు స్థాయిలో అవినీతికి పాల్పడ్డాయని షా ఆరోపించారు. 'వాళ్లు బీహార్‌ను అభివృద్ధి చేస్తారా?' అని ప్రశ్నించారు. నయాపైసా కూడా అవినీతికి పాల్పడని నరేంద్రమోడీ, నితీశ్‌కుమార్‌లతో బీహార్ అభివృద్ధి సాధ్యమని చెప్పారు.

# పురుషుడిపై మేల్‌నర్స్ లైంగికదాడి: యేడాదిజైలు, రెండు కొరడా దెబ్బల శిక్ష

**సింగపూర్‌సిటీ, అక్టోబరు 25:** సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో స్టాఫ్‌మేల్ నర్సుగా పనిచేస్తున్న భారతీయుడు దారుణానికి పాల్పడ్డాడు. పురుషుడిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అతడిని దోషిగా తేల్చిన స్థానిక కోర్టు ఒక సంవత్సరం రెండు నెలల జైలు శిక్షతో పాటు రెండు కొరడా దెబ్బలశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలు వరించింది. 34 ఏళ్ల ఏలిపె శివ నాగు సింగపూర్‌లోని రాఫెల్స్ ఆసుపత్రిలో మేల్ నర్సుగా పనిచేస్తున్నాడు. ఈఏడాది జూన్ 18న ఆసుపత్రిలో చేరిన తన తాతను చూసేందుకు వచ్చిన ఓవ్యక్తిపై అతడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పేషెంట్ టాయిలెట్‌ను ఉపయోగిస్తుండగా శివనాగు గమనించాడు. ఆ తర్వాత, డిస్‌ఇన్‌ఫెక్ట్ చేస్తాననే నెపంతో బాధితుడి వద్దకు వెళ్లి, చేతికి సబ్బు రాసుకుని అతడిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని డిప్యూటీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యూజీన్ ఫువా కోర్టుకు తెలిపారు.

# సంక్షిప్తంగా..

## ఆర్జేడిలోకి మళ్లీ రావడం కంటే చావే మంచిది: తేజ్ ప్రతాప్



**పాట్నా, అక్టోబరు 25:** బీహార్ మాజీ మంత్రి, ఆర్జేడి చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ పెద్ద కుమా రుడు తేజ్ ప్రతాప్‌యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆర్జేడిలోకి తిరిగి రావడం కంటే మర ణాన్నే ఎంచుకుంటానని అన్నారు. పార్టీతో కుటుంబం నుంచి బహిష్కరణకు గురైన తేజ్ ప్రతాప్‌యాదవ్ జనశక్తి జనతాదళ్ పార్టీని స్థాపించారు. 2015లో తొలిసారి అసెంబ్లీ ఎన్ని కల్లో గెలిచిన మహువా స్థానం నుంచి ఆయన పోటీ చేస్తున్నారు.కాగా, శుక్రవారం పిటిఐకి తేజ్ ప్రతాప్‌యాదవ్ ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆర్జేడికి తిరిగి వెళ్తారా? అన్న ప్రశ్నకు ఆయన సూటిగా సమాధానమిచ్చారు. 'ఆ పార్టీకి తిరిగి రావడం కంటే నేను మరణాన్ని ఎంచుకుంటా. అధికారం చేపట్టాలన్న ఆకలి నాకు లేదు. నైతిక సూత్రాలు, ఆత్మగౌరవం నాకు అత్యున్నతమైనవి' అని అన్నారు.

## యతీంద్ర అలా అనలేదు: సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు, అక్టోబరు 25:** కర్ణాటకలో ముఖ్య మంత్రి మార్పు అంశంపై కొద్ది కాలంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనయుడు, ఎమ్మెల్సీ యతీంద్ర ఇటీవల చేసిన వ్యాఖ్యలు సొంత పార్టీ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి. దీనిపై సిద్ధరామయ్య తొలిసారిస్పందించారు. యతీంద్ర వ్యాఖ్యలను వక్రీకరించారని తెలిపారు. 'అసలు ఏమి చెప్ప దలచుకున్నావని యతీంద్రను నేను అడిగాను. తన సిద్ధాంతాల గురించే చెప్పాలని అనుకు న్నట్టు యతీంద్ర తెలిపాడు. ఫలానా వ్యక్తి సిఎంకావాలని యతీంద్ర అనలేదు' అని సిద్ధరామయ్య వివరించారు. బెళగావి జిల్లాలో ఇటీవల జరిగిన ఒక కార్యక్రమంలో యతీంద్ర మాట్లాడుతూ తన తండ్రి రాజకీయకెరీర్ చివరి దశలో ఉందన్నారు. ఈ పరిస్థితిలో బలమైన, ప్రగతిశీల భావ జాలం ఉన్ననాయకుడు కావాలని, ఆయనకు సిద్ధరామయ్యమార్గదర్శకంగా ఉంటారని చెప్పారు. సతీష్ జార్కిహోళికి ఆలక్షణాలు ఉన్నాయని చెప్పారు.


## లైంగికదాడిని ప్రతిఘటించిన యువతి హత్య

**పుణె, అక్టోబరు 25:** పుణెలో 20 ఏళ్ల యువతిపై అత్యాచారానికి యత్నించి, ఆమె ప్రతిఘటించడంతో కిరాతకంగా హత్య చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. హవేలీ తాలుకాలోని ఉరులి కాంచన్‌కు చెందిన దినేశ్ సంజయ్ పటోలే(26) ఈ దారుణానికి పాల్పడినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కోరెగావ్ ముల్ గ్రామానికి చెందిన బాధితురాలు ఈ నెల 14న రాత్రి 7:30గంటల సమయంలో రోడ్డు పక్కన శవమై కనిపించింది. ఆమె తలపై గాయంఉండటంతో ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు ఉరులి కాంచన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. లోకల్ క్రైమ్‌బ్రాంచ్‌కు చెందిన ఇన్స్‌పెక్టర్ అవినాశ్ శిలింకర్, ఉరులి కాంచన్ పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్ సచిన్ వాంగ్డే నేతృత్వంలోని బృందాలు దర్యాప్తు చేపట్టాయి.

## జర్నలిస్టులను కత్తులతో పొడిచి చంపిన దుండగులు

**ప్రయాగరాజ్, అక్టోబరు 25:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో దారుణం చోటుచేసుకుంది. లక్ష్మీ నారాయణ్ సింగ్ అలియాస్ పప్పు సింగ్ (54) అనే జర్నలిస్టును దుండగులు అత్యంత కిరాతకంగా నరికి చంపారు. నగరంలోని ఓ హోటల్ సమీపంలో గురువారం ఈ ఘటన జరిగింది. మృతుడు హైకోర్టు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అశోక్ సింగ్‌కు మేనల్లుడు. పప్పు సింగ్‌పై కత్తులతో దాడిచేసిన నిందితులు ఆయన మెడ,పొట్ట,చేతులపై విచక్షణా రహితంగా పొడిచారు. ఆయన శరీరంపై 24కు పైగా లోతైన గాయాలయ్యాయి.తీవ్ర రక్తస్రావంతో కుప్పకూలిన ఆయన్ను వెంటనే స్వరూప్ రాణి నెహ్రూ ఆసుపత్రికితరలించారు.అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఇద్దరు బాలీవుడ్ నటులపై చీటింగ్‌కేసు



**లక్నో, అక్టోబరు 25:** ప్రముఖ బాలీవుడ్ నటులు శ్రేయస్ తల్పడే, అలోక్ నాథ్ చిక్కుల్లో పడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో ఒక భారీపెట్టుబడి మోసం కేసులో వీరిద్దరితోపాటు మరో 22 మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. లోని అర్బన్ మల్టీస్టేట్ క్రెడిట్‌అండ్ థ్రిఫ్ట్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో జరిగిన ఈ మోసంలో నటులు బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరించారు. భాగ్‌పత్‌కు చెందిన బబ్లీ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సొసైటీ ఏజెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించి, తాము సేకరించే డిపాజిట్లపై భారీ లాభాలు వస్తాయని, ప్రజలను నమ్మించారు. శ్రేయస్‌తల్పడే, అలోక్‌నాథ్‌వంటి ప్రముఖ నటులు ఈసంస్థకు ప్రచారం చేస్తుండటంతో చాలామంది వీరిమాటలు నమ్మి లక్షల్లో పెట్టుబడులుపెట్టారు. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో సుమారు 500మంది నుంచి రూ.5కోట్లకు పైగా వసూలుచేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

# వైద్యురాలి ఆత్మహత్యలో హౌస్ ఓనర్ కుమారుడు అరెస్టు

**సతారా, అక్టోబరు 25:** మహారాష్ట్రలోని సతారాలో వైద్యురాలి ఆత్మహత్య కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడైన ప్రశాంత్ బంకర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. డాక్టర్ అద్దెకు ఉంటున్న ఇంటి యజమాని కుమారుడే ఈ ప్రశాంత్ బంకర్. అరెస్ట్ అనంతరం అతడిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు, అత్యాచారం ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (పీఎస్ఐ) గోపాల్ బదానే పరారీలో ఉన్నాడు. బీడ్ జిల్లాకు చెందిన డాక్టర్ సంపద ముండే (28), ఫల్టాన్‌లోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. గురువారంరాత్రి ఆమె ఓ హోటల్ గదిలో విగతజీవిగా కనిపించారు. ఘటనాస్థలంలో లభించిన సూసైడ్ నోట్‌లో, పీఎస్ఐ గోపాల్ బదానే గత ఐదు నెలలుగా తనపై అనేక సార్లు అత్యాచారం చేశాడని ఆమె ఆరోపించారు. ఇంటి యజమాని కొడుకు ప్రశాంత్ బంకర్ తనను మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేశాడని ఆమె పేర్కొన్నారు. పోలీసులు ఆమె అరచేతిపై రాసి ఉన్న నోట్‌ను కూడా ఫోరెన్సిక్ విశ్లేషణకు పంపారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం పీఎస్ఐ గోపాల్‌తో కుమ్మక్కై ప్రశాంత్ బంకర్ డాక్టర్‌ను మానసికంగా వేధించాడు. అద్దె గదిని ఖాళీ చేయాలంటూ పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు. డాక్టర్ ఆరోపణలు చేసిన పోలీసు అధికారులతో ప్రశాంత్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని దర్యాప్తులో తేలింది. ఈ ఘటనపై పోలీసులు అత్యాచారం, ఆత్మహత్యకు ప్రేరేపించడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. తప్పుడు పోస్ట్‌మార్టం నివేదికలు తయారు చేయాలని ఆమెపై రాజకీయ, పోలీసు ఒత్తిళ్లు వచ్చాయని వారు ఆరోపించారు. ఈ విషయంపై ఆమె డీసీపీకి ఫిర్యాదు చేస్తూ లేఖ రాసినా ఎవరూ పట్టించుకోలేదు. ఆమెకు న్యాయం జరగాలని ఆమె బంధువు ఒకరు తెలిపారు. ప్రస్తుతం ప్రశాంత్‌బంకర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న పీఎస్ఐ గోపాల్ బడానే కోసం ప్రత్యేకబృందాలతో గాలింపు ముమ్మరం చేశారు.

# మాతోకూర్చుని భోజనం చేసినవారే ద్రోహం చేసారు

## నాలుగోసీటు బిజెపి గెలుపుపై సిఎం ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్, అక్టోబరు 25:** జమ్మూకశ్మీర్‌లో ఇటీవలే జరిగిన రాజ్యసభ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంతృప్తి, అసంతృప్తి రెండూ వ్యక్తం చేశారు. నాలుగు స్థానాల్లో మూడింటిని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) గెలుచుకోవడం సంతోషంగా ఉన్నప్పటికీ, మిత్రపక్షాల దగా కారణంగా ఒక సీటును బీజేపీకి కోల్పోయామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనగర్‌లో విలేకరులతో ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ నాలుగు సీట్లనూ గెలుచుకోవడానికి నేషనల్ కాన్ఫరెన్స్ అన్ని విధాలా ప్రయత్నించింది. కానీ, చిరకాలంగా మాతో కూటమిలో ఉన్న కొందరు మిత్రులు చివరి నిమిషంలో మాకు ద్రోహం చేశారని ఒమర్ అన్నారు. మాతో కూర్చుని, మాతో కలిసి భోజనం చేసిన వాళ్లే చివరికి బీజేపీ వైపు నిలబడటం దురదృష్టకరం. నేను వారి పేర్లు చెప్పదలుచుకోలేదు, ప్రజల ముందు వారే దోషులుగా నిలబడ్డారని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యంగా హంద్వారా ఎమ్మెల్యే సజ్జాద్ లోన్ ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడం బీజేపీ అవకాశాలకు స్పష్టంగా మేలు చేసిందని సీఎం పేర్కొన్నారు. ఆయన కొన్ని కారణాల వల్ల ఓటు వేయకూడదని నిర్ణయించుకున్నారు, కానీ ఆయన చర్య పరోక్షంగా బీజేపీకి లాభం చేకూర్చిందని ఒమర్ వివరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీ అభ్యర్థులకు మద్దతుగా నిలిచిన కాంగ్రెస్, స్వతంత్ర శాసనసభ్యులకు ఒమర్ అబ్దుల్లా కృతజ్ఞతలు తెలిపారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన ఒక్క ఓటు కూడా వృథా కానందుకు నేను సంతృప్తిగా ఉన్నానని ఆయన అన్నారు. తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ, ఇతర పార్టీల సభ్యులతో సహా అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్‌సీ నుంచి కొత్తగా ఎన్నికైన రాజ్యసభ సభ్యులు పార్లమెంటులో కీలక ప్రజా సమస్యలను లేవనెత్తుతారని ఆయన తెలిపారు. జమ్మూకశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను వారు పార్లమెంటులో బలంగా వినిపిస్తారు. అలాగే, ఈ ప్రాంత ప్రత్యేక హోదాకు సంబంధించి మా అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని ముందుకు తీసుకెళతారని ఒమర్ స్పష్టం చేశారు. మరోవైపు, వినూత్నమైన ఉద్యానవన కార్యక్రమాల ద్వారా కశ్మీర్ లోయలో పర్యాటక సీజన్‌ను పొడిగించినందుకు ఫ్లోరికల్చర్ విభాగాన్ని సీఎం ప్రశంసించారు. కశ్మీర్‌లో వేసవి తర్వాత పూలు పూయవనే అపోహ ఉండేది. తులిప్ గార్డెన్‌తో పర్యాటక సీజన్‌ను ముందుగా ప్రారంభించి, గుల్‌ఎదావూద్ గార్డెన్‌తో పొడిగించడం ద్వారా పర్యాటకాన్ని గణనీయంగా పెంచవచ్చని మేము గ్రహించామని చెబుతూ, ఇందుకు కృషి చేసిన తోటమాలి, అధికారులందరినీ ఆయన అభినందించారు.

# బాలీవుడ్ సింగర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదు



**ముంబయి, అక్టోబరు 25:** ప్రముఖ బాలీవుడ్ గాయకుడు, సంగీత దర్శకుడు సచిన్ సంఘ్వీపై లైంగిక దాడి కేసు నమోదైంది. ఓ గాయని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముంబైలోని విలే పార్లే పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, కెరీర్‌లో సాయం చేస్తానని చెప్పి తనను శారీరకంగా, మానసికంగా వేధించాడని బాధితురాలు తన ఫిర్యాదులో ఆరోపించారు. బాధితురాలు, సచిన్ సంఘ్వీకి గతేడాది సోషల్ మీడియా ద్వారా పరిచయం ఏర్పడింది. 2024 ఫిబ్రవరి నుంచి 2025 జూలై వరకు తామిద్దరూ రిలేషన్‌షిప్‌లో ఉన్నామని, ఆ సమయంలో తనను తీవ్రంగా వేధించాడని ఆమె పేర్కొన్నారు. పెళ్లి ప్రస్తావన తెచ్చిన తర్వాత సచిన్ తనను దూరం పెట్టడం మొదలుపెట్టాడని, తమ సంబంధం గురించి బయటకు చెబితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని బెదిరించాడని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, బలవంతంగా తనకు అబార్షన్ చేయించాడని కూడా ఫిర్యాదులో తెలిపారు. గత కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తిడికి గురవడంతో పాటు, కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న ఒత్తిడి కారణంగా ఈ ఏడాది ఆగస్టులో పోలీసులను ఆశ్రయించినట్లు బాధితురాలు వెల్లడించారు. ఈ ఆరోపణలపై సచిన్ సంఘ్వీ తరఫు న్యాయవాది ఆదిత్య మిథే స్పందించారు. నా క్లయింట్‌పై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి. ఈ కేసులో ఎలాంటి పస లేదు. సచిన్‌ను చట్టవిరుద్ధంగా నిర్బంధించి, ఆ తర్వాత బెయిల్‌పై విడుదల చేశారు. అన్ని ఆరోపణలను మేము కోర్టులో తిప్పికొడతామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, బాధితురాలి తరఫు న్యాయవాది మాట్లాడుతూ, మా క్లయింట్‌కు న్యాయవ్యవస్థపై పూర్తి నమ్మకం ఉంది. నిందితుడు ఎంతటి పలుకుబడి ఉన్న వ్యక్తి అయినా చట్టం తన పని తాను చేసుకుపోతుంది. న్యాయం జరిగేంత వరకు పోరాడతామని తెలిపారు. ఈ కేసు విచారణలో ఉన్నందున మరిన్ని వివరాలు వెల్లడించలేమని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# నిబంధనలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

## ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిచూరి రాజేంద్ర



మీడియా సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిచూరి రాజేంద్ర

**విజయవాడ,అక్టోబరు25,ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రైవేట్ ట్రావెల్స యాజమాన్యాలు నిబంధనలు పాటించకుండా ప్రజల జీవితాలతో ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయని వరుస ప్రమాద ఘటనలు జరుగుతున్న రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడిందని ఏదైనా ప్రమాదం జరిగినటువంటి సమయంలో ఒకటి రెండు రోజులు రవాణాశాఖ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేస్తూ ప్రైవేట్ ట్రావెల్స్ ఇచ్చేటటువంటి మామూళ్ల మత్తులో జోగుతున్నారని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి రాజేంద్ర బాబు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గండాల సంతోష్ కుమార్లు విమర్శించారు. విజయవాడ హనుమాన్ పేటలోని దాసరి నాగభూషణ్ రావ్ భవన్ లో శనివారం సాయంత్రం పత్రిక విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో జరిగిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) తీవ్ర విచారం వ్యక్తం చేస్తుందన్నారు. ఈ ఘటన అత్యంత బాధాకరమని పేర్కొంటూ, ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన ట్రావెల్స్ యాజమాన్యాలు మరియు నిరక్ష్యం చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "రాష్ట్రవ్యాప్తంగా అనుమతులు లేకుండా, ఫిట్నెస్ సర్టిఫికెట్‌లు లేని వాహనాలతో ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలపై ప్రభుత్వం ప్రత్యేక దళాలతో తనిఖీలు జరిపి, చట్టపరమైన చర్యలు తక్షణమే ప్రారంభించాలి" అన్నారు. అదేవిధంగా, ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు కనీసం ..50 లక్షల పరిహారం తక్షణమే ప్రకటించి అందజేయాలని ఏఐవైఎఫ్ డిమాండ్ చేస్తుందని అన్నారు. ప్రజల ప్రాణ భద్రతను కాపాడే బాధ్యత రవాణా శాఖ, పోలీసు శాఖలపై ఉందని, ఈ రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఈ ఘటనలో నిరక్ష్యం చేసిన అధికారులపై శాఖా చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ విషాదాన్ని తేలికగా తీసుకోకుండా, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా కఠినమైన రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు."ప్రైవేట్ ట్రావెల్స్ లాభాల కోసం ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నాయి. ప్రభుత్వం ఇకనైనా మేలుకొని కఠినమైన నిబంధనలు అమలు చేయాలి. ప్రజల ప్రాణ భద్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత" అని రాష్ట్రంలో నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్ బస్సులను నడుపుతున్నారని నిబంధనలకు విరుద్ధంగా 15 అడుగుల ఎత్తులో సీట్లను నిర్మించడం వల్ల ఇరుకుగా ఉండటం వలన ప్రమాద సమయాల్లో ప్రజలు అత్యవసరం మార్గాల ద్వారా బయటకొచ్చే పరిస్థితులు లేకపోవడం వలన ఎక్కువ ప్రమాదాలు



ఉమ్మడి కృష్ణా జిల్లా ఎన్డీఏ నేతల సమావేశ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

# కంప్యూటర్, ఎఐ, డేటాసెంటర్‌కు జగన్ రెడ్డికి తేడా తెలియదా?

## - ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రజాప్రతినిధుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి కృష్ణా జిల్లాను సంక్షేమ పథకాలు, అభివృద్ధికి కేంద్రంగా మారుస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా ఎన్డీఏ కూటమి పక్షాల నేతలు ఈ సమావేశంలో పలు అంశాలు చర్చించారు.కూటమి పక్షాల నాయకులంతా ఐక్యంగా ఉండాలని నిర్ణయించారు..తిరువూరు ఎంఎల్ఏ కొలికలపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ల వ్యవహారంపైన ఈ సమావేశంలో చర్చించారు.ఈ నేతల ఇరువురు విషయంలో అధిష్టానం నిర్ణయానికి అనుగుణంగా వ్యవహరించాలని తీర్మానించారు.ఈ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల కృష్ణా జిల్లాను సర్వ నాశనం చేసిన వైసీపీ నేతలు.. ఇప్పుడు కూడా కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా అంటే అభివృద్ధికి, కళలకు నెలవుగా ఉండేదని.. గత ఐదేళ్ల బూతులకు, అరాచకాలకు కేంద్రంగా వైసీపీ నేతలు మార్చారు. నియోజకవర్గాల వారీగా అభివృద్ధి ప్రణాళికలురూపొందించుకుని భవిష్యత్ కార్యాచరణపై చర్చించాం. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని రకాలైన అరాచకాలకు పాల్పడినా జిల్లా అభివృద్ధే కూటమి నాయకుల ప్రథమ లక్ష్యం అన్నారు. ప్రతి నెలా జిల్లాలోని ఎమ్మెల్యేలందరం సమావేశమై జిల్లాలో చేయాల్సిన అభివృద్ధి గురించి, సమస్యల గురించి చర్చించుకుని వాటిని ముఖ్యమంత్రి వద్దకు, ఉప ముఖ్యమంత్రి వద్దకు తీసుకెళ్లి పరిష్కరించుకుంటాం. కూటమి నాయకులంతా సమన్వయంతో ముందుకు వెళ్లడం వలనే 16 సీట్లు గెలుచుకున్నాం. అదే స్ఫూర్తితో జిల్లాను కూడా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తాం. రాష్ట్రంలో జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక జగన్ రెడ్డి రోజుకో రకంగా ప్రభుత్వంపై బురద జల్లుతున్నాడు. ఇష్టానుసారంగా మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. నిన్నటి వరకు గూగుల్ సంస్థపై విమర్శలు గుప్పించిన జగన్ రెడ్డి.. ఇప్పుడు తానే గూగుల్ తీసుకొచ్చానని కొత్త భాష్యం చెబుతున్నాడు. డేటా సెంటర్‌కు.. ఏఐకి.. కంప్యూటర్‌కు తేడా తెలియని సన్నాసి జగన్ రెడ్డి. డేటాకు మైండ్ అనుసంధానిస్తే అదే ఏఐ అనడం జగన్ రెడ్డి బుద్ధి రాహిత్యానికి నిదర్శనం. 2018లోనే ఏపీలో అదానీ డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకొస్తే.. తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి భూ కేటాయింపులు రద్దు చేసి తరిమేశాడు. అలాంటి జగన్ రెడ్డి.. ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్దదైన డేటా సెంటర్ ఏపీలో ఏర్పాటు చేయడం జీర్ణించుకోలేక రకరకాలుగా ప్రవర్తిస్తున్నాడు. సుమారు 13 దేశాలను అనుసంధానం చేస్తూ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తుంటే ఎందుకింత కడుపు మంట అని ప్రశ్నించారు. గత ఐదేళ్లు రాష్ట్ర సంపద కొల్లగొట్టి అభివృద్ధి లేకుండా చేసిన జగన్ రెడ్డి.. ప్రజలు చీత్కరించిన తర్వాత కూడా అదే అరాచకాన్ని నమ్ముకున్నాడు. మద్యాన్ని పూర్తిగా నిషేధించిన తర్వాతే మళ్లీ ఓట్లు అడుగుతానన్న జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే కల్తీ మద్యంతో వేలాది మంది ప్రాణాలు తీశాడు. అలాంటి కల్తీ జగన్ రెడ్డి.. ఇప్పుడు మద్యం కల్తీ గురించి మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాగానే కల్తీ బ్రాండ్లు తీసుకురావడం నిజం కాదా? కల్తీ వ్యాపారానికి అడ్డంకులు ఉండకూడదనే ఎక్సైజ్ వ్యవస్థను నాశనం చేయడం నిజం కాదా.? కూటమి అధికారంలోకి వచ్చాక మెరుగైన మద్యం పాలసీని తీసుకురావడంతో పాటుగా, ఎక్కడా తప్పులు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎన్ఫోర్స్ మెంట్ విభాగాన్ని పటిష్టం చేయడం వలనే మొలకలచెరువు, ఇబ్రహీంపట్నంలో కల్తీ దందాను పట్టుకున్నాం. కల్తీ మాట వినిపించకుండా చేయడం కోసమే ఏపీ ఎక్సైజ్ సురక్షా యాప్ తీసుకొచ్చాం. షాపు యజమానులతో పాటుగా, వినియోగదారులు కూడా స్కాన్ చేసి బాటిల్ వివరాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించాం. ఇప్పటి వరకు 1.50 లక్షల మంది యాప్ డౌన్ లోడ్ చేసుకోగా, 3.20 లక్షల బాటిళ్లు స్కాన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. ఎక్కడా ఒక్క ఫిర్యాదు కూడా నమోదవ్వలేదు.

బెల్టు షాపులపై కూడా కటినమైన చర్యలు తీసుకుంటున్నాం. బెల్టు నిర్వహిస్తే మద్యం షాపు లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. మద్యం కల్తీ గురించి గంటలు గంటలు ప్రెస్ మీట్ పెట్టే జగన్ రెడ్డి.. ఒక్కచోటైనా కల్తీని నిరూపించారా అని ప్రశ్నించారు.

# ముగిసిన నకిలీ మద్యం కేసు నిందితుల విచారణ

**విజయవాడ,అక్టోబరు 25,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ మద్యం కేసులో కీలక నిందితులుగా అనుమానిస్తున్న అద్దేపల్లి జనార్దన్, అతని సోదరులను జగన్మోహన్‌రావులను ఎక్సైజ్ పోలీసులు విచారించారు.

ఈ విచారణలో వైసీపీ నేత జోగి రమేష్ పేరు నిందితులు ప్రస్తావించినట్లు సమాచారం. జోగి రమేష్ ప్రోద్బలంతోనే నకిలీ మద్యం తయారు చేసినట్లు వాంగ్మూలమిచ్చినట్లు సమాచారం అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక నకిలీ మద్యం తయారీ నిలిపివేశామని వారు చెప్పారంటున్నారు.

జనార్దన్ జోగి రమేష్‌తో పాటు ఇతర పాత్రదారులపై ఎక్సైజ్ శాఖ పోలీసుల ఆరా తీసారంటున్నారు.

కూటమి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నంలో భాగంగా కుట్ర ఆర్థిక లావాదేవీలపై ప్రశ్నల వర్షం కురిపించిన పోలీసులు జగన్మోహన్‌రావును విజయవాడ జైలుకు పోలీసులు తరలించారు.

# సత్యసాయి శతజయంతి సందర్బంగా చెన్నై, గుంతకల్లు మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 25, ప్రభాత వార్త:** ఉమ్మడి అనంతపురం జిల్లా, పుట్టపర్తిలో వెలసిన భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా యాత్రికుల సౌకర్యార్థం రైల్వేశాఖ చెన్నై గుంతకల్లు చెన్నైల మధ్య బై వీక్లీ ఎక్స్ ప్రెస్ రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పుట్టపర్తిలో నవంబర్ 23న జరిగే సత్యసాయి శతజయంతి ఉత్సవాలు జరుగనున్నాయి. ఈనేపథ్యంలో యాత్రికుల సౌకర్యార్థం రైల్వేశాఖ చెన్నై నుంచి గుంతకల్లుకు వెళ్ళే నెంబర్ 06091 ప్రత్యేక ఎక్స ప్రెస్ నవంబర్ 19,21 తేదీల్లో బుధ,శుక్రవారాల్లో చెన్నై సెంట్రల్ నుంచి రాత్రి 11:50 గంటలకు బయలుదేరి గురు, శనివారాల్లో మధ్యాహ్నం 02:15 గంటలకు గుంతకల్లుకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గుంతకల్లు నుంచి చెన్నై వెళ్లే నెంబర్ 06092 ప్రత్యేక ఎక్స్ నవంబర్ 20,22 తేదీల్లో గురు, శనివారాల్లో గుంతకల్లు నుంచి సాయంత్రం 05:30 గంటలకు బయలుదేరి,శుక్ర,ఆదివారాల్లో ఉదయం 09:45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది ఈరైళ్లు మార్గమధ్యంలో పెరంబూర్, తిరువళ్ళూరు, ఆర్కోణం,కాట్పాడి, జోలార్ పేట్, కుప్పం,బంగారుపేట్, వైట్ ఫీల్డ్, క్రిష్ణా రాజాపురం, యలహంక, హిందూపురం, సత్యసాయి ప్రశాంతి నిలయం (పుట్టపర్తి), ధర్మవరం, అనంతపురం, గుత్తి స్టేషన్లలో నిలుస్తాయి.



# పెన్నానది పొర్లు కట్టలు నిర్మాణాన్ని వేగవంతం చేయండి

## - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**ఇందుకూరుపేట (నెల్లూరు), అక్టోబర్ 25, ప్రభాతవార్త :** తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పెన్నా నది పుర్ల కట్టల పనులు వేగవంతం చేయాలని అధికారులు అందుబాటులో ఉంటూ తీర ప్రాంత లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. ఇందుకూరుపేట మండలంలోని నిడిముసలి గ్రామ వద్ద పెన్నా నది పొర్లుకట్ట పటిష్టతను శనివారం పరిశీలించారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా గ్రామస్తులతో కలిసి కాలినడకన పెన్నా పొర్లుకట్ట వద్దకు చేరుకున్నారు. 2021లో పొర్లు కట్టకు గండి పడి నిడుమునలి, కుడితిపాళెం, గంగపట్నం, రాముడుపాలెం, ముదివర్తి పాళెం గ్రామాల జల దిగ్బంధంలో చిక్కుకొని ప్రజలు అష్ట కష్టాలు పడ్డ సంఘటనలను స్థానికులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని పెన్నా కరకట్టల తాత్కాలిక మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసేలా జిల్లా అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు నాయుడుకి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రానున్న భారీ వర్షాలు, ఎగువనున్న సోమశిల నుంచి పెన్నా నదికి వచ్చే వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని పొర్లు కట్టలు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. తాత్కాలిక మరమ్మత్తులే కదా అని నాసిరకంగా పనులు చేస్తే సహించేది లేదన్నారు. వాతావరణ శాఖ తుఫాన్‌హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి వీలైనంత వరకు ఆస్తి, ప్రాణ నష్టాలు తగ్గించే ప్రయత్నం చేయాలని కోరారు.మత్స్యకార సోదరులు చేపల వేటకు తాత్కాలిక విరామం పాటించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సూచించారు. అధికారులు పరస్పర సమన్వయంతో ప్రజలను విపత్తు నుంచి రక్షణ కల్పించే చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాను షెల్టర్ల వద్ద జనరేటర్, తాగునీరు తదితర ముందస్తు ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లు వరద కోతకు గురయ్యే ప్రమాదముందని ట్రాక్టర్లు జేసీబీ లాంటి వాహనాలను అందుబాటులో ఉంచుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు.

# కాచిగూడ తిరుచానూర్ మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, అక్టోబర్ 25, ప్రభాత వార్త:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రయాణీకుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే కాచిగూడ తిరుచానూర్ కాచిగూడ మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. కాచిగూడ నుంచి తిరుచానూరు వెళ్ళే నెంబర్ 07797 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ నవంబర్ 06,13,20,27 తేదీల్లో గురువారాల్లో కాచిగూడ నుంచి రాత్రి 10:25 గంటలకు బయలుదేరి శుక్రవారం ఉదయం 10:30 గంటలకు తిరుచానూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో తిరుచానూరు నుంచి కాచిగూడ వెళ్ళే నెంబర్ 07788 ప్రత్యేక ఎక్స్ ప్రెస్ నవంబర్ 07,14,21,28 తేదీల్లో శుక్రవారాల్లో తిరుచానూరు నుంచి సాయంత్రం 04:40 గంటలకు బయలుదేరి కాచిగూడ కు శనివారం తెల్లవారుజామున 05:30 గంటలకు చేరుకుంటుంది. మార్గమధ్యంలో ఈ రైళ్లు ఉందానగర్,షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి,గద్వాల,కర్నూలు,డోన్, గుత్తి, తాడిపత్రి,ఎర్రగుంట్ల, ఒంటిమిట్ట, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో నిలుస్తాయి.

# దుర్గమ్మ ఆలయంలో నాగుల చవితి

**ఇంద్రకీలాద్రి, అక్టోబర్ 25, ప్రభాతవార్త** శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నాగుల చవితి పర్వదినాన్ని భక్తి శ్రద్దలతో జరిపారు. భక్తులు శ్రీ సుబ్రహ్మణేశ్వర స్వామివార్ల ఆలయంలో వున్న నాగుల పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా శ్రీ సుబ్రహ్మణ్య స్వామివారి ఆలయంవద్ద జరిగిన సహస్ర దీపాలంకరణలో ఇఒ, చైర్మన్, పాలకమండలి పాల్గొన్నారు.

**- వేదోక్తంగా కార్తీకమాస పూజలు:** దుర్గమ్మవారి ఆలయంలో శనివారం కార్తీకమాస పూజలు వేదోక్తంగా నిర్వహించారు. ఇఒ, చైర్మన్లు కార్యక్రమంలో పాల్గొనగా వేదపండితులు అర్చనలు చేశారు. కార్తీకమాస పూజల్లో భక్తులు పాల్గొనాలని ఇఒ చైర్మన్లు తెలిపారు. సహస్ర దీపకాంతులతో శ్రీ స్వామి అమ్మవారు భక్తులను ఊంజల్ సేవలందుకుని అనుగ్రహించారు.

**- వేదోక్తంగా సహస్ర లింగార్చన:** పవిత్ర కార్తీకమాసం సందర్భంగా సహస్ర లింగార్చన సేవలో పాల్గొనాలని భక్తులకు ఇఒ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు తెలిపారు. అర్చకస్వాములు వేదమంత్ర పఠనాలతో శ్రీ స్వామివారికి సేవలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. సాయంసంధ్యాకాలంలో శ్రీ స్వామి అమ్మవార్లు ఊంజల్‌పై భక్తుల సేవలందుకుని అనుగ్రహించారు. ఈ సందర్భంగా చతుర్వేద పఠనాలు పండితులు చేశారు.

**- నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి మండవ శంకర్, మాదవి దంపతులు, కుమార్డు షణ్ముఖ గోపీనాథ్ లు రు.1,00,116ల విరాళాన్ని శనివారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దుర్గమ్మవారి ప్రసాదం చిత్రపటం, శేషవస్త్రాలనందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

# కోనలో పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం



**రాపూరు (నెల్లూరు), అక్టోబర్ 25, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున 4.30కి స్వామి వారి మూల మూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వ హించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండప ంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్త్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో సినియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి నిర్వహించారు.

# మెంథా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి : కృష్ణా కలెక్టర్ బాలాజీ

**గన్నవరం(కృష్ణా), అక్టోబర్ 25, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాలో తీరం దాటే అవకాశం ఉన్న మెంతా తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు అన్ని ప్రభుత్వశాఖల అధికారులు సన్నద్ధం కావాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం జిల్లాకలెక్టరేట్ కార్యాలయంలో సంయుక్త కలెక్టర్ యం.నవీన్, సహాయకలెక్టర్ ఫర్హీన్ జాహిద్, డిఆర్ఓ చంద్రశేఖరరావు, అదనపు ఎస్పీలు వివి. నాయుడు, సత్యన్నారాయణలతో కలసి తుఫాను ముందస్తు సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ మెంతా తుఫాన్ కారణంగా ఈనెల 27వతేదీ నుండి మూడురోజులపాటు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతా వరణ శాఖ అధికారులు ప్రకటించినందున ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భారీవర్షాలతోపాటు పెనుగాలులు వీచే ప్రమాదం ఉన్నందున మరింత అప్రమత్తంగా ఉండా లన్నారు. రహదారులపై చెట్లుపడిపోతే వెంటనే తొలగించేలా అధికారులు సిబ్బంది సన్నద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంబాలు కూలి పోవటంతో పాటు వైర్లు తెగిపడే ప్రమాదం ఉందని వెంటనే విద్యుత్ లైన్‌లను సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్దరించాలని కోరారు. రవాణా వ్యవస్థ స్తంభించకుండా తగుచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాలువలు, చెరువుకట్టలు బలహీనంగా ఉన్న చోట్ల ఇసుకమూటలతో పటిష్టం చేయాలని, వరదముంపును తగ్గించేందుకు అన్ని చర్యలు తీసుకోవలని సూచించారు. వరదముంపు ప్రాంతాల్లో గజ ఈతగాళ్ళను, పడవలను, లైఫ్‌జాకెట్లను సిద్ధంగా ఉంచు కోవాలని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా వాటర్ ట్యాంకులు నింపాలని సూచించారు. వైద్యఆ రోగ్యశాఖ సిబ్బంది మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అవసర మైన చోట్ల సహాయ పునరావాస శిబిరాలు ఏర్పాటుచేసి వరదబ ాదితులకు ఆహారం అం దించాలని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది అందరూ అందుబాటులో ఉండాలని వాట్సప్‌ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాల న్నారు. మత్యకారులు వేటకు వెళ్లవద్దని, ఎవరైన వేటకు వెళ్ళి ఉంటే వెంటనే వెనక్కి వచ్చేయాలని కలెక్టర్ సూచించారు. డివిజన్ స్థాయిలో ఆర్డీ ఓలు, మండలస్థాయిలో తాహసీ ల్దార్‌లు ఇన్స ిడెంట్ కమాండర్లుగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసు కోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఆర్డీఓలు, అగ్ని మాపకశాఖ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ బాలాజీ

# రైల్వేలో ముగిసిన స్వచ్ఛతా హీ సేవా పక్షం




స్వచ్ఛత పక్షోత్సవం ముగింపు సందర్భంగా మాట్లాడుతున్న డి ఆర్ ఎం చంద్రశేఖర్ గుప్తా

**గుంతకల్లు రైల్వే,అక్టోబర్ 25, ప్రభాత వార్త:** జాతిపిత మహాత్మాగాంధీ కలలుకన్న పరిశుభ్రమైన భారతావని సాధించడం ఆచరణీయమని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డి ఆర్ ఎం ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డి ఆర్ ఎం సుధాకర్ స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం స్థానిక రైల్వే స్టేషన్ లో జరిగింది. కార్యక్రమంలో రైల్వే స్టేషన్ స్వచ్ఛతను ప్రతిరోజూ కొనసాగిస్తామని రైల్వే సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో రైల్వేస్టేషన్‌లు, రైళ్లు,రైల్వే కాలనీలు,ట్రాక్‌లు, కార్యాలయ ఆవరణలు, స్టేషన్లు, కార్యాలయాలు, మెయింటెనెన్స్ డిపోలు, ఆసుపత్రులు,ఆరోగ్య కేంద్రాలలో పరిశుభ్రత అలవాట్లను పాటించడంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృతమైన అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహించ మన్నారు.స్వచ్ఛతా ప్రతిజ్ఞకు కట్టుబడి స్వచ్ఛతా ప్రచారంలో ప్రతి ఒక్కరూ చురుగ్గాపాల్గొనాలని సిబ్బందికి,

# కమ్యూనిస్టులే దేశానికి ప్రత్యామ్నాయం

## - వందేళ్ల పోరాట స్ఫూర్తితో వేగవంతమైన అడుగులు

### సిపిఐ రాష్ట్ర నూతన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ, అక్టోబరు 25, ప్రభాతవార్త :** పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలు అవలభించడంతో ఆయా రంగాల్లో సమస్యలు తీవ్రతను అధిగమించేందుకు దేశానికి ప్రత్యామ్నయం కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య స్పష్టం చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన మీట్ ద ప్రెస్ట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ కడప జిల్లాలోని వెనుబడిన మారుమూల ప్రాంతంలో ఒక సామాన్య కుటుంబంలో జన్మించి అనాథశ్రమం, బీసీ సంక్షేమ హాస్టల్‌లో చదువుకుని విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ లో క్రియశీలకంగా వ్యవహరించి విద్యార్థులు, యువత సమస్యలపై అలుపెరగని పోరాటం చేశానని, కుటుంబ పరంగా ఆర్థికపరమైన ఇబ్బందులు, కష్టాలు అనేకమైనవి ఎదుర్కొంటూ, కరువు సమయంలో వలసలు కూడా వెళ్లిన పరిస్థితులు ఉన్నాయని తన అనుభవాలను వివరించారు. పార్టీలో అంచలంచెలుగా ఎదిగానని, పార్టీకి చేసిన సేవలు, ప్రజా పోరాటాలపై తనకున్న నిబద్ధతను గుర్తించి కాలక్రమేణా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అర్హుదెన అవకాశాన్ని కల్పించి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నత స్థానాన్ని కల్పించడం పెద్ద బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. ఈ స్ఫూర్తితో పార్టీ నాపై పెట్టిన బాధ్యతను పూర్తిస్థాయిలో వినియోగించుకుని రాష్ట్రంలో పార్టీ పూర్వ వైభావానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధాని మోదీ పరిపాలనతో దేశం తిరోగమనానికి వెళ్లిందని, కేవలం ప్రసంగాలు, మాటలు తప్పితే ప్రజలకు చేసేందేమీ లేదని విమర్శించారు. దేశంలో నెలకొన్న సమస్యలు ప్రక్కపెట్టి కేవలం అధికార అండతో మత రాజకీయాలపై దృష్టి పెట్టి పాలించడం దురదృష్టకరమన్నారు.

# వాడపల్లి వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులున- స్వామివారి ఒక్కరోజు ఆదాయంరూ 43.15లక్షలు

**ఉమ్మడి తూర్పు,గోదావరిజిల్లా బ్యూరో, అక్టోబర్, 25,(ప్రభాత వార్త)** ప్రముఖ పుణ్యక్షేత్రం గా విరాజిలుతున్న కోనసీమ తిరుమలగా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి శనివారం నాగుల చవితి పర్వదినం కావడంతో భక్తులతో పోటెత్తింది. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వేలాదిగా భక్తులు తరలి రావడంతో.. వాడపల్లి క్షేత్రం మాడ వీదులు గోవింద నామ స్మరణతో మారుమ్రోగింది. తెల్లవారు జామున సుప్రభాత సేవతో ప్రారంభమైన శ్రీవారి దర్శన, పూజా కార్యక్రమాలు.. రాత్రి 9 గంటల వరకు కొనసాగాయి. భక్తులంతా స్వామివారి దర్శనం కోసం గోవింద నామ స్మరణ చేసుకుంటూ ముందుకు కదిలారు. భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుండి ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఆలయానికి నడిపినట్లు డిప్యూటీ కమీషనర్, కార్యనిర్వాహ్నాధికారి నల్లం సూర్య చక్రధరరావు వెల్లడించారు. వచ్చిన భక్తులకు వికలాంగులకు వృద్ధులకు చంటి పిల్లలకు పాలు బిస్కెట్లు మజ్జిగ మంచినీళ్ల ఏర్పాటు చేసినట్లు తెలిపారు దాదాపు 20 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించినట్లు ఆయన వెల్లడించారు.ఈరోజు ఈ క్షేత్రానికి దాదాపు 70 వేలమంది భక్తులు వచ్చినట్లు అంచనా వేస్తున్నామన్నారు. అలాగే ఆదాయం రూ,43,15,403 లక్షల వరకు స్వామివారికి వివిధ సేవల ద్వారా సమకూరినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి చెప్పారు.

# ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్!

## ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన ఇంటర్ విద్యాశాఖ

## ప్రతి విద్యార్థికి రెండు జతలు ఇవ్వాలని ప్రతిపాదన

## సర్కార్ ఆమోదిస్తే వచ్చే యేడాది నుంచి అమలయ్యే అవకాశం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్‌తో కనిపించనున్నారు. అదేంటీ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్స్‌ను ప్రభుత్వం నిర్ణయించలేదు కదా.. అటువంటప్పుడు వారు యూనిఫామ్స్‌తో ఎలా కనిపిస్తారని అనుకుంటున్నారా? రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా యూనిఫామ్స్‌ను అమలు చేయాలని ఇంటర్ విద్యా శాఖ యోచిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లోనూ ఒకేరకమైన డ్రెస్‌కోడ్‌తో యూనిఫామ్స్‌ను సిద్ధం చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఇంటర్ విద్య శాఖ ప్రభుత్వానికి పంపించినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు ప్రతి యేడాది రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించినట్టు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే విద్యార్థులకు పూర్తిగా ఉచిత విద్యను అందిస్తున్న ఇంటర్ విద్య శాఖ.. ఇకపై తమ విద్యార్థులకు ఉచితంగా యూనిఫామ్స్‌ను అందించాలని.. అలా చేస్తే ప్రస్తుతం చేరుతున్న వారికంటే ఎక్కువ మంది విద్యార్థులు గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో చేరే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. అలాగే యూనిఫామ్స్ అందజేస్తే విద్యార్థులు హాజరుశాతం కూడా పెరుగుతుందని అధికారులు అంచనావేస్తున్నారు. కాలేజీకని చెప్పి ఇంట్లో నుంచి వస్తున్న మగ విద్యార్థుల్లో కొందరు కాలేజీ రాకుండా చిల్లరగా తిరుగుతున్నారని.. యూనిఫామ్స్‌ను కనుక విద్యార్థులకు పంపిణీ చేసినట్టయితే వారు యూనిఫామ్‌తో బయటకనపడితే ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులని తెలుస్తుందని.. దీంతో భయపడి తప్పకుండా కాలేజీకి వస్తారనే అంచనాలో అధికారులున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా యూనిఫామ్‌ను ఇస్తే విద్యార్థులు తమకు కూడా డ్రెస్ కోడ్ ఉందని, యూనిఫామ్ ధరించి ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీలకు చెందిన విద్యార్థుల మాదిరిగా భావించి కాలేజీకి రెగ్యులర్‌గా వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రంలో 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు న్నాయి. వాటిల్లో సుమారు 1,41,000 విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికీ రెండు జతల యూనిఫామ్స్ ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ ప్రతిపాదనలు పంపించినట్టు తెలుస్తోంది. విద్యార్థులకు రెండు జతల యూనిఫామ్స్‌ను అందజేస్తే ఏడాదికి ఎంత మేరకు ఖర్చు అవుతుందనే విషయాన్ని కూడా లెక్కలు వేసి ప్రభుత్వానికి సమర్పించినట్టు సమాచారం. ప్రభుత్వం ఇంటర్ విద్య శాఖ ప్రతిపాదనలను ఆమోదిస్తే.. ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభించి వచ్చే ఏడాది నుంచి లేదంటే 2027-28 నుంచి అమలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

# 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కొత్త భవనాల నిర్మాణం

## రూ. 117.30 కోట్లు ఖర్చు.. పిఎంజెవికె పథకంలో నిర్మాణం చేపట్టనున్న ఇంటర్ విద్యాశాఖ

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు కొత్త భవనాలను నిర్మించనున్నారు. ఇందుకోసం రూ. 117.30 కోట్లు ఖర్చు కానుంది. ఇందుకు సంబంధించిన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేయనున్నాయి. మైనారిటీలు ఎక్కువగా నివాసం ఉండే ప్రాంతాల్లో కొనసాగే ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు నూతన భవనాలను నిర్మించనున్నారు. ప్రధాన మంత్రి జన్‌వికాస్ కార్యక్రమ్(పిఎంజివికె) పథకంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నూతన భవనాలను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 60 శాతం కేంద్రం నిధులను ఇవ్వనుండగా.. మరో 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ. 46.92 కోట్లను ఖర్చు చేయనుండగా.. కేంద్రం రూ. 70.38 కోట్లను సాయంగా అందించనుంది. 10 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 4 కాలేజీలు హైదరాబాద్ జిల్లాలో ఉండగా ఒకటి నల్గొండ, ఒకటి ఆదిలాబాద్, రెండు నిర్మల్, ఒకటి మహబూబ్‌నగర్, ఒకటి నిజామాబాద్ జిల్లాల్లో ఉన్నాయి.

# వెనుకబడిన సుగంధ ద్రవ్యాల సాగు

## చింతపండుకు సైతం దిగుమతే గతి

## ఉద్యాన శాఖలో ప్రణాళికా లోపం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సుగంధ ద్రవ్యాల సాగులో తెలంగాణ వెనుకబడపోయింది. ఉద్యాన శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలో సుగంధ ద్రవ్యాల సాగుపై రైతులు ముందుకు రావడం లేదు. దీంతో రాష్ట్రంలో ప్రధానంగా చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర తదితర మసాలా దినుసులకు కొరత ఏర్పడింది. ఎండు మిర్చి, పసుపు సాగులో మాత్రం రాష్ట్రం అగ్రగామిగా ఉన్నా, చివరకు చింత పండును సైతం దిగుమతి చేసుకోవాల్సిన దుస్థితి తప్పడం లేదు. రాష్ట్రంలో ప్రతి రోజు సగటున ఒక్కొక్కరు 21.21 గ్రాముల సుగంధ ద్రవ్యాలను వినియోగిస్తున్నట్లు ఉద్యాన అధికారుల అంచనా. ఇలా రోజుకు 731 టన్నులు డిమాండ్ ఉండగా, ఏటా 2.63 లక్షల టన్నులు అవసరం ఉంటుందని అంచనా. చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాలు, జీలకర్ర, ఆవాలు, మిరియాలు తదితర సుగంధ ద్రవ్యాలు 1.78 లక్షల టన్నులు అవసరం ఉన్నది. ఈ డిమాండ్‌కు సరిపడా పంట రావాలంటే రాష్ట్రంలో 1.09 లక్షల ఎకరాల్లో ఈ పంటలు సాగుచేయాల్సి ఉంటుందని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలో లవంగాలు, యాలకులు, దాల్చిన చెక్క, జాపత్రి, జీలకర్ర వంటి విలువైన సుగంధ ద్రవ్యాలను ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కానీ చింతపండు, అల్లం, వెల్లుల్లి, ధనియాల వంటివాటిని కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నది. ఈ విధంగా ఏటా 61,564 టన్నుల చింతపండును దిగుమతి చేసుకుంటున్నారు. అలాగే రాష్ట్రంలో అల్లం 2,103 ఎకరాల్లో సాగవుతూ తద్వారా 20,489 టన్నుల ఉత్పత్తి అవుతోంది. అయితే అల్లం వినియోగం మాత్రం 68,419 టన్నులుగా ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో సాగైనది పోను ఇంకా 47,930 టన్నుల మేర ఇతర రాష్ట్రాల నుంచి వస్తోంది. ఇక వెల్లుల్లి విషయానికి వస్తే 27 ఎకరాల్లో మాత్రమే సాగవుతూ, 148 టన్నులు ఉత్పత్తి అవుతుండగా, వినియోగం మాత్రం 39,417 టన్నుల మేర ఉంటోంది. ధనియాలు రాష్ట్రం వ్యాప్తంగా 13,532 టన్నుల వినియోగం ఉండగా, 4,971 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది. తద్వారా 2,431 టన్నులు ఉత్పత్తి జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో దాదాపు లక్ష ఎకరాల్లో సుగంధ ద్రవ్యాల సాగు చేయాల్సిన అవసరం ఉందని అంచనా. ఇందుకు ఉద్యాన శాఖ అధికారులు ప్రోత్సహం కల్పించి సుగంధ ద్రవ్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# వేసవి విద్యుత్ కోసం ముందస్తు చర్యలు

## విద్యుత్ శాఖ ముఖ్యకార్యదర్శి మిట్టల్

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వచ్చే వేసవిలో గరిష్ట డిమాండ్ 19 వేల మెగావాట్లకు మించే అవకాశం ఉన్న దృష్ట్యా దాన్ని అధిగమించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ సూచించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది గరిష్ట డిమాండ్ 17162 మెగావాట్లకు చేరినా దాన్ని అధిగమించి విద్యుత్ సరఫరాలో ఎక్కడా ఓవర్ లోడింగ్ సమస్యలు తలెత్తకుండా చేశారన్నారు. ఇదే విధంగా వేసవి ప్రారంభానికి ముందే లైన్ల మరమ్మతులు, కొత్త ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు, ఇతర అభివృద్ధి పనులన్ని డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది భారీ డిమాండ్ నేపథ్యంలో ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ పరిధిలో 103 నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు, ట్రాన్స్కో పరిధిలో పవర్ ట్రాన్స్ ఫార్మర్ల సామర్థం పెంచుతున్నట్లు తెలిపారు. జెన్కో పరిధిలోని విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఓవర్ హాలింగ్ దాదాపు అన్ని యూనిట్లలో పూర్తయ్యిందని చెప్పారు.



బిటిపిఎస్, కెటిపిఎస్ ఓవర్ హాలింగ్ త్వరలో పూర్తి చేయనున్నారని వెల్లడించారు. మరి కొద్ది నెలల్లో యాదాద్రి థర్మల్ లోని అన్ని యూనిట్లు అందుబాటులోకి రావడంతో మొత్తం 4000 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. కాగా థర్మల్ ప్లాంట్లకు అవసరమైన బొగ్గు అందుబాటులో ఉండేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. వినియోగదారులకు మెరుగైన, పారదర్శక సేవలు అందించేందుకు ట్రాన్స ఫార్మర్ల, ఫీడర్లలో ఆటోమేషన్ విధానం తేవాలని చెప్పారు. ఎలక్ట్రిక్ వెహికల్ ఛార్జింగ్ స్టేషన్ లకు ఇస్తున్న రాయితీలను ప్రభుత్వ సంస్థలు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసేలా అవగాహనా కల్పించాలన్నారు. హైదరాబాద్‌ను ఇవి హబ్‌గా మార్చడంలో విద్యుత్, రెడ్కో సంస్థలు పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్కో, జెన్కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్, సింగరేణి సిఎండిలు కృష్ణ భాస్కర్, హరీష్, బలరాం, ఫరూఖీ, వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీఅచ్యుతా ఆగ్రోస్‌లో రూ.3.82 కోట్ల ధాన్యం మాయం

## 17 వాహనాలపై మోటారువాహనాల చట్టం ప్రయోగం

## మైనింగ్ అక్రమాలపై 8 కేసులు నమోదు.. రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ తనిఖీలు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు శనివారం తెల్లవారుజాము వరకు వివిధ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వరంగల్ యూనిట్ అధికారులు ములుగు జిల్లాలోని మల్లంపల్లిలో ఉన్న శ్రీఅచ్యుత ఆగ్రో ఇండస్ట్రీస్ అనే రైస్‌మిల్లులో తనిఖీలు మొదలు పెట్టారు. ఆ రైస్‌మిల్లులో స్టాక్ తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన 4780.80 క్వింటాళ్ల ధాన్యం, 2022-23 రబీ వేలం ధాన్యం 11191.26 క్వింటాళ్లు, మొత్తం 15972.06 క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లులో లేదని వారు గుర్తించారు. నల్లబజారు పట్టించిన ధాన్యం విలువ రూ.మూడు కోట్ల 81లక్షల57వేల ,251 ఉంటుందని విజిలెన్స్ అధికారులు ప్రకటించారు. శ్రీ ఆచ్యుతా ఆగ్రోస్ రైస్ మిల్లరుపై ఇసి చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవ డానికి ములుగు జిల్లా పౌర సరఫరాల అధికారికి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు సూచిం చారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, హైదరాబాద్ రూరల్ యూనిట్ శుక్రవారం అర్థరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఆకస్మిక రూట్ తనిఖీలు విస్తృతంగా చేశారు. మైనింగ్ శాఖ, రవాణా శాఖ విభాగాల అధికారులతో కలిసి రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు వద్ద నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో మోటారు వాహనాల చట్టం కింద 17 వాహనాలపై కేసులు నమోదు చేశారు. అలాగే గనులు మరియు ఖనిజాల చట్టం కింద 8 కేసులు నమోదు చేశారు. వసూలు చేసిన మొత్తం పన్ను సుమారు రూ.6,27,349 జరిమానా వసూలు చేశారు.



# ఎంజిఎం ఘటనలపై ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా సీరియస్

## సూపరింటెండెంట్‌పై వేటుకి ఆదేశం

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** వరంగల్‌లో ఉన్న ఎంజీఎం ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న వరస సంఘటనలపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా సీరియస్ అయ్యారు. నిర్లక్ష్యం వ్యవహారించినహాస్పిటల్ సూపరింటెండెంట్‌పై వేటు వేయాలని అధికారులను ఆదేశించారు. సూపరింటెం డెంట్‌తోపాటు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్లు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశం చారు. ఎంజిఎం హాస్పిటల్‌ను గాడిన పెట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శికి మంత్రి సూచించారు. ప్రతివారం ఎంజీఎంపై సమీక్ష చేసి తనకు నివేదిక సమర్పించాలని డీఎంఈని మంత్రి ఆదేశించారు. అలాగే ఎంజీఎంలో గత కొన్నేళ్లుగా పాతుకు పోయిన ఉద్యోగుల వివరాలు సేకరించి, వారి పనితీరుపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

# ఏసిబి వలలో సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్




**నస్పూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ రాథోడ్ భిక్కు లంచం తీసుకుంటూ ఆదిలాబాద్ ఏసీబీ అధికారుల వలలో చిక్కాడు. శనివారం ఉదయం మంచిర్యాల పట్టణంలోని ఆయన అద్దె ఇంటిపై ఏసీబీ అధికారుల బృందం దాడి నిర్వహించింది. రాథోడ్ భిక్కు ప్రస్తుతం మంచిర్యాల జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్‌గా, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా కూడా విధులు నిర్వహిస్తున్నారు. ఫిర్యాదుదారుడికి అనుకూలంగా వ్యవహారిం చేందకు రాథోడ్ ముందుగా 7 లక్షల రూపాయలు లంచంగా డిమాండ్ చేశాడు. పలుమార్లు అభ్యర్థించడంతో మొత్తం 5 లక్షల రూపాయలకు ఒప్పుకున్నాడు. తొలి విడతగా 2 లక్షల రూపాయలు తీసుకుంటుండగా ఏసీబీ అధికా రులు పట్టుకున్నారు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ జి. మధు తెలిపిన వివరాల ప్రకారం గతంలో ఓ ఉద్యోగి సస్పెండ్ అయ్యాడు. అతడిని సస్పెన్షన్ నుంచి తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం, జీవో 44 ప్రకారం వేతన సవరణల చేయడం, 2023 ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించడం, సస్పెన్షన్ కాలానికి సంబంధించిన భత్యాలు మంజూరు చేయడం, విచారణ నివేదికపై చర్యలు తీసుకోకుండా ఉండేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. దాడి అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షలో రాథోడ్ కుడిచేయి వేళ్లు, లంచం డబ్బు తాకిన బనియన్ భాగం పాజిటివ్‌గా తేలిందని ఏసీబీ అధికారులు తెలిపారు. రాథోడ్ భిక్కును అరెస్టు చేసి కరీంనగర్ ఏసీబీ ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచినట్లు, కేసు దర్యాప్తు కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే ప్రజలు నిర్భయంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్, 9440446106 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం ఇవ్వవచ్చు. ఎవరైనా లంచం అడిగితే తన సెల్ నంబర్ 9154388963లో సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివ రాలు గోప్యంగా ఉంచుతామని ఏసీబీ డీఎస్పీ జి. మధు తెలిపారు.

# ఇంటర్ పరీక్షల్లో ఇంటర్నల్ మార్కుల నిర్ణయం ఆత్మహత్యాసదృశం

## జిజెఎల్ఎ రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** వచ్చే యేడాది నుంచి ఇంటర్మీడియట్ విద్యా మండలి.. ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఇంటర్నల్ మార్కులను అమలు చేయాలని తీసుకున్న నిర్ణయం ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థకు, ఇంటర్ విద్యార్థులకు ఆత్మహత్యా సదృశ్యమని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థ 1969-70 విద్యా సంవత్సరం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభించబడి నప్పటి నుండి దేశంలోనే అత్యున్నత మైన ప్రమాణాలతో కొనసాగుతుందన్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగినది ఇంటర్ విద్యా మండలి.. దేశ వ్యాప్తంగా సిబిఎస్ఈ పుస్తకాలతో పోటీ పడే విధంగా గణిత శాస్త్రం, వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం దేశం లోనే అత్యున్నత విద్యా ప్రమాణాలు సొంతం చేసుకుందన్నారు. కొఠారీ కమిషన్ సిఫారసులకి అనుగుణంగానే 10+2+3 విధానాన్ని రాష్ట్రంలో ఆవిష్కరించిన ఘనత దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకి దక్కుతుందన్నారు. దేశంలోనే అత్యున్నత మైన ప్రమాణాలతో నిర్వహించేటువంటి ఐఐటి, ఎన్ఐటి కళాశాలల పరీక్షలు, ఎంఎస్ఈటీ పరీక్షలకు కూడా స్వీయ తర్ఫీదును పొంది సీట్లు సాధించేలా చేసిన ఘనత ఇంటర్మీడియట్ విద్యా మండలికి ఉందన్నారు. ఇప్పుడు ఎలాంటి చర్చ లేకుండా.. ఇటు విద్యార్థుల అభిప్రాయాలుగానీ, అధ్యాపకుల అభిప్రాయాలుగానీ, యాజమాన్యం అభిప్రా యాలు గానీ.. ఆఖరికి తల్లిదండ్రుల అభిప్రాయా లు పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఫలితాల పెంపు అనే దురాలోచనతో ఇంటర్మీడియట్ విద్యా మండలి 20 మార్కులు ఇంటర్నల్‌కి, 80 మార్కులు ఎక్స టర్నల్ కి అనెటువంటి విధంగా పరీక్షా విధానాన్ని పుస్తకాల తయారీని చేపట్టడానికి తీసుకున్న నిర్ణయాన్ని తమ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. వివిధ రాష్ట్రాలలో ఉన్నటువంటి పరిస్థితులు, ప్రమాణాలు వాటిని ఆసరాగా చేసుకుని ఈ నిర్ణయం తీసుకోవడంతో ఇంటర్మీడియట్ విద్యా మండలి ఒక పెద్ద తప్పుకు శ్రీకారం చుట్టిందన్నారు. దక్షి ణాది రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలలో ఇంట ర్నల్ మార్కుల సిస్టం ఉన్నమాట వాస్తవమని.. కానీ ఆయా రాష్ట్రాలు జాతీయ స్థాయిలో సాధిస్తున్నటువంటి ప్రవేశ పరీక్షల ఉత్తీర్ణతలు మనకంటే చాలా తక్కువగా ఉన్నాయన్న విషయాన్ని ఇంటర్మీడియట్ విద్యా మండలి విస్మరించడం సిగ్గుచేటన్నారు. గత 30 సంవత్సరాలుగా సగటున ఫస్ట్ ఇయర్‌లో 50శాతం, సెకండ్ ఇయర్‌లో 65 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులైన సందర్భాన్ని ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ విద్య కార్పొరేటీకరణ జరిగిన నేపథ్యంలో కార్పొరేట్ శక్తుల ప్రాబల్యం కారణంగా ప్రాక్టికల్ పరీక్షలే ఒక ప్రహసనంగా మారిన సందర్భంలో .. ఇపుడు 20 శాతం ఇంటర్నల్ మార్కులు విద్యార్థులకు కల్పించడం అంటే.. ఇంటర్మీడియట్ విద్యా పరీక్షల నిర్వహణను ఆయా కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పడమేనని మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు.



బిసి ప్రతినిధులతో మాట్లాడుతున్న బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య

# జనాభా ప్రకారం రిజర్వేషన్లకు సవరణ జరగాలి

## పార్టీలన్నీ ఏకాభిప్రాయంతో ముందుకు రావాలి

## బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్ కృష్ణయ్య

**హైదరాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వే షన్లతోపాటు స్థానిక సంస్థల రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ జరగాలని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శనివారం బీసీభవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శులు కుండా ప్రవీణ్ గౌడ్, బాణాల అజయ్ తదితర నేతలు కృష్ణయ్యను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రిజర్వేషన్ల సమస్యకు ప్రతిసారి వ్యతిరేక తీర్పులు వస్తున్నాయి. దీనికి రాజ్యాంగ బద్దత కల్పించడమే శాశ్వత పరిష్కారమన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లు విషయంలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా బీసీలకు వ్యతిరేకంగా తీర్పులు వచ్చాయి' అన్నారు. స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉంది. గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పారని గుర్తుచేశారు. కులగణన చేపట్టాలని ప్రధానమంత్రి మోడీ అంగీకరించడం ధైర్య సహాసాలలో కూడుకున్న అంశం. కులగణన వివరాలు వచ్చిన తర్వాత అన్ని రంగాలలో బీసీలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వాటా ఇవ్వడానికి సిద్ధపడే ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు.

'బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వే షన్లు కల్పించాలి. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బిసిలకు 'బిసి యాక్టు'ను పార్లమెంట్‌లో తీసుకరావాలి.స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్ల సాధనకై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేయాలని ఆయన బిసి వర్గాలకు పిలుపునిచ్చారు.

# కుట్ర చేసి నన్ను బిఆర్ఎస్ నుంచి బయటకు పంపారు

## నా దారి నేను వెతుక్కుంటున్నా : కవిత

## అమరవీరుల కుటుంబాలకు ఇంకా న్యాయం జరగలేదని వ్యాఖ్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, అక్టోబరు 25:** ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీకి దూరమైన తర్వాత ప్రజల్లోకి వచ్చిన ఆమె నిజామాబాద్ కేంద్రంగా జాగృతి జనం బాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ, తనను కుట్రపూరితంగా పార్టీ నుంచి బయటకు పంపారని, ఇప్పుడు తన దారి తాను వెతుక్కుంటున్నానని సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం నిజామాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'గత 20 ఏళ్లుగా కేసీఆర్ నాయకత్వంలో, బీఆర్ఎస్ పార్టీ కోసం అంకితభావం తో పనిచేశాను. 27 ఏళ్ల వయసులోనే తెలంగాణ ఉద్యమంలోకి అడుగుపెట్టాను. ఎన్నో అవమానాలు ఎదురైనా ఓపికతో భరించాను', అని గుర్తు చేసుకున్నారు. నిజామాబాద్‌లో తన ఓటమి వెనుక పెద్ద కుట్ర జరిగిందని ఆరోపించిన కవిత, 'ఏం జరిగిందో బీఆర్ఎస్ కార్యకర్తలు ఆలోచించాలి. జరిగిన కుట్ర గురించి పిల్లల్ని అడిగినా చెబుతారు' అని వ్యాఖ్యానించారు. ఇకపై తన ప్రయాణం ప్రజలతోనే అని స్పష్టం చేసిన కవిత, తన భవిష్యత్ ప్రణాళికలను వివరించారు. తెలంగాణ వచ్చి పదేళ్ల గడిచినా అమరవీరుల కుటుంబాలకు సరైన గౌరవం, న్యాయం దక్కలేదు. వారి కోసం పోరాడాల్సిన అవసరం ఉంది. ఈ జనం బాటలో భాగంగా మేధావులు, విద్యార్థులు, రైతులు సహా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలతో మాట్లాడతాను. అందరి భాగస్వామ్యంతో ఆత్మగౌరవంతో కూడిన అభివృద్ధి సాధించడమే నా లక్ష్యం అని తెలిపారు. యాత్ర ప్రారంభానికి ముందుగా ఉదయం నాంపల్లిలోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం కోసం 1,200 మంది ప్రాణత్యాగం చేశారని, కానీ అధికారంలోకి వచ్చాక వారి కుటుంబాలకు అనుకున్నంత మేర న్యాయం చేయలేకపోయామని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 'కేవలం 500 మంది అమరవీరుల కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగాం. ఉద్యమకారులకు కొన్నిచోట్ల రాజకీయంగా నామమాత్రపు పదవులు దక్కాయి కానీ, వారికి జరగాల్సినంత న్యాయం జరగలేదు. ఎంపీగా ఉన్నప్పుడు పార్టీ అంతర్గత వేదికలపై ఈ విషయం ప్రస్తావించినా, వారి కోసం గట్టిగా కొట్లాడలేకపోయాను. అందుకే ఇప్పుడు బహిరంగంగా క్షమాపణ చెబుతున్నాను' అని ఆమె అన్నారు. అమరవీరుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు..సామాజిక తెలంగాణ సాధనే లక్ష్యంగా తాను 33 జిల్లాలు, 119 నియోజకవర్గాల్లో పర్యటిస్తున్నానని.. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు దక్కే వరకు తన పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వంపై కూడా ఆమె విమర్శలు చేశారు. 'తెలంగాణ తల్లి విగ్రహం చేతిలోంచి బతుకమ్మను తీసేశారు. తిరిగి తెలంగాణ తల్లి చేతిలో బతుకమ్మను పెట్టే వరకు పోరాడదాం' అని పిలుపునిచ్చారు. పాత మనస్పర్థలను పక్కనపెట్టి జాగృతి మాజీ సభ్యులందరూ తిరిగి కలిసి రావాలని, సామాజిక తెలంగాణ కోసం ఐక్యంగా పోరాడాలని కోరారు.



# బిసి బిడ్డ పిఎం మోడీ బిసి రిజర్వేషన్‌కు అనుకూలంగా రావాలి

## మాజీ ఎంపి వి.హనుమంతరావు

**హైదరాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల బిడ్డ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా బిసిలకు 42శాతం రిజర్వేషన్‌కు అనుకూ లంగా వ్యవహరిస్తే అన్ని రకాలుగా లబ్ది జరుగుతుంది మాజీ ఎంపి మాజీ పిసిసి అధ్యక్షుడు వి. హనుమంతరావు ఆశా భావం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో శనివారం మీడియాతో మాట్లాడుతూ బిసి లకు రిజర్వేషన్ల విషయంలో రాహుల్ గాంధీ పాదయాత్రలో స్పష్టంగా ప్రకటించారని గుర్తుచేశారు. రాష్ట్రంలో అధికారంలో కి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని రకాలుగా బిసి రిజర్వేషన్ల గురించి చిత్తశుద్ధితో పనులు చేశారు.ఇప్పుడు బిసి రిజర్వే షన్ల కేసు కోర్టులో పెండింగ్ ఉంది.పార్లమెంట్ లో తెలంగాణ బిసి బిల్లు పెట్టి 9వ షెడ్యూల్ లో పెట్టాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా రాజకీయ పక్షాల సమావేశం పెట్టి ఈ విషయం మాట్లాడాలని కాంగ్రెస్ ఒబిసిల కన్వీనర్ గా కోరారు . కేంద్రంలో ఐఐటీ, ఐఐఎం విషయం లో నేను గతంలో సోనియాగాంధీ కోరుతే అప్పుడు అమలు అయ్యిందని అన్నారు.బిజెపి నాయ కులు, ఎంపిలు ప్రధానమంత్రి ని కోరి బిసి రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాలి ఇదే మంచి సమయం ఇప్పుడు కాకపోతే ఎప్పుడు కాదని ఆయన చెప్పారు.అగ్రవర్ణ నాయకులు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, బిసి రిజర్వేషన్ల అనుకూలంగా ఉన్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బిసి రిజర్వేషన్ల విషయంలో సహకరించి అమలు అయ్యేలా చూడాలని నేను ఒబిసి కన్వీనర్‌గా అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నా అని ఆయన అన్నారు.

# 'డ్యూడ్'100 కోట్లు క్రాస్‌చేయడం హ్యాపీగా ఉంది

## ఈవెంట్‌లో.. హీరో ప్రదీప్ రంగనాథన్



యూత్ సెన్సేషన్ ప్రదీప్ రంగనాథన్ లేటెస్ట్ దీపావళి బ్లాస్ట్ డ్యూడ్. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రంతో కీర్తిశ్వరన్ డైరెక్టర్ గా పరిచయం అయ్యారు. మమిత బైజు నటించగా, శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. అక్టోబర్ 17న విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ తో బ్లాక్ బస్టర్ సక్సెస్ అందుకొని హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ డ్యూడ్ బ్లాక్ బస్టర్ 100 జర్నీ ఈవెంట్ ని నిర్వహించారు. డ్యూడ్ బ్లాక్ బస్టర్ 100 జర్నీ ఈవెంట్ లో హీరో ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ,డ్యూడ్ సినిమా 100 కోట్లు కలెక్షన్స్ ని క్రాస్ చేసింది. తెలుగు ఆడియన్ కి కృతజ్ఞతలు తెలపడానికి ఈవెంట్ ని నిర్వహించడం జరిగింది. ఆడియన్స్ లేకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. లవ్ టు డే. డ్రాగన్ చిత్రాలకు ఎంత ఆదరణ ఇచ్చారో ఈ చిత్రానికి కూడా అంతకంటే ఎక్కువ ఆదరణ అందించారు. మీ సపోర్ట్‌కి ఎప్పుడూ కృతజ్ఞతలు ఉంటాను. మీ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. మా టీమ్ అందరికీ ధన్యవాదాలు.

నిర్మాత ఎస్కేఎన్ మాట్లాడుతూ,మైత్రి మూవీ మేకర్స్ 2000 కోట్ల సినిమాని చూసిన నిర్మాతలు. వారికి ప్రతి నెల ఒక బ్లాక్ బస్టర్ వస్తుంటుంది. దీపావళికి వచ్చిన ఈ సినిమా పాన్ సౌత్ బ్లాక్ బాస్టర్ కావడం చాలా ఆనందంగా ఉంది. మైత్రి మూవీ మేకర్స్ నవీన్ రవివిజన్ వేరు. వాళ్ళ కిరీటంలో మరో మైలురాయి చేరినందుకు అభినందనలు. తొలి సినిమా విజయం సాధించడం చాలా స్పెషల్ అందులో 100 కోట్ల సినిమా సాధించిన డైరెక్టర్ కీర్తికి కంగ్రాజులేషన్స్. ఈ సినిమా చూస్తున్నప్పుడు ఒక సుకుమార్ సినిమా చూస్తున్నంత ఇంటెన్సిటీ ఫీల్ అయ్యాను. మమిత లక్కీ హ్యాండ్. అద్భుతంగా నటించారు. తనకు మరెన్నో విజయాలు రావాలని కోరుకుంటున్నాను. సినిమా విషయానికొస్తే తెలుగు తమిళ్ ఒకే స్టేట్. తమిళ్ స్టార్స్ కూడా మా స్టార్స్ గానే ఫీల్ అవుతాము. కమల్ హాసన్, రజినీకాంత్ ,సూర్య, అజిత్ ధనుష్, విజయ్ సేతుపతి ఇలా ఎవరొచ్చినా సరే మా సొంత సినిమాలానే ప్రేమిస్తాం. ప్రదీప్ కూడా ఇప్పుడు ఈ ఎలైట్ క్లబ్ లో జాయిన్ అయ్యారు. మూడుసార్లు ఇండస్ట్రీని షేక్ చేసి వరుసగా మూడు వంద కోట్ల సినిమాలు ఇచ్చారు. ప్రదీప్ కేవలం హీరో మెటీరియల్ కాదు యాక్టర్ మెటీరియల్ స్టార్ మెటీరియల్. ప్రదీప్ ఇంకా ఎన్నో విజయవంతమైన సినిమాలు చేయాలని, మైత్రి మూవీ మేకర్స్ ఎప్పుడూ కళకళలాడుతూ ఉండాలని కోరుకుంటున్నాను.

హీరోయిన్ మమిత బైజు మాట్లాడుతూ, ఈ సక్సెస్ ని సెలబ్రేట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. సినిమా 100 కోట్లు కలెక్షన్స్ క్రాస్ చేసింది. ఇది మరింత స్పెషల్ మూమెంట్. అడియన్స్ సపోర్టుకి థాంక్యూ. వారి సపోర్ట్ లేకపోతే ఇది సాధ్యం కాదు. ఈ సినిమాకి ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. మై కోస్టార్ ప్రదీప్ కి, డైరెక్టర్ కీర్తికి థాంక్యూ సో మచ్ ఇంత ప్రేమనిచ్చిన తెలుగు ఆడియన్స్‌కి థాంక్యూ.

డైరెక్టర్ కీర్తి ఈశ్వర్ మాట్లాడుతూ,అందరికి నమస్కారం. ప్రదీప్ రంగనాథన్ కి ఇది హ్యాట్రిక్ మూవీ. ఇది నాఫస్ట్ సినిమా. ఇలాంటి కొలబరేషన్లో అద్భుతమైన విజయం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. సినిమాని ఇంత గొప్పగా ఆదరించిన తెలుగు ఆడియన్స్‌కి కృతజ్ఞతలు.ఈ సినిమాలో గగన్ క్యారెక్టర్ రాయడానికి చాలా తెలుగు సినిమాల ఇన్స్పిరేషన్ ఉంది. తెలుగు రాష్ట్రాల్లో సినిమా అద్భుతంగా రన్ కావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన ప్రదీప్, మమిత మా టీమ్ అందరికీ థాంక్యు వెరీ మచ్.రైటర్ కృష్ణ మాట్లాడుతూ ,కథ రాసిన కీర్తికి చేసిన ప్రదీప్ కి థాంక్యూ. ఈ క్యారెక్టర్ ని యాక్సెప్ట్ చేసినందుకు మమతకి థాంక్యూ. మైత్రి మూవీ మేకర్స్ అద్భుతంగా తీశారు. డైలాగులు రాస్తున్నప్పుడే ఖచ్చితంగా 100 కోట్లు కొడుతుందని అనుకున్నాను. ఇది డ్యూడ్ దివాళి ఈ అవకాశం ఇచ్చిన రవికి నవీన్‌కి థాంక్యూ.

# సి.వి. కుమార్ దర్శకత్వంలో

## రాబోతోన్న చిత్రం 'ఎక్స్ వై'మోషన్ పోస్టర్ విడుదల..

**శ్రీ క్రిష్ పిక్చర్స్,** శ్రీ ఇంటర్నేషనల్ బ్యానర్లపై రతిక ప్రధాన పాత్రలో సి.వి. కుమార్ తెరకెక్కించిన చిత్రం`ఎక్స్ వై. డిఫరెంట్ కంటెంట్‌తో రాబోతోన్న ఈ మూవీకి సంబంధించిన మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ మోషన్ పోస్టర్ చూస్తుంటే ఇదొక ప్రయోగాత్మక చిత్రమని అర్థం అవుతోంది. కథ ఏంటి? బ్యాక్ డ్రాప్ ఏంటి? అన్న విషయాల్ని రివీల్ చేయకుండా అందరిలోనూన ఆసక్తిని పెంచేలా మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. సి.వి. కుమార్ ఎప్పుడూ కూడా పిజ్జా, సూదు కవ్వుమ్, అట్టకత్తి, శరభం, ఇరుది సుట్రు, మాయావన్ లాంటి ప్రయోగాత్మక చిత్రాలు చేస్తూనే ఉంటారు. దర్శక, నిర్మాతగా సి.వి. కుమార్ మరోసారి`ఎక్స్ వై అంటూ ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. తాజాగా రిలీజ్ చేసిన మోషన్ పోస్టర్‌లో కనిపించిన టీ పోసే బౌల్, కెమెరా, మెదడు, డీఎన్ఏ, ఆ తరువాత రాక్షసుడిలా ఓ రూపాన్ని చూపించడం, ఆపై హీరోయిన్ లుక్ చూపించడం, అక్కడ చుట్టూ గర్భంలో ఉన్న శిశువుల్ని చూస్తుంటే ఇదొక డిఫరెంట్ అండ్ న్యూ కంటెంట్ మూవీ అని అర్థం అవుతోంది.తెలుగు, తమిళ్, మలయాళం ఇలా అన్ని భాషల్లో ఈ మూవీని రిలీజ్ చేయనున్నారు. ఈ చిత్రానికి శ్రీకాంత్ కృష్ణ సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమాకి హరిహరణ్ ఆనందరాజ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే చిత్రానికి సంబంధించిన ఇతర వివరాల్ని ప్రకటించనున్నారు.



# చార్మింగ్ స్టార్ శర్వా 36వ మూవీ 'బైకర్'

బైకర్ కోసం చార్మింగ్ స్టార్ శర్వా జాడ్రాపింగ్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ చార్మింగ్ స్టార్ శర్వా తన 36వ మూవీ 'బైకర్'తో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. స్పోర్ట్స్ ఫ్యామిలీ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తుండగా, ప్రతిష్టాత్మకమైన యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. దీపావళి సందర్భంగా విడుదలైన టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో సినిమా మీద భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



ప్రొఫెషనల్ మోటార్‌సైకిల్ రేసర్ పాత్రలో కనిపించబోతున్న శర్వా తన పాత్ర కోసం జాడ్రాపింగ్ ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. తాజాగా విడుదలైన ఫోటోషూట్ స్టిల్స్ లో ఆయన ఫిజిక్, కాన్ఫిడెన్స్ అంతా కలిపి కొత్త శర్వా ప్రజెంట్ చేశాయి. షర్ట్‌లెస్ లుక్స్‌లో షార్ప్ అబ్స్‌తో, ఫైరీ గేజ్‌తో రేసర్ స్పిరిట్‌ను అద్భుతంగాచూపించారు. శర్వాతన పాత్రకు సరిపడేలా లీన్ అండ్ అథ్లెటిక్ బాడీని తీర్చిదిద్దుకున్నారు. నెలల తరబడి వర్కౌట్స్, డైట్, డెడికేషన్ తో ట్రాన్స్‌ఫర్మేషన్ సాధించారు. ఇంత ఫిట్‌గా, ఎనర్జీగా శర్వా కనిపించడం అభిమానులకు పండుగలా మారింది.ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీకి జె. యువరాజ్, మ్యూజిక్‌కు జిబ్రాన్, అనిల్ కుమార్ పి ఎడిటర్. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్. ఎ పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్ గా వ్యవహరిస్తున్నారు, ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. శర్వా కొత్త లుక్, కథ కాన్సెప్ట్, టాప్ టెక్నికల్ టీమ్ ఇవన్నీ కలసి`బైకర్ట్ సినిమాను ఒక థ్రిల్లింగ్ ఎమోషనల్ రైడ్ గా మార్చబోతున్నాయి. అభిమానులు ఇప్పుడు శర్వా కొత్త అవతార్ ని థియేటర్స్‌లో చూడటానికి ఎదురుచూస్తున్నారు

## కృష్ణచైతన్య చేతుల మీదుగా

# 'దేవ్‌పారు' సాంగ్‌లాంచ్



డైరెక్టర్ కృష్ణ చైతన్య చేతుల మీదుగా' దేవ్ పారు' సినిమా నుంచి నా ప్రాణమంత సాంగ్ లాంచ్

ఏకే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న దేవ్ పారు చిత్రం నుంచి ఈ రోజు నా ప్రాణమంత అనే పాట విడుదల అయింది. సింగర్ కాలభైరవ పాడిన ఈ పాట డైరెక్టర్ కృష్ణ చైతన్య చేతుల మీదుగా ఈ విడుదల అయింది. ఈ పాట ఆదిత్యమ్యూజిక్ లో శ్రోతలను ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కృష్ణ చైతన్య మాట్లాడుతూ, కాలభైరవతో కలిసి పనిచేశాను. ఈ టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్. సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. దేవ్ పారు మూవీ ఒక ఫ్రెష్, ఎమోషనల్ లవ్ స్టోరీ అని యూత్‌ను ఆకట్టుకుంటుందని చెప్పారు. సినిమాకు అందరూ రిలేట్ అవుతారని చెప్పారు. పాట కూడా చాలా బాగుంది. ఆడియెన్స్ సపోర్ట్ తో సినిమా పెద్ద విజయం సాధిస్తుందని చెప్పారు. దర్శకుడు అంజి మాట్లాడుతూ, ఈ చిత్రం యూత్‌ను బాగా ఆకట్టుకుంటుందని, అఖిల్ రాజు దర్శకుడిగా గొప్ప భవిష్యత్తు ఉందని ప్రశంసించారు. అందరూ కొత్తవారే అయినప్పటికీ హీరో, హీరోయిన్‌లు అద్భుతంగా నటించారని, వారి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని అంజి తెలిపారు. హీరో మిహాస్ రోమి మాట్లాడుతూ, జగ్గయ్యపేట నుంచి హైదరాబాద్ వరకు తన సినీ ప్రయాణంలో ఎన్నో అవమానాలు, అడ్డంకులు ఎదురైనా, తన పాషన్‌తో ఈ స్థాయికి చేరానని ఎమోషనల్‌గా తెలిపారు. ఈ సినిమా రిలీజ్ అయిన తర్వాత తనకు మంచి పేరు వస్తుందని చెప్పారు. మా టీమ్ పాషన్, ప్రొడ్యూసర్ అలీ, డైరెక్టర్ అఖిల్, డీఓపీ అశ్విన్ సపోర్ట్‌తో ఈ సినిమా గొప్ప విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.. లవర్స్ ఈ సినిమాతో రిలేట్ అవుతారు అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఓషో వెంకట్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని,అఖిల్ మాట్లాడుతూ, మా డాడీ ఎప్పుడూ నన్ను ముందుకు నడిపించేవారు. ఈ సినిమాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఈ సాంగ్ ప్రతి ఒక్కరి ప్లేలిస్ట్‌లో ఉండాల్సిన ఎమోషనల్ ట్రాక్. అందరూ విని, స్ప్రెడ్ చేయాలని కోరుకుంటున్నాం అని అఖిల్ తెలిపారు.

# కమల్, రజిని ప్రాజెక్ట్ కోసం క్రేజీ డైరెక్టర్?



ఈ మధ్య సెన్సేషనల్ బజ్ ని క్రియేట్ చేసిన భారీ మల్టీస్టారర్ కాంబినేషన్ ఏదన్నా ఉంది అంటే అది సూపర్ స్టార్ రజినీకాంత్ అలాగే యూనివర్సల్ హీరో కమల్ హాసన్ ల కలయిక అని చెప్పాలి. అయితే వీరి కాంబినేషన్ కోసం చాలా మంది దర్శకుల పేర్లు వినిపించాయి కానీ ఇప్పుడు మరో క్రేజీ డైరెక్టర్ పేరు వైరల్ గా మారింది కానీ. మరి ఆ దర్శకుడు ఎవరో కాదు సూపర్ స్టార్ తో ఆల్రెడీ జైలర్ లాంటి భారీ సక్సెస్ కొట్టిన దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ అట. ఇప్పుడు జైలర్ 2 చేస్తున్న ఈ దర్శకుడు నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా ఆ భారీ కాంబినేషన్ టేకాఫ్ చేయనున్నట్టుఇప్పుడురూమర్స్ వినిపిస్తున్నాయి.


# 'ఎ కప్ ఆఫ్ టీ 'వాట్‌హాపెండ్ ప్రమోషనల్ సాంగ్ విడుదల

గీతా సుబ్రమణ్యం ఫేమ్ మనోజ్ కృష్ణ తన్నీరు హీరోగా నటిస్తోన్న లేటెస్ట్ మూవీ ఎ కప్ ఆఫ్ టీ . నేటి యువతకు నచ్చే కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రం ద్వారా ఎఫ్పీ రోజర్స్, నిఖిత రావు దర్శకులుగా పరిచయమవుతున్నారు. ఆర్టిస్ట్ క్రియేషన్స్ పతాకంపై మనోజ్ కృష్ణ, నవీన్ కృష్ణ నిర్మించారు. జయ శ్రీ హీరోయిన్‌గా నటిస్తోన్న ఈ మూవీలో నటుడు రాకేష్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ మూవీ నుండి వాట్ హాపెండ్ అనే ప్రమోషనల్ సాంగ్ ని రిలీజ్ చేశారు. డైస్ ఆర్ట్స్ ఫిల్మ్స్ ఈ ఈవెంట్‌ని గ్రాండ్ గా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో

హీరో మనోజ్ మాట్లాడుతూ మా సినిమాను జనాల్లోకి తీసుకెళ్లడానికి మేము ఎంచుకున్న మార్గమే ఈ ప్రమోషనల్ సాంగ్..ఈ పాటతో మా సినిమాని ప్రమోట్ చేసి థియేటర్స్ వరకూ తీసుకెళ్లాలి అన్నదే మా టీమ్ ఉద్దేశ్యం..ఎద్ద సినిమాల వల్ల చిన్న సినిమాలు ఎలా ఎఫెక్ట్ అవుతున్నాయి అన్నది ఈ పాటలో ఫన్నీగా చూపించే ప్రయత్నం చేశాం. ఈ సినిమా ఒక యంగ్‌స్టర్ జర్నీఒక కాలేజ్ యువత జర్నీ ఎలా స్టార్ట్ అవుతుంది.
అది ఎలా డీవియేట్ అవుతుంది దాని వల్ల వచ్చే పరిణామాలు ఏంటి అన్నది ఈ సినిమాలో చూపించాం. నేటి యువత తప్పక చూడాల్సిన సినిమా..డైరెక్టర్ ఎఫ్పీ రోజర్స్ వచ్చి ఈ కథ చెప్పగానే చాలా నచ్చింది. గీత సుబ్రమణ్యం తర్వాత మళ్లీ నాకు అంత హై ఇచ్చిన ఫిల్మ్ ఇది. ఈ సినిమా మీద నేను, మా టీమ్ అందరం చాలా కాన్ఫిడెన్స్‌గా ఉన్నాం. మా టీమ్ అందరికీ మీ సపోర్ట్ ఉండాలని కోరుకుంటున్నాను అన్నారు.మ్యూజిక్ డైరెక్టర్ కార్తిక్ రోడ్రవిజ్ మాట్లాడుతూ ,మాది చిన్న సినిమా అయినా మ్యూజిక్, మేకింగ్‌కి మనోజ్ చాలా ఖర్చు పెట్టారు. పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ చాలా బాగా వచ్చింది. దర్శకులు మంచి ఔట్‌పుట్ తీసుకువచ్చారు. ఆదిత్య ఒక మంచి క్యారెక్టర్లో కనిపిస్తారు. ట ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీ..ఒక లైఫ్ స్టోరీ అని చెప్పొచ్చు. యువతరం అందరికీ తప్పకుండా కనెక్ట్ అవుతుందని నమ్మకం ఉంది. మా ఫస్ట్ సాంగ్‌కి మంచి రెస్పాన్స్ రావడం హ్యాపీ అన్నారు.నటుడు రాకేష్ మాట్లాడుతూ, నేను మనోజ్‌కి చాలా పెద్ద ఫ్యాన్.. గీత సుబ్రమణ్యం సిరీస్ టైమ్‌లో తన క్రేజ్ ఏంటో..ఏ రేంజ్లో ఉండేవాడో నాకు తెలుసు.లఆర్టిస్ట్‌గా ఈ సమాజానికి మంచి చేయాలనే ఈ కథ ఎంచుకున్నాడు. ఎలాంటి వల్గారిటీ లేని ఒక బ్యూటిఫుల్ లైఫ్ స్టోరీ..ఈ కథలో తనతో పాటు ట్రావెల్ చేసే క్యారెక్టర్..ఈ పాత్ర నాకు రావడానికి కారణమైన మనోజ్ కి థ్యాంక్స్..ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలి..హీరోగా మనోజ్ బాగా బిజీ అవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు.



# 'జటాధర' నుంచి జో లాలి జో సాంగ్ రిలీజ్



సుధీర్ బాబు, జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా 'జటాధర' నుంచి జో లాలి జో సాంగ్ రిలీజ్‌నవ దళపతి సుధీర్ బాబు, బాలీవుడ్ పవర్‌హౌస్ సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రలలో నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ జటాధర. అద్భుతమైన సినిమాటిక్ అందించే ఈ పాన్‌ఇండియా ద్విభాషా చిత్రానికి వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహించారు. హైఆక్టేన్ విజువల్స్, పౌరాణిక ఇతివృత్తాలతో ఈ చిత్రం గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది.ఇటీవల రిలీజ్ అయిన టీజర్, ట్రైలర్ నేషనల్ వైడ్‌గా వైరల్ అయ్యింది. సోల్ ఆఫ్ జటాధార, ధన పిశాచి సాంగ్స్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యాయి.తాజాగా మేకర్స్ జోలాలిజోసాంగ్ రిలీజ్ చేశారు. రాజీవ్ రాజ్ ఈ పాటని అద్భుతమైన లాలి పాటగా కంపోజ్ చేశారు. శ్రీమాన్ కీర్తి లిరిక్స్, పావని వాసా, రాజీవ్ రాజ్ వోకల్స్ ఆకట్టుకున్నాయి.ఈ చిత్రంలో దివ్య ఖోస్లా, శిల్పా శిరోధ్కర్, ఇంద్రకృష్ణ, రవి ప్రకాష్, నవీన్ నేని, రోహిత్ పాఠక్, ఝాన్సీ, రాజీవ్ కనకాల, సుభలేఖ సుధాకర్‌తో పాటు ప్రముఖ నటులు కనిపించనున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ఉమేష్ కుమార్ బన్సల్, శివిన్ నారంగ్, అరు ణ అగర్వాల్, ప్రేరణ అరోరా, శిల్పా సింగ్‌హాల్,నిఖిల్ నందా నిర్మించారు. అక్షయ్ కేజ్రీవాల్, కుస్సుమ్ అరోరా సహ నిర్మాతలుగా వ్యవహరించార్యా విజయ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా, భావిని గోస్వామి సూపర్వైజింగ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. సినిమాకి పవర్ ఫుల్ సౌండ్‌స్కేప్‌ను జీ మ్యూజిక్ కో అందిస్తోంది.జటాధర నవంబర్ 7న హిందీ, తెలుగు భాషల్లో విడుదల కానుంది.

# 'ది గర్ల్ ఫ్రెండ్' రశ్మిక నటనకు బెస్ట్ యాక్టర్ అవార్డ్ వస్తుంది

## ట్రైలర్ లాంచ్‌ఈవెంట్ లో ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా "ది గర్ల్ ఫ్రెండ్". ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇంటెన్స్, ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా నవంబర్ 7న హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్‌లో గ్రాండ్ గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీవోపీ కృష్ణన్ వసంత్ మాట్లాడుతూ, "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా టీమ్ తో వర్క్ చేయడం ఎంతో ఇన్స్ పైర్ చేసింది. ఒక ఇంటెన్స్, ప్యాషనేట్ కంటెంట్ ను ఈ చిత్రంలో చూపించబోతున్నాం. మీరంతా మా మూవీని సపోర్ట్ చేస్తారని, మా సినిమా గురించి మిగతా వారికి చెబుతారని కోరుకుంటున్నా అన్నారు. డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ నేను స్టూడెంట్ గా హాస్టల్లో ఉండే రోజుల్లో ఈ స్టోరీ ఐడియా వచ్చింది. దాన్ని కొన్నేళ్ల క్రితం స్టోరీగా రాసుకున్నా. మీరు ఇప్పుడు ట్రైలర్‌లో ఏం చూశారో అదే సినిమా. ఇంటెన్స్ ఎమోషన్ తో ఉంటుంది. రిలేషన్ షిప్ ట్రై చేయాలనుకునే వారు ఈ సినిమాకు బాగా కనెక్ట్ అవుతారు. అమ్మాయిలైనా, అబ్బాయిలైనా "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా చూసి ఆ ఎమోషన్ తో బయటకు వస్తారు. మూవీ రియల్ గా, రూటెడ్‌గా, ఇంటెన్స్‌గా, ఎమోషనల్ గా ఉంటుంది. నా టీమ్ అందరూ ప్యాషనేట్ గా వర్క్ చేశారు. హీరో దీక్షిత్, హీరోయిన్ రశ్మికతమ పర్ ఫార్మెన్స్‌తో కథకు లైఫ్ ఇచ్చారు. ట్రైలర్ చూశాక మీకు అర్థమై ఉంటుంది ఇదొక డిఫరెంట్ లవ్ స్టోరీ. ప్రతి ఒక్క ప్రేక్షకుడి మనసుకు హత్తుకునేలా మూవీ ఉంటుంది. ఇలాంటి మంచి కథ తీసుకొచ్చిన రాహుల్ కు థ్యాంక్స్. ఈ క్యారెక్టర్ ను రశ్మిక తప్ప మరో హీరోయిన్ ఇంత బాగా పర్ ఫార్మ్ చేయలేరు. ఆమె గురించి మరో సందర్భంలో మాట్లాడుతా. తను మమ్మల్ని ఇన్స్ పైర్ చేసేది. దీక్షిత్, రశ్మిక తమ పర్ ఫార్మెన్స్‌లతో ఈ కథకు లైఫ్ ఇచ్చారు. నవంబర్ 7న మీ అందరినీ థియేటర్స్ లో కలుస్తాను అన్నారు. రశ్మిక లేకుంటే "ది గర్ల్ ఫ్రెండ్' సినిమానే లేదు. దీక్షిత్ మాకు దొరికిన గొప్ప నటుడు. ఆయన టాలీవుడ్ లో "ది గర్ల్ ఫ్రెండ్" తర్వాత మరో పదేళ్ల వరుసగా సినిమాలు చేస్తారు. వీళ్లిద్దరు తమ పర్ ఫార్మెన్స్ తో ఆకట్టుకుంటారు. అల్లు అరవింద్ గారు లేకుంటే నేను లేను. ఆయన మాకు గాడ్ ఫాదర్. అన్నారు.నిర్మాత బన్నీ వాస్ మాట్లాడుతూ, "ది గర్ల్ ఫ్రెండ్" సినిమా నేను`హశాను. చివరి 30 నిమిషాల సినిమాను మర్చిపోలేక పోతున్నాను. రశ్మిక మా గీతా ఆర్ట్స్ గీత.ఈ సినిమాలో తను అద్భుతంగా పర్ ఫార్మ్ చేసింది. ఈ సినిమా చూశాక దీక్షిత్ ను కూడా మర్చిపోలేము. థియేటర్స్ లో కూర్చున్న అమ్మాయిల్లో 60 పర్సెంట్ ఈ కథకు బాగా కనెక్ట్ అవుతారు. ఇది మీరు బాగా కనెక్ట్ అయ్యే కథ. తమ గర్ల్ ఫ్రెండ్ తో ఈ సినిమాకు వెళ్లే అబ్బాయిలు జాగ్రత్తగా ఉండండి. ప్రొడ్యూసర్స్ విద్యా, ధీరజ్ ఈ చిత్రంతో మంచి పేరు తెచ్చుకుంటారు.

# వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ,యువి క్రియేషన్స్‌తో శరవేగంగా జరుగుతున్నషూటింగ్




వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ, యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్, ఎస్ థమన్ విటి15 హైదరాబాదులో శరవేగంగా జరుగుతున్న షూటింగ్ మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ విటి15, టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ డైరెక్షన్‌లో, యువి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో గ్రాండ్‌గా రూపొందుతోంది.

ప్రస్తుతం ఈ సినిమా షూటింగు హైదరాబాదులో శరవేగంగా జరుగుతోంది మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, ముఖ్య తారాగణం పాల్గొంటున్న ఈ కృషియల్ షెడ్యూల్లో చాలా ఇంపార్టెంట్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు.

ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్-కామెడీ, ఇండియన్ కొరియన్ బ్యాక్డ్రాప్, యూనిక్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోంది. ఇప్పటికే ఇండియా, విదేశాల్లో మూడు మేజర్ షెడ్యూల్స్ కంప్లీట్ చేసి, గ్రాండ్ విజువల్స్‌ని క్యాప్చర్ చేశారు.ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. తొలిప్రేమ తర్వాత వరుణ్ - థమన్ కాంబో మరోసారి అదరగొట్టే ఆల్బమ్ ఇవ్వబోతోంది. త్వరలోనే మేకర్స్ ఎక్సైటింగ్ అప్డేట్స్‌తో అలరించబోతున్నారు.

తారాగణం: వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య
రచన, దర్శకత్వం : మేర్లపాక గాంధీ
నిర్మాతలు: గిజు క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్
సంగీతం: ఎస్ థమన్
పీఆర్వో: వంశీశేఖర్ మార్కెటింగ్: హాష్‌ట్యాగ్ మీడియా.

# సంగీత యువరాణులు



**మ్యూజిక్ బ్యాండ్లు అనగానే చాలావరకూ మగవాళ్లే గుర్తిస్తారు. అమ్మాయిలు ఉన్నా ఒకరో ఇద్దరో! కానీ ఈ బ్యాండ్లులు అలాకాదు...** ఇవి ఏర్పడింది మొత్తం అమ్మాయిలతోనే!

'రిథమ్ ప్రిన్సెస్' ఒడిశాలో తొలి అమ్మాయిల మ్యూజిక్ బ్యాండ్, ప్రియాన్సీ మొహాపాత్ర, సౌమ్య శీతల్, ఐరా కిషోరీ, అనన్య, స్మృతి ఈ బృందంలో సభ్యులు. వీళ్లంతా విద్యార్థులే. వయసూ 16 నుంచి 18 ఏళ్ల మధ్యే ఉంటుంది. వీళ్లలో ఇద్దరు కీబోర్డు ప్లేయర్లు, ఒక్కొక్కరుగా గిటారిస్టు, శాక్సాపోనిస్ట్, ఆక్టాపాడ్ వాద్యకారిణులు ఉన్నారు. నిజానికి వీళ్లంతా విడివిడిగా సంగీత సాధన చేసేవాళ్లు. ఓ వ్యక్తి కారణంగా టీమ్‌గా మారారు. తాజాగా బ్రహ్మపురంలో ఓ స్టేజ్ షో చేసి.... అందరికీ పరిచయమయ్యారు. 'మా కళను ఇంత పెద్ద స్టేజీ మీద ప్రదర్శించడం చాలా ఆనందంగా ఉంది. వ్యక్తిగతంగా చాలా ప్రదర్శనలే ఇచ్చా. కానీ ఓండ్‌గా మారి ఇంతమంది ప్రేక్షకుల ముందు బ్యాండ్ ఇవ్వడం కొత్తగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం అంటోంది ఆక్టాపాడ్ వాద్యకారిణి సౌమ్య శీతల్. ఇక, ఐరా కిషోరీ 'ఒడిశాలో నేనే తొలి మహిళా షాక్‌ను మా అయిదుగురికీ సంగీతమంటే ప్రాణం. ప్రదర్శనలంటే భయం లేదు. దీంతో ఎక్కడికైనా ధైర్యంగా వెళ్లగలం' అంటోంది. లఖ్‌నవూకు చెంది 'మేరీ జిందగీ' రాక్ బ్యాండ్ కూడా ఐదుగురు మహిళలతోనే ఏర్పాటైంది. అయితే వీళ్ల మెరిసే దుస్తుల్లో కాదు.. సంప్రదాయ చీరకట్టులో కన్నిసూనత సరికొత్త ట్రెండ్‌నీ సృష్టించారు. 2010లో ప్రారంభమైన ఈ బ్యాండ్‌కు రేడియో జాకీ జయ తివారీ నాయకత్వం వహిస్తున్నారు. మహిళలు ఇంట్లో, పని విషయంలో, బంధువుల మధ్య ఎదుర్కొంటుననన వివక్షపై గళమెత్తాలనే ఉద్దేశంతో ఈ విమెన్ రాక్ బ్యాండ్‌ని ప్రారంభించారీమె. లింగ సమానత్వం కోసం వీళ్ల చేస్తున్న కృషికీ అభిమానులెక్కువే. □

# ప్రధాని ప్రశంసించిన యువ బాక్సర్




**పేదరికానికి పంచ్ ఇచ్చి.. ఛాంపియన్‌గా నిలిచింది! ప్రతిభకు ప్రోత్సాతే.. అనుకున్నది సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. ఇదే విషయం నిరూపించింది బాక్సర్ మీనాక్షి హుడా. ఇటీవలే లివర్‌పూల్ వేదికగా జరిగిన 'ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్'లో స్వర్ణ పతకం గెలుచుకుంది. పేదరికాన్ని జయించి.. సమాజపు ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఆమె సాధించిన ఈ విజయాన్ని ప్రధాని మోదీజీ కూడా ప్రశంసిం చారు. దీంతో ఈ యువ బాక్సర్ స్టోరీ తెలుసుకుందాం.**

నాన్న ఒప్పుకోలేదు! ... ఆడపిల్లలపై ఆంక్షలు ఉండే హరియాణా రాష్ట్రంలో పుట్టి పెరిగిందిమీనాక్షి. అక్కడి రోహ్‌తక్ జిల్లాలోని రూర్కీ గ్రామం. తండ్రి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నలుగురు తోబుట్టువుల్లో చిన్నదైన మీనాక్షి చిన్నతనం నుంచి బాక్సింగ్ క్రీడాకారిణి కావాలని కలలుకంది. సులభం కాదు. అసలే పేదరికం.. దానికి తోడు ఆడపిల్ల ఆటల్లోకొస్తానంటే నలుగురూ నానా రకాలుగా అనుకుంటారు. పైగా బాక్సర్ ప్రత్యేకమైన ఆహార నియమాలు పాటించాల్సి ఉంటుంది.' ఇలా ఆలోచించి తన తండ్రి వెనకడుగు వేశాడంటోంది మీనాక్షి. నేను బాక్సింగ్ నేర్చుకోవడం మొదట మా నాన్నకు ఇష్టం లేదు. ఎందుకంటే ఈ ఆటలో శిక్షణ ఇప్పించడం ఖర్చుతో కూడుకున్నదని ఆయన భావించేవాడు. అంతేకాదు.. మా బంధువులు, ఇరుగుపొరుగు వారు 'నీ కూతురు బాక్సింగ్‌లో కొస్తే రేపు ఆమెను ఎవరు పెళ్లిచేసుకుంటారు? అనేవారు ఇవన్నీ నాన్నను ఎంతో బాధపెట్టేవి. ఇలాంటి పరిస్థితుల్లో అమ్మే నా వెన్నుతట్టింది. నీ ప్రతిభతోనే అందరికీ సమాధానం చెప్పాలి..' అంటూ నాలో ప్రోత్సాహం నింపింది. అని చెబుతూ తన చిన్ననాటి సంగతుల్ని గుర్తు చేసుకుంది యువ బాక్సర్.

**కిట్, శిక్షణ ఉచితంగానే..!** ఇలా తన తల్లి ప్రోత్సాహంతో ఓరోజు స్థానిక బాక్సింగ్ అకాడమీకి వెళ్లింది మీనాక్షి. అక్కడి కోచ్ విజయ్ హుడా ఆమెలోని ప్రతిభను, ఆట పట్ల తనకున్న అంకితభావాన్ని పరీక్షించి చూశారు. దీంతో ఆయనే తనకు ఉచితంగా కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెబుతోందామె. 'నా కోచ్ విజయ్ సర్ నాకు బాక్సింగ్ కిట్ ఇచ్చారు. ఉచిత శిక్షణ ఇచ్చారు. శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలో నాకు సూచించారు. రోజూ రింగ్‌లో సాధన చేయడమే కాదు.. ఇంటికొచ్చాక ప్రాక్టీస్ చేసేదాన్ని. ఇలా ఆటపై నాకున్న మక్కువను చూసి ఓరోజు మా నాన్న మనసు కూడా మారిపోయింది. ఎలాగైనా నేను ఆ రాణించేలా ప్రోత్సహించాలను కున్నాడు. తన సంపాదనలో కొంత వరకు వెచ్చించి కోచ్ సూచించిన ప్రత్యేకమైన డైటిని నాకు అందించేవాడు. అప్పు చేసి నన్ను పోటీలకు పంపించేవాడు. మ్యాచ్‌లకూ హాజరవుతూ నా చీర్ లీడర్‌గా మారిపోయాడు.. అంటోన్న మీనాక్షి .. ఆయా పతకాలు సాధిస్తూ ఇంతింతై అన్నట్లుగా మెట్టు ఎక్కుతూ ముందుకు సాగింది.



**మోదీజీ ఫోన్ కాల్ ... !** తొలుత సబ్ జూనియర్ స్థాయిలో, ఖేలో ఇండియా స్కూల్ గేమ్స్‌లో పతకాలు ఒడిసిపట్టిన మీనాక్షి. 2019లో యూత్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్' స్వర్ణ పతకం సాధించింది. ఆపై 'సీనియర్ నేషనల్ ఛాంపియన్షిప్స్', 'ఏషియన్ అమెచ్యూర్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్'లో వరుసగా రజత పతకాలు కైవసం చేసుకున్న ఈ యంగ్ బాక్సర్.. ఈ క్రమంలో మేటి క్రీడాకారుల్ని ఓడించి శభాష్ అనిపించుకుంది. ముందుగా 52 కిలోల ఫ్లైవెయిట్ పోటీ కిలోల ఫ్లైవెయిట్ విభాగంలో పోటీపడిన మీనాక్షి.. ఆపై 48 కిలోలల మారింది. ఇటీవల ఇంగ్లండ్‌లోని లివర్‌పూల్ వేదికగా జరిగిన 'ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్స్-2025' పోటీల్లోనూ ఇదే విభాగంలో పోటీ పడిన ఆమె.. పసిడి పతకం తన ఖాతాలో వేసుకంఉది. ఈ గేమ్‌లో పలుమార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన, ఒలింపిక్స్ తక విజేత అయిన కజకిస్థాన్ క్రీడాకారిణి నాజిమ్‌ను మీనాక్షి 4-1 స్కోర్‌తో ఓడించడం విశేషం. ప్రపంచ ఛాంపియన్ కావాలనేది నా కళ. నేడు అది కాకారమైంది. అయితే ఇది ఆరంభం మాత్రమే! భవిష్యత్తులో ఇలాంటి విజయాలు మరెన్నో సాధించా లని, దేశానికి గర్వకారణంగా నిలవాలన్న లక్షనయంతో ముందుకు సాగుతున్నా. ఇక ఈ విజయానికి మరో ప్రత్యేకత ఉంది. అదేంటంటే.. స్వయంగా ప్రధాని మోదీజీ నాకు ఫోన్ చేసపి అభినందనలు తెలిపారు. నువ్వు ఎంతోమంది యువతకు స్ఫూర్తి అంటూ కితాబిచ్చారు. ఆ ప్రశంస ఎప్పటికీ మర్చిపోను. ఎప్పటికైనా నాన్న గర్వపడేలా చేయాలనుకున్నా..చేశా! అంటోన్న మీనాక్షి.. 2021 నుంచి 'ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్'గానూ విధులు నిర్వర్తిస్తోంది. □

# తెలుసుకుందాం..

★ కొబ్బరి ఎక్కువ రోజులు బయట నిల్వ ఉండదు కదా.. కానీ చిన్నచిన్నగా తరిగి ఒక పాలిథిన్ కవర్‌లో పెట్టి ఫ్రీజర్‌లో ఉంచితే తొందరగా పాడవ్వదు. చట్నీ, ఇంకా కొబ్బరితో ఏమైనా చేయాలనుకునే ముందు కొద్దిసేపు చల్లని నీటిలో నానబెడితే అది సాధారణ స్థితికి వచ్చేస్తుంది. ఇలా చేయడం వల్ల కొబ్బరి ఎక్కువ కాలం తాజాగా ఉంటుంది. ★. బంగాళాదుంపను ఇతర కాయగూరలతో కలిపి వండేటప్పుడు ఒక చిట్కా పాటించాలి. అవి నిజానికి ఇతర కూరగాయల కంటే నెమ్మదిగా ఉడుకుతాయి. ఎందుకంటే వీటిలోపల స్టార్చ్ ఉంటుంది. తరిగినప్పుడు దాని ప్రభావంతో వేడి నెమ్మదిగా ముక్కలోకి వెళ్లి కూర ఉడకడం ఆలస్యం అవుతుంది. అందుకే ఆలూని కట్ చేశాక చల్లని నీళ్లలో కొద్దిసేపు నాననివ్వాలి. □

# ముఖాన్ని మెరిపించాలంటే ..



ముఖంమీద ఉన్న మచ్చల్ని పోగొట్టి చర్మాన్ని మృదువుగా చేస్తాయి. లేదా రెండు టేబుల్‌స్పూన్ల సెనగపిండిలో నాలుగు టేబుల్‌స్పూన్ల రోజ్‌వాటర్ పోసి పేస్టులా చేసి ముఖానికి పట్టించి 20 నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇది చర్మం మీదున్న టాక్సిన్లనీ మృతకణాలనీ తొలగించి మెరిసేలా చేస్తుంది.

టేబుల్‌స్పూను బేకింగ్‌సోడాలో ఒకటిన్నర టీస్పూన్ల నీళ్ల పోసి పేస్టులా కలిపి ముఖంమీద మర్దన చేసినట్లుగా రుద్ది ఐదు నిమిషాల తరవాత గోరువెచ్చని నీళ్లతో కడిగేసినా మచ్చలన్నీ పోయి తేటగా అవుతుంది.

బొప్పాయిపండు ముక్కని తీసుకుని దానికి టీస్పూను నిమ్మరసం, టీస్పూను పాలు జోడించి మిక్సీలో మెత్తగా రుబ్బాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 20 నిమిషాల తరవాత కడిగేసినా ఫలితం ఉంటుంది. ఇందులోని నిమ్మరసం, బొప్పాయి కలిసి చర్మాన్ని బ్లీచ్ చేస్తే, పాలు మృదువుగా మెరిసేలా చేస్తాయి. □

**అరటిపండు, టీస్పూను నిమ్మరసం, టీస్పూను తేనె తీసుకుని అన్నీ మిక్సీలో వేసి మెత్తగా చేయాలి.** ముఖాన్ని శుభ్రంగా కడిగి పొడి టవల్‌తో తుడిచి ఆ మిశ్రమాన్ని పట్టించి పావుగంట తరవాత గోరువెచ్చని నీళ్లతో కడగాలి. అరటిపండులోని ఎ, బి, ఇ విటమిన్లూ పొటాషియం అన్నీ కలిసి

# నట్‌మెగ్ గ్రేటర్



మసాల కూరలు, ఫ్రైడ్ రైస్, బిర్యానీల్లో జాజికాయ వాడతాం. దాన్ని ముక్కలు చేసేకంటే పొడి చేసి వేస్తే మరింత రుచిగానూ ఉంటుంది. కొద్ది పరిమాణమే సరిపోతుంది కూడా. మరి జాజి కాయను సులువుగా పొడి చేయాలంటే నట్‌మెగ్ గ్రేటర్ అనువుగా ఉంటుంది. ఈ చిన్న సాధనంతో అల్లం, శొంఠి మొదలైనవాటిని కూడా తురమొచ్చు. □

# పోషకాల ఉసిరి రుచులు

కార్తీకమాసం వచ్చిందంటే.. ఉసిరి వంటకాలకి రెడ్‌కార్పెట్ పరిచేస్తాం కదా! ఈసారి కూడా వగరు ఉసిరికి కాసనత తీపి, మరికాస్త ఘాటు, ఇంకాస్త కమ్మదనం కలిపేసి భిన్నమైన వంటకాలు చేసేద్దాం.

## ఉసిరికాయ నువ్వుల పచ్చడి..

**కావాల్సినవి:** ఉసిరికాయలు 500గ్రా, పచ్చిమిర్చి 150గ్రా, నువ్వులు 50గ్రా, జీలకర్ర చెంచా, ఆవాలు చెంచా, ఉప్పు 100గ్రా, పసుపు తగినంత, మెంతులు పావుచెంచా, వెల్లుల్లిపాయ ఒక ఇంగువ పావుచెంచా, 200 గ్రా.




**తయారీ:** ఉసిరికాయల్ని శుభ్రం చేసి తడిలేకుండా తుడుచుకోవాలి. జీలకర్ర, మెంతులు, ఆవాలు, నువ్వులని పొడిగా వేయించుకుని, చల్లారాక మిక్సీలో మెత్తగా పొడికొట్టుకోవాలి. పచ్చిమిర్చి, వెల్లుల్లిపాయ రెబ్బల్ని విడిగా, విడిగా మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. వెడల్పాటి పాన్‌లో నూనె పోసి.. వేడెక్కాక ఉసిరికాయల్ని వేసి చిన్నమంట మీద ఎక్కడా పచ్చిలేకుండా మగ్గించుకుని పక్కన పెట్టుకోవాలి. అదే నూనెలో ముందుగా చేసి పెట్టుకున్న నువ్వుల పొడి, పచ్చిమిర్చి పేస్ట్, వెల్లుల్లి పేస్ట్, ఇంగువ, ఉప్పు వేసుకుని నూనెలో మగ్గించుకోవాలి. గరిటెతో కలుపుతూ ఉంటే కాసేపటికి నూనె వేరవుతూ ఉంటుంది. అప్పుడు వేయించి పెట్టుకున్న ఉసిరికాయల్ని కూడా వేసి మరో పదినిమిషాలన్నా మగ్గించుకుంటే పచ్చడి సిద్ధం. ఇది నెలరోజులు నిల్వ ఉంటుంది. ఫ్రిజ్‌లో పెడితే మూడునెలల వరకూ ఉంటుంది.

## కొబ్బరి పచ్చడి..

**కావాల్సినవి:** ఉసిరికాయలు ఐదు, కొబ్బరికోరు కప్పు, పచ్చిమిర్చి నాలుగు, జీలకర్ర అరచెంచా, నూనె తగినంత, ఉప్పు తగినంత, నిమ్మరసం చెంచా, ధనియాలు అరచెంచా తాలింపు కోసం: ఆవాలు, శనగపప్పు, మినపప్పు, జీలకర్ర, పసుపు పావుచెంచా చొప్పున, కరివేపాకు, కరివేపాకు రెబ్బ, ఎండుమిర్చి ఒకటి, ఇంగువ పావుచెంచ



**తయారీ:** ఉసిరికాయల్లో తడిలేకుండా చేసి వాటిల్లోని గింజలని తీసేయాలి. స్టౌపై పాన్ పెట్టి వేడెక్కాక... చెంచాన్నర నూనె పోసుకోవాలి. వేడెక్కాక పచ్చిమిర్చి, ధనియాలు, జీలకర్ర వేసి వేయించి పక్కన పెట్టుకోవాలి. అదే పాన్లో మరో చెంచాన్నర వేసుకొని అందులో ఉసిరిముక్కల్ని తక్కువ మంట మీద ఐదునిమిషాలు వేయించుకోవాలి. రోటిలో లేదా మిక్సీలో వేయించి పెట్టుకున్న పచ్చిమిర్చి, జీలకర్ర, ధనియాలని కచ్చాపచ్చాగా దంచుకోవాలి. అందులో వేయించిన ఉసిరిముక్కలు ఉప్పు కూడా వేసి రుబ్బుకోవాలి. అవన్నీ నలిగాక అప్పుడు కొబ్బరికోరు వేసి మళ్లీ రుబ్బుకోవాలి. పాన్లో ఇంగువ తాలింపు వేసి స్టౌ కట్టేసి, అందులో రుబ్బిన కొబ్బరి మిశ్రమాన్ని వేసి బాగా కలపాలి. ఈ ఉసిరి కొబ్బరి పచ్చడిలో కాస్త నెయ్యి వేసుకుంటే అన్నంలోకి భలే రుచిగా ఉంటుంది.



## సాల్ట్ క్యాండీలు ..

**కావాల్సినవి:** ఉసిరికాయలు అరకేజీ, పంచదార రెండు చెంచాలు, ఉప్పు తగినంత

తయారీ: ఉసిరికాయల్ని కడిగి శుభ్రం చేసి, తడిలేకుండా తుడిచిక్ కవర్‌లో ఉంచి డీప్ ఫ్రిజ్‌లో పెట్టాలి. ఒక రోజు తర్వాత వీటిని తీస్తే పెద్దగా శ్రమ లేకుండా చాకుతో క్యాండీలకు కావాల్సిన విధంగా ముక్కలు చేసుకోవచ్చు. ఇప్పుడా ఆమ్లా ముక్కలపై మనకి కావాల్సిన పరిమాణంలో ఉప్పు వేసుకోవాలి. ఉప్పు మరీ ఎక్కువగా ఉన్నా తినలేం. కాబట్టి కాస్త తగ్గించి వేసుకుంటే మేలు. ఆపై పంచదారని కూడా వేసుకుని బాగా కలపాలి. మరుసటిరోజుకి ఈ ముక్కలు బాగా ఊరతాయి. ఆ తర్వాత నాలుగు రోజులు ఎండలో ఉంచితే సాల్ట్ క్యాండీస్ సిద్ధమవుతుంది. ఈ ముక్కలతో ఉసిరి పులిహోరచేసుకోవచ్చు. దధ్యోజనంలో వేసుకున్నా రుచిగా ఉంటాయి.



## మురబ్బా..

**కావాల్సినవి:** ఉసిరికాయలు20, పంచదార రెండున్నర కప్పులు, యాలకులపొడి పావుచెంచా, కుంకుమపువ్వు ఐదు పలుకులు

**తయారీ:** ఉసిరికాయల్ని కడిగి శుభ్రం చేసి వాటికి ఫోర్క్‌పు గాట్లు పెట్టాలి. స్టౌ వెలిగించి ఒక పాత్రలో నీళ్లు తీసుకుని ఉసిరికాయల్ని ఉడికించి, నీళ్లు వార్చుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు పాన్లో మూడుకప్పుల నీళ్లు తీసుకుని పంచదార వేసి కరిగించుకోవాలి. ఇందులోనే ఉసిరికాయల్ని కూడా వేసి మెత్తగా అయ్యేలా అరగంటపాటు ఉడికించుకోవాలి. ఈపాకాన్ని రెండు రోజులు పాటు ఉంచితే ఉసిరికాయలు బాగా ఊరతాయి. ఆ తర్వాత పాకం నుంచి ఉసిరికాయల్ని వేరుచేసి మరోసారి పొయ్యిమీద పాకాన్ని పెట్టి యాలకులపొడి, కుంకుమపువ్వు కూడా చేసి తీగపాకం రానివ్వాలి. తిరిగి ఉసిరికాయల్ని కలిపితే మురబ్బా సిద్ధం. ఇవి పాటు ఏడాది నిల్వ ఉంటుంది.



## ఉసిరి కారం ..

**కావాల్సినవి:** ఉసిరికాయలు మూడు, ఉల్లిపాయలు ఒకటి(చిన్నది), వెల్లుల్లి రెబ్బలు మూడు, నూనె మూడు చెంచాలు, కారం రెండు చెంచాలు, ఉప్పు తగినంత, తాలింపు కోసం: ఆవాలు పావుచెంచా, జీలకర్ర పావుచెంచా. కరివేపాకు ఒక రెబ్బ



**తయారీ:** ఉసిరికాయల్ని శుభ్రం చేసుకోవాలి. తర్వాత వాటిని ముక్కలు చేసి గింజలు తీసి ఉల్లిపాయముక్కలు, వెల్లుల్లితో కలిపి మిక్సీ పట్టుకోవాలి. స్టౌపై పాన్పెట్టి మూడు చెంచాల నూనె పోసి వేడెక్కాక జీలకర్ర, ఆవాలు, కరివేపాకు వేసి తాలింపు వేసుకోవాలి. ఇందులో రుబ్బి పెట్టుకున్న ఉసిరిముద్దను చేసుకుని పచ్చివాసన పోయేవరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత కారం, ఉప్పు వేసి కాసేపు ఉడకనివ్వాలి. మరి కాసేపటికి నూనె వేరవుతుంది. అప్పుడు దింపేయాలి. ఇది టిఫిన్లలోకి, అన్నంలోకి కూడా బాగుంటుంది. □

# చెలి చిట్కాలు

★ కాకర కాయ రసము రోజూ ఒక చెంచా సేవించటం వలన చర్మం నున్నగా వుండి మొటిమలు రాకుండా అరికడుతుంది.

★ కొంచెం వేపాకు మెత్తగానూరి దానికి చందనంంపొడి కలిపి మొటిమల మీద పూసి గంటతర్వాత స్నానం చేయండి. మొటిమలు పోతాయి.

★ పుదీనా ఆకులను మెత్తగానూరి ప్రతిరోజు రాత్రిపూట ముఖానికి రాసి ప్రొద్దుట గోరు మెచ్చని నీటితో కడిగివేయాలి. ఈ విధముగా చేయడం వలన మొటిమలు మచ్చలు పోతాయి.

★. మందుల షాపులలో లభించే క్లియరాసిల్ అయింట్‌మెంట్ ప్రతీరోజూ రాత్రిపూట రాసుకొని ఉదయం గోరుమెచ్చని నీటితో కడగండి. మొటిమలు నివారణ అవుతాయి. □

# ఆయన నామంలోనే 'రక్షణ' ఉంది

'యెహోవా **నామము బలమైన దుర్గము.** నీతిమంతుడు అందులోనికి పరుగెత్తి సురక్షితముగా నుండును' (సామెతలు 18:10). 'ఎవనివలనను రక్షణ కలుగదు, ఈ నామముననే మనము రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏ నామమున రక్షణ పొందలేము అనెను' (అపొస్తలుల కార్యములు 4:12). ఈలోకంలో దేవతలు, దేవుళ్ల అనేవారు చాలామంది ఉన్నారు. ఎవరి విశ్వాసం వారిది, ఎవరి నమ్మకం వారిది. కానీ 'యేసుక్రీస్తు' నామంలోనే తప్ప మరొక నామంలో 'రక్షణ' అనేది లేదు. ఎందుకంటే ఆయన మాత్రమే సర్వమానవాళి కోసం మరణించాడు. ఆయన ఏ పాపం చేయలేదు, ఆయన పుట్టుకే పరిశుద్ధమైనది. ఆయన పరిశుద్ధంగా జీవించాడు. మనందరి పాపాన్ని తనపై వేసుకుని మరణించాడు. అందుకే యేసుక్రీస్తు స్వయంగా చెబుతున్నాడు 'కుమారుని చూచి ఆయన యందు విశ్వాసముంచు ప్రతివాడును నిత్యజీవము పొందుటయే నా తండ్రి చిత్తము, అంత్యదినమున నేను వానిని లేపుదును' (యోహాను 6:40). యేసుప్రభువును విశ్వసించేవారు మాత్రమే నిత్యజీవాన్ని పొందుతారు. అంటే పరలోకానికి ప్రవేశించి, సదా ఆయనను స్తుతించగలరు. ప్రభువు తన ప్రాణాన్ని మనకోసం ఇచ్చాడు కాబట్టి, తను మాత్రమే నిజమైన దేవుడని చెప్పాడు. అందుకే యేసుక్రీస్తు బలమైన దుర్గము, నీతిమంతుడు అందులో పరుగెత్తి సురక్షితంగా ఉంటాడు. అంటే ఆయనను విశ్వసించేవారు పరలోకంలో ఉంటారు. లేకపోతే నిత్యనరకమే. ఇదే విషయాన్ని పేతురు నొక్కిచెప్పాడు. అలాగని ఆయన ఎవరిని బలవంతం చేసేవాడు కాదు. తన ప్రేమను రుచిచూసి తెలుసుకుని, తనను వెంబడించమని దేవుడు చెబుతున్నాడు. గుడ్డిగా నమ్మి, వెంబడించమని చెప్పేవాడు కాదు. రుచి చూసి, ప్రేమను అనుభవించి, వెంబడించడమే ధన్యత. నిత్యనరకం నుంచి తప్పించబడతారు. చాలామంది మతానికి, ఆచారసాంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. ఇందులో తప్పు లేదు. కానీ ఇదే రక్షణకు అనువైనమార్గమని భ్రమపడుతున్నారు. రక్షణ అనేది దేవుడికి మనకు మధ్య ఉండే అనుబంధానికి హేతువు. 'యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించినయెడల, నీవు రక్షింపబడుదువు' (రోమా 10:9) నోటితో ఒప్పుకుని, హృదయంతో విశ్వసిస్తే, రక్షణ అనేది వస్తుంది. ఈ అనుభవం గుండా పయనిద్దామా!

-పి.వాణిపుష్ప



అంతర్వాణి

## వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్..
# నేహా, పుల్కిత్, సృష్టి, నిషు కాంస్యాలు
### భారత్ ఖాతాలో నాలుగు పతకాలు

**న్యూఢిల్లీ:** అండర్ 23 ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో నేహా శర్మ, పుల్కిత్, సృష్టి, నిషు కాంస్య పతకాలను సాధించారు. ఇదే సమయంలో హన్సిక లాంబా, సరిక మహిళల 53 కిలోలు మరియు 59 కిలోల బంగారు పతక పోటీలలో ప్రవేశించారు. సెర్బియాలో జరిగిన ఛాంపియన్‌షిప్ లో భారత మహిళల ఫ్రీస్టైల్ రెజ్లర్లు నాలుగు కాంస్య పతకాలను గెలుచుకుని తమ ప్రతిభను కనబరిచారు. నిషు (55



కిలోలు), నేహా శర్మ (57 కిలోలు), పుల్కిత్ (65 కిలోలు), సృష్టి (68 కిలోలు) అద్భుతమైన విజయాల తర్వాత కాంస్య పతకాలను గెలుచుకుని భారత పతకాల సంఖ్యను ఆరుకు చేర్చారు. అలాగే హన్సిక లాంబా (53 కిలోలు) సరిక (59 కిలోలు) ఫైనల్‌కు చేరుకున్నారు. ఇక 53 కిలోల ఫైనల్‌కు చేరుకునే మార్గంలో వర్ధమాన క్రీడాకారిణి హన్సిక లాంబా వరుస ప్రదర్శనలు ఇచ్చింది. ఆమె విక్టోరియా వోక్‌పై 11-0 టెక్నికల్ సుపీరియారిటీ విజయంతో ప్రారంభించి, ఆ తర్వాత కజకిస్తాన్‌కు చెందిన జైనెప్ బయానోవాపై 8-2 విజయంతో, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన దిల్షోడా మట్నజరోవాపై 10-0 విజయంతో తన సెమీఫైనల్ స్థానాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు సరికా తన ప్రత్యర్థులను అధిగమించింది, యుఎస్ఎ కి చెందిన అలెక్సిస్ జానక్ పై 4-2 విజయంతో ప్రారంభించి, ఆపై నార్వేకి చెందిన ఒథెలీ హోయిపై 5-2తోను, ఆ తర్వాత సెమీఫైనల్స్‌లో పోలాండ్‌కు చెందిన ఓల్హా పడోషిక్‌పై 12-6 తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌లో తన స్థానాన్ని బుక్ చేసుకుంది.



ఆట

## ఆస్ట్రేలియాతో ఆఖరి వన్డే..
# దుమ్ములేపిన రోహిత్, కోహ్లీ జోడీ
### 9 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం

**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా తొలి రెండు వన్డేల్లో ఓటమి పాలైన టీమిండియా చివరిదైన మూడో వన్డేలో మాత్రం అదరగొట్టింది. సిడ్నీ వేదికగా శనివారం జరిగిన ఈ మ్యాచలో అగ్రశ్రేణి బ్యాటర్లైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల పవర్‌ప్యాక్డ్ ప్రదర్శనతో భారత్ ఈ మ్యాచ్‌ను వన్ సైడ్ చేసి 9 వికెట్ల తేడాతో గెలిచి, సిరీస్‌ను విజయంతో ముగించింది. యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా నాలుగు వికెట్లతో ఆస్ట్రేలియాను 236 పరుగులకే కట్టడి చేయగా, రోహిత్ సెంచరీ, కోహ్లీ హాఫ్ సెంచరీతో టీమిండియాకు అఖండ విజయాన్ని అందించాయి. ఈ వన్డేలో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న ఆస్ట్రేలియా భారత బౌలర్ల ధాటికి 50 ఓవర్లు కూడా ఆడలేకపోయింది. కేవలం 46.4 ఓవర్లలోనే 236 పరుగులకు ఆలౌట్ అయ్యింది. భారత్ తరఫున యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా అత్యధికంగా 4 వికెట్లు పడగొట్టి ఆసీస్ పతనాన్ని శాసించాడు. వాషింగ్టన్ సుందర్ 2 వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, అక్షర్ పటేల్‌లకు చెరో వికెట్ లభించింది. ఆస్ట్రేలియా బ్యాటర్లలో మాట్ రెన్షా ఒక్కడే 56 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 237 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత్‌క శుభ్‌మన్ గిల్ రూపంలో 69 పరుగుల వద్ద తొలి ఎదురుదెబ్బ తగిలింది. గిల్‌ను జోష్ హేజిల్‌వుడ్ అవుట్ చేశాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మతో కలిసి ఆస్ట్రేలియా బౌలర్లకు ఏ మాత్రం అవకాశం ఇవ్వలేదు. ఈ ఇద్దరు దిగ్గజాలు కలిసి 168 పరుగుల మ్యాచ్ విన్నింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ భాగస్వామ్యం కారణంగా భారత్ కేవలం ఒక్క వికెట్ కోల్పోయి 38.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది, ఇంకా 69 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. రోహిత్ శర్మ 125 బంతుల్లో 13 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 121 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. విరాట్ కోహ్లీ 81 బంతుల్లో 7 ఫోర్లతో 74 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఆస్ట్రేలియా తరఫున జోష్ హేజిల్‌వుడ్ ఒక్క వికెట్ మాత్రమే తీయగలిగాడు.




## స్టార్ కంటెండర్‌లో
# మనికా విజయం
### దియా, జ్ఞానశేఖరన్ ఔట్

**న్యూఢిల్లీ:** డబ్ల్యూటిటిస్టార్ కాంటెండర్ లండన్-2025లో మొదటి రోజున భారత టేబుల్ టెన్నిస్ ఆటగాళ్లకు మిశ్రమ ఫలితాలు వచ్చాయి. ఇద్దరు తదుపరి రౌండ్‌కు చేరుకోగా, మరో ఇద్దరు రౌండ్ ఆఫ్ 32 లో నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో హర్మీత్ దేశాయ్ దక్షిణ కొరియాకు చెందిన హ్వాన్ బేను వరుస గేమ్‌లలో 11-8, 13-11, 11-4తో ఓడించి రౌండ్ ఆఫ్ 16కి చేరుకున్నాడు. తోటి భారత ఆటగాడు మానవ్ ఠక్కర్ కూడా తదుపరి దశలో తన స్థానాన్ని బుక్ చేసుకున్నాడు. కానర్ గ్రీన్‌ను నాలుగు గేమ్‌లలో 11-5, 8-11, 11-7, 11-9తో ఓడించాడు. అలాగే గట్టి పోటీ పడిన మ్యాచ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ ముందుకు సాగలేకపోయాడు. జపాన్‌కు చెందిన సోరా మత్సుషిమా చేతిలో 6-11, 10-12, 9-11 తేడాతో ఓడిపోయి పురుషుల సింగిల్స్‌లో తన ప్రచారాన్ని ముందుగానే ముగించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో, మానికా బాత్రా తన ప్రత్యర్థి మరియా జియావోపై అద్భుతమైన పునరాగమనం చేసింది. ఉత్కంఠ భరితమైన ఐదుసెట్ల మ్యాచ్‌ను 19-17, 8-11, 2-11, 11-8, 11-6తో గెలుచుకుని తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించింది. మరోపక్క దియా చిటాలే జపాన్‌కు చెందిన మివా హారిమోటో చేతిలో32వ రౌండ్‌లో తన టోర్నమెంట్ పరుగును ముగించింది. ఈ ఫలితాలతో, భారత్‌కు చెందినముగ్గురు ఆటగాళ్ళు సింగిల్స్ ఈవెంట్లలో ముందుకు సాగుతున్నారు.

## మహిళల వరల్డ్ కప్‌లో..
# ఒక్క విజయం లేని పాక్
### అవమానంతో నిష్క్రమణ.. శ్రీలంక ఆశలు కూడా అడియాసలే

**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్-2025 నుండి పాకిస్తాన్ జట్టు చివరి మ్యాచ్ ఆడకుండానే అవమానం భారం, బాధతో నిష్క్రమించింది. దీంతో పాక్ ఆడిన ఏడు మ్యాచ్‌ల్లోనూ ఒక్క విజయం కూడా లేకుండా పోయింది. శ్రీలంకతో జరగాల్సిన పాకిస్తాన్ ఫైనల్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది, ఫలితంగా పాక్ ఓటమితో టోర్నమెంట్‌ను ముగించింది. కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో వర్షం కారణంగా రద్దు చేయబడిన ఈ టోర్నమెంట్‌లోని ఐదవ మ్యాచ్ ఇది. దీంతో నిర్వాహకుల ప్రణాళికపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
శుక్రవారం కొలంబోలో నిరంతర వర్షం కారణంగా శ్రీలంక, పాకిస్తాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్ రద్దు చేయబడింది. మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 4.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 18 పరుగులు చేసిన సమయంలో వర్షం కురవడంతో మ్యాచ్ రద్దయింది. మరోవైపు శ్రీలంక జట్టు ఆశలు కూడా అడియాసలయ్యాయి. ఈ సమయంలో ఈశాన్య రుతుపవనాలు ఈ ప్రాంతంలో చురుగ్గా ఉంటాయనేది రహస్యం కాదు. అయినప్పటికీ, నిర్వాహకులు షెడ్యూల్‌ను కొనసాగించాలని నిర్ణయించుకున్నారు. మ్యాచ్‌ల రద్దు కూడా శ్రీలంక సెమీఫైనల్స్‌కు చేరుకోవాలనే ఆశలను దెబ్బతీసింది. ఎనిమిది జట్ల పట్టికలో ఆతిథ్య శ్రీలంక ఐదవ స్థానంలో నిలిచిం, ఒక విజయం, మూడు ఓటములు మరియు వర్షం కారణంగా రద్దు చేయబడిన మూడు మ్యాచ్‌లతో సహా ఐదు పాయింట్లు సాధించింది. ఈ తుది ఫలితం లేని చివరి గ్రూప్ మ్యాచ్‌లో, దశాబ్ద కాలంగా జట్టుకు నాయకత్వం వహించిన శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టుపై అందరి దృష్టి ఉంది.
35 ఏళ్ల ఆమె చివరి ప్రపంచ కప్ ఇదే కావడం విశేషం. ఆమె తన సుదీర్ఘమైన మరియు అద్భుతమైన కెరీర్‌లో అనేక విజయాలు సాధించింది. ఇక పాకిస్తాన్ ఏడు మ్యాచ్‌ల్లో కేవలం రెండు పాయింట్లు మాత్రమే సాధించింది. నాలుగు ఓటములు, మూడు ఫలితాలు రాలేదు. దీంతో టోర్నమెంట్‌లో ఒక్కటి కూడా గెలిచే అవకాశం లేకుండా పోయింది.



# వాణిజ్యం




## రిలయన్స్‌మెటా జాయింట్ వెంచర్ ఎఐ ప్రాజెక్ట్
### రూ.855 కోట్లతో అవగాహనకు వచ్చిన రెండు సంస్థలు

**ముంబయి, అక్టోబరు 25:** రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ కొత్త జాయింట్ వెంచర్‌ను ఏర్పాటుచేస్తోంది. రిలయన్స్ ఎంటర్‌ప్రైజ్ ఇంటెలి జెన్స్ ఫేస్‌బుక్ ఓవర్సీస్ ఇంక్ సంస్థతో కలిసి ఒప్పందంచేసుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు భారత్‌లో అందించేందుకు సిద్ధం అయింది. రిలయన్స్ ఇంటెలిజెన్స్ ఇందుకోసం 2కోట్లు ప్రాథమిక చందాగా పెట్టుబడిపెట్టింది. రెండు మిలియన్ల ఈక్విటీ వాటాలు కొనుగోలుచేసింది. కొత్తకంపెనీ ఆర్యీఐఎల్ రిలయన్స్ ఇంటెలిజెన్స్‌కు అనుబంధంగా కొనసాగుతుంది. ఆ తర్వాత ఫేస్‌బుక్‌తో కలిసి జాయింట్ వెంచర్‌సంస్థగా వస్తుంది. ఈ జాయింట్ వెంచర్‌లో మొత్తం పెట్టుబడులు 855 కోట్లుగా ఉంటాయి. రిలయన్స్ ఇంటెలిజెన్స్ 70శాతం వాటాతోను, ఫేస్‌బుక్ మిగిలిన 30శాతం వాటాతోను కొనసాగుతాయి. రెండుకంపెనీలు కూడా సంయుక్తంగా ముందు 855 కోట్లు ఈప్రాజెక్టుకోసం పెట్టుబడులు కేటాయించాయి. అయితే ఇందుకు ఎలాంటి చట్టపరమైన అనుమతులు అవసరం లేదని చెపుతున్నాయి. ఈ లావాదేవీ పార్టీ లావాదేవీ కిందకు రాదని, ఈ వెంచర్‌లో ప్రమోటర్లు లేదా గ్రూప్‌కంపెనీలకు కానీ ఎలాంటి ఆర్థిక ఆసక్తి లేకపోవడంతో చట్టపరంగా ఎలాంటి అనుమతులు అవసరం లేదని చెపుతున్నారు. అంతేకాకుండా ఆర్యీఐఎల్ విలీనానికి ఎలాంటి అనుమతులు కూడా అవసరంలేదని పేర్కొంటున్నాయి.

## అదానీ పెట్టుబడులపై
# ఎలాంటి ఒత్తిళ్లులేవు
### మాదే ఫైనల్ నిర్ణయం.. అదానీ గ్రూప్ వెల్లడి






**ముంబయి, అక్టోబరు 25:** ప్రభుత్వ రంగానికి చెందిన అతిపెద్ద జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అదానీ గ్రూప్ కంపెనీల్లోని తమ పెట్టుబడులపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చింది. ఈ పెట్టుబడులపై ఎవరి నుంచి ఎలాంటి ఒత్తిళ్లు లేవని ఇది తమ స్వతంత్ర నిర్ణయమేనని స్పష్టం చేసింది ఎల్ఐసీ. ఈ ఏడాది ప్రారంభంలో అప్పులు, అమెరికా సంస్థల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న సమయంలో అదానీ గ్రూప్ కంపెనీల్లో ఎల్ఐసీ పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టిందన్న మీడియా కథనంపై ఎల్ఐసి స్పందించింది. ఆరోపణలపై తాజాగా స్పందించిన ఎల్ఐసీ ఆకథనం తీవ్రంగా ఖండించింది.
ఈ మేరకు దానికి బదులుగా ట్విట్టర్‌లో ఒక పోస్ట్ చేసింది. ఇక్కడ ఆ కథనం పూర్తిగా నిరాధారం అని తెలిపింది. పెట్టుబడులపై తమదే తుది నిర్ణయం అని ఎల్ఐసీ బోర్డు ఆమోదించిన నిర్ణయాలకు అనుగుణంగానే తాము స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేసింది. దేశంలోని టాప్ 500 కంపెనీల్లో పెట్టుబడులు కొనసాగిస్తోంది ఎల్ఐసీ. 2014లో ఈ పెట్టుబడుల విలువ రూ. 1.56 లక్షల కోట్లుగా ఉండగా.. అది 2025 నాటికి 10 రెట్లు పెరిగి రూ. 15.6 లక్షల కోట్లకు చేరడం విశేషం. ఇక్కడ అదానీ గ్రూప్‌లో 4 శాతం వాటా కలిగి ఉంది. దీని విలువ సుమారు రూ. 60 వేల కోట్లుగా ఉంది. అదానీ గ్రూప్ మాత్రమే కాదు దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా టాటా గ్రూప్, ఐటీసీ ఇలా చాలా కంపెనీల్లో వాటాలు ఉన్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో 6.94 శాతం వాటాకు సమానమైన రూ. 1.34 లక్షల కోట్ల పెట్టుబడులు ఉన్నాయి. ఐటీసీలో 15.86 శాతం (రూ. 82,800 కోట్లు), బీడీనీది బ్యాంకులో రూ. 64,725 కోట్లు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ. 79,361 కోట్ల పెట్టుబడి ఉంది. ఇదే సమయంలో ఒక్క టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లోనే 5.02 శాతం వాటాకు సమానమైన రూ. 5.7 లక్షల కోట్ల పెట్టుబడులు ఎల్ఐసీకి ఉండటం విశేషం.

## రష్యాచమురు దిగుమతులపై అగ్రదేశాల
# ఆంక్షలు పాటిస్తాం
### రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడి




**ముంబయి, అక్టోబరు 25:** రష్యా ముడి చమురు దిగుమతులపై అమెరికా, బ్రిటన్, యూరోపియన్ యూనియన్ దేశాలు విధించిన ఆంక్షలను పాటిస్తామని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ప్రకటించింది. రిఫైనరీ ఉత్పత్తుల దిగుమతి విషయంలో ఈయూ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహారిస్తామని సంస్థ స్పష్టం చేసింది. అంతర్జాతీయ చట్టాలు, ఆంక్షల నిబంధనలు, నియంత్రణ మార్గదర్శకాలను ఎటువంటి ఉల్లంఘన లేకుండా పాటిస్తాం. ప్రస్తుతం అమెరికా, బ్రిటన్, ఈయూ ప్రకటించిన ఆంక్షల ప్రభావాన్ని సమీక్షిస్తున్నామని రిలయన్స్ వెల్లడించింది. ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధ చర్యలకు ప్రతిస్పందనగా అమెరికా తాజాగా రష్యా చమురు దిగుమతులపై కఠిన ఆంక్షలు విధించింది. రష్యా చమురు దిగ్గజ సంస్థలు 'రాస్‌నెఫ్ట్', 'లుకాయిల్'తో ఏ దేశం, కంపెనీ వ్యాపారం చేయరాదని హెచ్చరించింది. ఈ కంపెనీలతో కొనసాగుతున్న లావాదేవీలను నవంబర్ 21 నాటికి పూర్తిగా ముగించాలని అమెరికా స్పష్టం చేసింది. భారతదేశం రష్యా నుంచి రోజుకు సగటున 1.7 మిలియన్ బ్యారెళ్ల (ఎండీబీ) ముడి చమురు దిగుమతి చేసుకుంటోంది. అందులో దాదాపు 1.2 ఎండీబీ రాస్‌నెఫ్ట్, లుకాయిల్ సంస్థల నుంచే వస్తున్నట్లు అంచనా. ఇందులో రిలయన్స్, నయారా ఎనర్జీ వంటి ప్రైవేట్ రిఫైనరీలు ప్రధానంగా దిగుమతులు చేస్తున్నాయి. పాశ్చాత్య దేశాల ఆంక్షలు కఠినతరమవుతుండటంతో, భారతీయ కంపెనీలు ఇప్పుడు పశ్చిమాసియా దేశాల వైపు ముడి చమురు కొనుగోళ్లను మళ్లిస్తున్నాయి. పరిశ్రమ వర్గాల ప్రకారం, భవిష్యత్‌లో రష్యా చమురు దిగుమతులపై దేశీయ రిఫైనరీల వ్యూహం మారే అవకాశం ఉంది.

## చిన్న బ్యాంకుల్లోనే
# డిపాజిట్లపై వడ్డీలు ఎక్కువ!



**న్యూఢిల్లీ, అక్టోబరు 25:** ప్రైవేటురంగ పెద్దబ్యాంకులకంటే అదేరంగంలోని చిన్న బ్యాంకులు ఫిక్సెడ్ డిపాజిట్లపై వడ్డీరేట్లతో ఊరిస్తున్నాయి. 0.25 శాతంనుంచి 0.75శాతం వరకూ వీరికి వడ్డీ అధికంగా అందిస్తున్నాయి. దీనివల్ల ఎక్కువ డిపాజిట్లను కూడా రాబడుతున్నట్లు అంచనా. ఇఎస్ఎఫ్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 444 రోజులకు 8.10శాతం ఆఫర్‌చేస్తుంటే జన స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు 8శాతం అందిస్తోంది. మూడేళ్ల ఆపై ఐదేళ్ల డిపాజిట్లకుఈ వడ్డీలు ఇస్తోంది. సూర్యోదయ్ స్మాల్‌ఫైనాన్స్ బ్యాంకు కూడా 8.10శాతం సీనియర్ సిటిజన్లకు ఇస్తోంది. ఇక ఉత్కర్ష్ స్మాల్ ఫైనాన్స్‌బ్యాంకు 8.15శాతం వడ్డీ ఆఫర్‌చేస్తోంది. అయితే రెండుమూడేళ్లు కచ్చితంగా డిపాజిట్లు కొనసాగించాలి. ఇక ప్రైవేటురంగంలో మరికొన్ని బ్యాంకులు బంధన్‌బ్యాంకు రెండుమూడేళ్ల డిపాజిట్లపై 7.70శాతం, డిసిబి బ్యాంకు 37 నుంచ4 38 నెలల డిపాజిట్లకు 7.70శాతం, 70 ఏళ్లపైబడినవారికి అదనంగా 0.05శాతం అందిస్తోంది. సూపర్ సీనియర్లకు 0.25శాతం అదనపు ఆఫర్ అని చెపుతోంది. యెస్‌బ్యాంకుపరంగా చూస్తే 7.75శాతం డిపాజిట్లపై వడ్డీ ఇస్తోంది. ఇక ప్రభుత్వరంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 7.20శాతం 366 రోజుల డిపాజిట్లపై వడ్డీ ఇస్తోంది. సెంట్రల్‌బ్యాంకు 2222 లేదా 3333 రోజుల డిపాజిట్లపై 7.25శాతం ఇస్తోంది. ఇండియన్ బ్యాంకు 444 రోజుల డిపాజిట్లపై 7.20శాతం అదనంగా సూపర్‌సీనియర్లకు 0.25శాతం ఇస్తోంది. ఇక ఇండియన్ ఓవర్సీస్‌బ్యాంకు మాత్రం 444 రోజుల డిపాజిట్‌పై 7.20శాతం వడ్డీఇస్తోంది. 80ఏళ్లపైబడినవారికి 0.25శాతం ఇస్తోంది. మొత్తంగాచూస్తే చిన్న ఫైనాన్స్ బ్యాంకులే డిపాజిటర్లకు ఎక్కువ వడ్డీ ఎరవేస్తున్నట్లు తెలుస్తోంది.




## కోటక్‌బ్యాంకు నికర లాభం
# రూ.4468.27 కోట్లు!

**ముంబయి, అక్టోబరు 25:** ప్రైవేటురంగంలోని కోటక్ మహీంద్ర బ్యాంకు రెండోత్రైమాసికంలో 11.4శాతం లాభాల్లో క్షీణత నమోదుచేసింది. గత ఏడాది ఇదే కాలంఒ 5044.05 కోట్లు రాగా ఈ ఏడాది రెండోత్రైమాసికంలో 4468.27 కోట్లు ఆర్జించింది. ఇతర ఆదాయవనరులు, కేటాయింపుల్లో పెరుగుదలకారణంగా లాభాల్లో తగ్గుదలనమోదయిందని బ్యాంకు చెపుతోంది. ఏకీకృత విధానంలో బ్యాంకు నికరలాభం వార్షికపద్ధతిలోచూస్తే మూడుశాతం క్షీణించి 3253 కోట్లుగా ఉంది. కేటాయింపులు ఎకునకవని బ్యాంకు చెపుతోంది. నికరలాభం తొలిత్రైమాసికంలో 3282 కోట్లు ఆర్జించింది. బ్యాంకు నికరవడ్డీ ఆదాయం 4.15శాతం పెరిగి 7311 కోట్లుగా ఉంది. ఇతర ఆదాయవనరులపరంగా 3.5శాతం క్షీణించి 2589 కోట్లుగా ఉందని బ్యాంకు ప్రకటించింది. నికరవడ్డీమార్జిన్ 37 బేసిస్ పాయింట్లు క్షీణించి 4.54 శాతంగా ఉంది. బ్యాంకు నికరవడ్డీ మార్జిన్ తొలిత్రైమాసికంలో 4.65శాతంగా ఉంది. బ్యాంకు లాభదాయకతను నిర్ణయించేంది నికరవడ్డీ మార్జినే. ఇక తక్షణ కేటాయింపులు 43.5శాతంపెరిగాయి. 947 కోట్లుగా బ్యాంకు చూపించింది. ఏడాది క్రితం ఈ కేటాయింపులు 660 కోట్లుగా ఉన్నాయి. ఇక కేటాయింపులు, తక్షణవ్యయాలకింద మొత్తం 1208 కోట్లుగా తన నివేదికల్లో పొందుపరిచింది. ఇక నిరర్థక ఆస్తులపరంగా అడ్వాన్సుల్లో 1.39శాతంగా ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.